అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 17-01-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 8 | సంచిక : 332 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50



వందే భారత్ రైలును ఆన్‌లైన్‌లో జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్లే రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రులు అశ్విన్ వైష్ణవ్, కిషన్‌రెడ్డి, గవర్నర్ తమిళి సై ,రాష్ట్రమంత్రులు తలసాని,మహమూద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సీఎఫ్ఐఆర్ ఏర్పాటు

దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం

- సంతోషం...మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్)కు చెందిన సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ (సీఎఫ్ఐఆర్) సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు దావోస్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంతర్జాతీయ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కే తారకరామారావు నేతృత్వంలోని అధికారుల బృందం హాజరైన విషయం తెలిసిందే. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఇక్కడ ఈ సదస్సు జరగనుంది. తొలిరోజు సదస్సులో సీఎఫ్ఐఆర్ మేనేజింగ్ డైరెక్టర్ జెరేమీ జర్గన్స్, తెలంగాణ ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కే తారక రామారావు, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అధ్యక్షుడు బోర్జ్ బ్రెండే తదితరులు పాల్గొన్నారు. జీవ శాస్త్రాలు (లైఫ్ సైన్సెస్), ఆరోగ్య సంరక్షణ అంశాలపై సీఎఫ్ఐఆర్ కేంద్రం అధ్యయనం చేస్తుంది. భారతదేశంలో ఈ విభాగాన్ని ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి అనీ, అమెరికా, బ్రిటన్ దేశాల్లో ఇలాంటి కేంద్రాలు ఉన్నాయని సీఎఫ్ఆర్ఐ ప్రతినిధులు తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు మంత్రి కేటీఆర్ సంతోషం వ్యక్తంచేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో రాష్ట్రానికి ఉన్న అనుకూలతలకు ఇది నిదర్శనమని చెప్పారు. హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అగ్రగామిగా నిలిచేందుకు భారతదేశానికి మంచి అవకాశం ఉందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రెసిడెంట్ బోర్గే బ్రెండే అన్నారు. ప్రభుత్వం,పరిశ్రమల మధ్య సమన్వయంతోపాటు ఉద్యోగ, ఉపాధి కల్పన విషయాల్లో హైదరాబాదు కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వ్యాక్సిన్‌లు, ఔషధాల తయారీలో భారతదేశం, హైదరాబాద్‌లకు మంచి ట్రాక్ రికార్డు ఉందనీ, నాల్గవ పారిశ్రామిక విప్లవ సాంకేతికతను ఉపయోగించుకొని ఆరోగ్య ...9లో



ఒక్క శాతం సంపన్నుల చేతిలో 40 శాతం సంపద

OXFAM

పన్నుల్లో వారి వాటా 4 శాతం లోపే

- 100 మంది వద్ద రూ.54.12 లక్షల కోట్లు
- భారత్‌లో తీవ్ర ఆర్థిక అసమానతలు
- ప్రజలపై అధిక భారాలు.. సంపన్నులకు ఆదాయాలు : ఆక్స్‌ఫామ్ రిపోర్టులో వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. భారత్‌లో సంపన్నులు ఒక్క శాతం ఉంటే.. వారి వద్ద 40.5 శాతం సంపద పోగుపడింది. మొత్తం సంపదలో 60 శాతం కేవలం ఐదు శాతం మంది వద్ద ఉన్నది. మరోవైపు దేశంలో అట్టడుగున ఉన్న 50 శాతం మంది (సగం జనాభా) వద్ద కేవలం మూడు శాతం సంపద పరిమితమైంది. భారత్‌లోని ఆర్థిక అసమానతలు, ధనవంతుల వద్ద ఉన్న సోమ్ముతో ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి పరిష్కారాలు చూపవచ్చునో స్వచ్ఛంద సంస్థ ఆక్స్‌ఫామ్ ఓ రిపోర్టులో విశ్లేషించింది. దావోస్‌లో జనవరి 16 నుంచి 20 వరకు వరల్డ్ ఎకనమిక్స్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లోని తొలి రోజున కార్పొరేట్ల పెరుగుదల, కోరలు చాస్తోన్న పేదరికంపై ఆక్స్‌ఫామ్ 'సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్- ది ఇండియన్ స్టోరీ' పేరుతో ఓ రిపోర్టును విడుదల చేసింది. సోమవారం విడుదల చేసిన ఈ నివేదికలో అనేక విస్తు పోయే విషయాలను వెల్లడించింది. దేశంలో ధనవంతుల కంటే పేద ప్రజలే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నారని తెలిపింది. ఫోర్బ్స్ క్రెడిట్ సూయిజ్, కేంద్ర గణంకాల శాఖ, కేంద్ర బడ్జెట్ పత్రాలు, పార్లమెంట్‌లో సభ్యుల ప్రశ్నలకు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ రిపోర్టును రూపొందించినట్టు ఆ సంస్థ తెలిపింది.



ఆ రిపోర్టు వివరాలు..

2020లో దేశంలో 102 మంది కుబేరులు (బిలియనీర్లు) ఉండగా.. 2022 ముగింపు ...2లో



గత రెండేండ్లలో ప్రపంచంలోని ధనవంతుల్లో అగ్రశ్రేణి ఒక శాతం మంది కూడబెట్టిన సంపద.. ప్రపంచ జనాభాలోని మిగిలిన వారు ఆర్జించిన దాంతో పోలిస్తే దాదాపు రెట్టింపు అయ్యింది. 170 కోట్ల మంది వేతనాలు పడిపోగా.. మరోవైపు బిలియనీర్ల సంపద రోజుకు 2.7 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.22వేల కోట్లు) పెరిగింది. ప్రపంచంలోని కుబేరులపై 5 శాతం పన్ను విధిస్తే వచ్చే 1.7 లక్షల కోట్ల డాలర్లతో 200 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకి తీసుకు రావచ్చు.

పర్యావరణం పట్టదా..!

- వాతావరణ చర్చను హైజాక్ చేస్తున్నారు
- పర్యావరణ కార్యకర్తల ఆందోళన
- పెద్ద చమురు సంస్థల పాత్రకు వ్యతిరేకంగా దావోస్‌లో నిరసన



వివరాలు 2లో

ఉద్యోగ అవకాశాలపై గట్టి దెబ్బ

- ప్రపంచవ్యాప్తంగా 30లక్షలకుపైగా ఉద్యోగాలకు కోత
- నిరుద్యోగుల సంఖ్య 21 కోట్లకు : ఐఎల్‌వో
- విద్య, శిక్షణ రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలి..

వివరాలు 2లో

కొలీజియంలో ప్రభుత్వాన్ని చేర్చాలి


- సీజేఐకి కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లేఖ
- సుప్రీంకోర్టు స్వతంత్రతను దెబ్బతీసేలా కేంద్రం వ్యూహం



వివరాలు 2లో

నేపాల్‌లో కూలిన విమానం

- 68 మంది మృతి.. కనిపించని మరో నలుగురి ఆచూకీ
- బ్లాక్‌బాక్స్ లభ్యం..లిక్కర్ కింగ్ మాల్యాకి చెందిన విమానంగా గుర్తింపు..



వివరాలు 2లో

మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తేనే పండుగ

సంక్రాంతిరోజు ముగ్గులు వేస్తూ...

- రైతు కుటుంబీకుల నిరసన



నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

'మాస్టర్‌ప్లాన్ రద్దు చేసిన రోజు మాకు అసలైన పండుగ', 'మీ పిల్లల భవిష్యత్తు కోసం మా పిల్లల భవిష్యత్తు నాశనం చేయొద్దు', 'మాస్టర్‌ప్లాన్ రద్దు చేయకుంటే రైతుకు ఉరే' అంటూ మాస్టర్‌ప్లాన్ బాధిత కుటుంబీకులు ముగ్గులు వేస్తూ తమ ఆవేదనను వ్యక్తపరిచారు. సంక్రాంతి పండుగ రోజు సైతం రైతుల నిరసనలు కొనసాగాయి. ఆదివారం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు ప్రధాన రహదారులు, చౌరస్తాలపై రైతు కుటుంబీకులు ముగ్గులు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ కామారెడ్డి మున్సిపల్ ప్లాన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని గత 60 రోజులుగా ఉద్యమం చేసినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో పండగ రోజు సైతం నిరసన వ్యక్తం ...2లో

ఖమ్మం సభ చారిత్రాత్మకం

దేశ రాజకీయాల్లో మైలు రాయిగా నిలుస్తుంది

వందెకరాల్లో బీఆర్ఎస్ బహిరంగ సభ

- 448 ఎకరాల్లో 20 పార్కింగ్ స్థలాలు
- నలుగురు సీఎంలతోపాటు సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శులు రాక : మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలో ఈ నెల 18న జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభ చారిత్రాత్మక సభ అవుతుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ బహిరంగ సభ దేశ రాజకీయాల్లో మైలు రాయిగా నిలుస్తుందని, రాజకీయాలను మలుపు తిప్పుతుందని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ రానున్న కాలంలో దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ, విచ్ఛిన్నకర, వేర్పాటువాద ధోరణులతో పాలనగాడి తప్పిందని, అప్రజాస్వామిక విధానాలవల్ల దేశం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్ఎస్ అవతరిస్తుందని అన్నారు.

దేశంలో తెలంగాణ పాలన రోల్ మోడల్‌గా మారిందని, అందువల్ల వివిధ రాష్ట్రాలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నాయని అన్నారు. ప్రజలు తెలంగాణ లాగానే తమ రాష్ట్రాల్లో కూడా రైతు బంధు అమలు చేయాలని, రైతులకు ఉచిత కరెంటు ఇవ్వాలని అక్కడ ప్రజలు కోరుతున్న విషయాన్ని గుర్తుచేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ కావాలని అంటున్నారని తెలిపారు. పక్కనున్న కర్నాటక, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాల ప్రజలు తమను తెలంగాణ రాష్ట్రంలో కలపాలని డిమాండ్ చేస్తున్నారని, ఇది మన రాష్ట్ర ప్రజా రంజక పాలనకు నిదర్శనమని అన్నారు. దేశ రాజకీయాలను ప్రభావితం చేయనున్న ఈ సభకు కేసీఆర్ తోపాటు నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉత్తరప్రదేశ్ ...9లో

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై రెండ్రోజుల్లో షెడ్యూల్

11వేల మందికి ప్రమోషన్లు దక్కే అవకాశం

- యుఎస్పీసీతో మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి సమావేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై రెండ్రోజుల్లో షెడ్యూల్ విడుదల కానున్నది. అయితే, బదిలీ అయిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను లాస్ట్‌వర్కింగ్ డే రిలీవ్ చేస్తారు. సోమవారం హైదరాబాద్‌లో ఉపాధ్యాయ సంఘాలతో జేఏసీల ...9లో

ఒకే కుటుంబంలో నలుగురు అనుమానాస్పద మృతి

- భార్య, కూతురు, తల్లిని చంపి తాను ఆత్మహత్య?

నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ తార్నాకలో దారుణం చోటుచేసుకుంది. ఒకే కుటుంబంలో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా మృతి చెందారు. భర్త తన భార్య, తల్లి, కూతురుకు విషమిచ్చి చంపి, తాను ...9లో



(ఫైల్)

ముహూర్తం కుదిరింది


ఫిబ్రవరి 17న నూతన సచివాలయం ప్రారంభం

- అదేరోజు సీఎం కేసీఆర్ పుట్టినరోజు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర నూతన సచివాలయం ఫిబ్రవరి 17న ప్రారంభం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఈమేరకు సంక్రాంతి రోజున ప్రకటించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పుట్టినరోజైన ఫిబ్రవరి 17న కొత్త సచివాలయాన్ని రాష్ట్ర ప్రజలకు అంకితం చేయనున్నారు. ఏడాదిలోగా సచివాలయ నిర్మాణాన్ని పూర్తిచేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో కొంత ఆలస్యమైనా ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈనెల 18న సచివాలయానికి శ్రీకారం చుట్టాలని తొలుత భావించినా, అదే రోజున ఖమ్మంలో భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఆవిర్భావ సభను నిర్వహించాలని ఆపార్టీ జాతీయ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ నిర్ణయించారు. దీనికి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ పార్టీ నేతలను ఆహ్వానించారు. ఈనేపథ్యంలో సచివాలయ ప్రారంభోత్సవం దాదాపు నెల వాయిదా పడినట్టయింది. తాజాగా సీఎం తేదీని నిర్ణయించడంతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులను వెంటనే సచివాలయ పనులను షిఫ్ట్‌లవారీగా మరింత పకడ్బంధిగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఏడు అంతస్తుల కొత్త సచివాలయంలో పనులు దాదాపు 95 శాతం పూర్తయినట్టు రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే భవనం ...9లో



రేపటి నుంచి సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభ

ముస్తాబైన బెంగుళూరు ప్యాలెస్ గ్రౌండ్

- 18 నుంచి 22 వరకు...
- తొలిరోజు శ్రామిక మహిళా సదస్సు
- 1500 మంది ప్రతినిధులు హాజరు
- 22న నేషనల్ కాలేజీ గ్రౌండ్‌లో బహిరంగసభ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభ బుధవారం కర్నాటక రాజధాని బెంగుళూరు నగరంలో ప్రారంభం కానున్నది. మహాసభ ప్యాలెస్ గ్రౌండ్‌లో ఐదురోజుల పాటు అనగా 18 నుంచి 22వ తేదీ వరకు జరుగనున్నది. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి హాజరయ్యే 1,500 మంది ప్రతినిధులు సీఐటీయూ భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనలో పాలుపంచుకోబోతున్నారు. తెలంగాణ నుంచి 61 మంది ప్రతినిధులు పాల్గొనబోతున్నారు. అందులో 15 మంది మహిళలున్నారు. మహాసభ చివరిరోజైన 22వ తేదీన బెంగుళూరులో నేషనల్ కాలేజీ గ్రౌండ్‌లో వేలాదిమందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ మహాసభలో ముఖ్య అతిథులు డబ్ల్యూఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి పాంబిస్ క్రిస్టిసిస్, చేగువేరా కూతురు అలైదా గువేరా, మనువరాలు ప్రొఫెసర్ ఎస్టీఫినా గువేరాతో సీఐటీయూ ...2లో

నవతెలంగాణ

గులాబీ 'సభా' భేరీ

రేపు బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ..

- మంత్రి హరీశ్ నేతృత్వంలో సన్నాహక సమావేశాలు
- 13 నియోజకవర్గాల నుంచి లక్షల్లో జనసమీకరణ..
- 'వ్యయ'ప్రయాసలపై నేతల్లో టెన్షన్..





నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గులాబీ సమర శంఖారావం పూరించింది. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభను ఖమ్మంలో ఈనెల 18న భారీగా నిర్వహించేందుకు ఆ పార్టీ ఏర్పాట్లు చేస్తుంది. ఆర్థికమంత్రి హరీశ్ రావు నేతృత్వంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానిక మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సైతం దిశా నిర్దేశం చేస్తున్నారు. దాదాపు 5 రోజులుగా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. సభా విజయవంతమే తమకు పండుగని సంక్రాంతి వేడుకలను సైతం పక్కకు పెట్టి ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం గులాబీమయం అయింది. తోరణాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లతో అలంకరించారు. ఈ బహిరంగ సభకు ఖమ్మం చుట్టుపక్కల 13 నియోజకవర్గాల నుంచి భారీగా తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సభకు నలుగురు ముఖ్యమంత్రులు, వివిధ పార్టీలకు చెందిన జాతీయ స్థాయి ముఖ్య నేతలు హాజరవుతున్న దృష్ట్యా భారీ భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.

'వ్యయ' ప్రయాసలపై టెన్షన్..

ఈ సభను బీఆర్ఎస్ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో వ్యయ ప్రయాసలపై నేతల్లో టెన్షన్ నెలకొంది. ఖమ్మానికి 100 కిలోమీటర్ల లోపులోని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆరు నియోజకవర్గాల నుంచి 50 వేలకు తగ్గకుండా జన సమీకరణ చేయాలని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు ఆదేశాలు ఇవ్వడంతో వ్యయ ప్రయాసలు కోర్చి జన సమీకరణ చేస్తున్నారు. ఒక ఎమ్మెల్యేకి రూ.ఐదు నుంచి రూ.10 కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉందని నేతలు చెబుతున్నారు. జనం అందరికీ రవాణా, ఆహార ఏర్పాట్లు, ఇతరత్రా ఖర్చులు అన్నీ సంబంధిత ఎమ్మెల్యే, ఇతర ముఖ్య నేతలే భరించాలని అధిష్టానం నుంచి ఆదేశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

సన్నాహక సమావేశాల్లో హాట్ హాట్ కామెంట్స్...

ఒకే వేదికపై కందాల, తుమ్మల

ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీ మారుతున్నారని ఊహాగానాల నేపథ్యంలో ఆయనకు ఈ సభకు ఆహ్వానం అందలేదని తెలుస్తోంది. ఫ్లెక్సీల్లోనూ ఎక్కడా పొంగులేటి ఫోటోలు లేవు. ఇక ఆయన పార్టీ మారడం లాంఛనమేననే చర్చ సాగుతోంది. 'కమ్యూనిస్టు గడ్డపై మతతత్వ పార్టీలకు చోటు లేదని.. ఎవరైనా ఆ పార్టీలో చేరాలని భావిస్తే అది ఆత్మహత్యా సదృశ్యమేనని, వారి గొయ్యి వారు తీసుకున్నట్టేనని..' మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు చేశారు. మరో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్... 'ఖమ్మంలో పనికిమాలిన బ్యాచ్ తయారయిందని, పార్టీ ఐక్యంగా ఉంటే చూడలేకపోతుందని.. తాను కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని, అజయ్ సైన్యం.. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇటువంటి వ్యాఖ్యలు చేస్తోందని, ఇంకా దంచాల్సిన వాళ్లను దంచాకనే తాను ఎటైనా పోతానని' వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశం అయింది. మరోవైపు ఉప్పు నిప్పుగా ఉంటున్న పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఒకే వేదికపై కనిపించడం చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా తెలంగాణ భవన్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారిద్దరూ ఒకే వేదికను పంచుకోవడంపై ఆసక్తికర వ్యాఖ్యలు వినిపించాయి. కనీసం వారిద్దరూ ఒకరి వైపు మరొకరు కన్నెత్తైనా చూసుకోక పోవడం గమనార్హం.

బహిరంగ సభ షెడ్యూల్

18న బీఆర్ఎస్ బహిరంగ సభ మూడు గంటల పాటే కొనసాగుతుంది. నలుగురు ముఖ్యమంత్రులు సీఎం కేసీఆర్‌తో పాటు కేరళ, ఢిల్లీ, పంజాబ్ సీఎంలు పినరయ్ విజయన్, అరవింద్ కేజ్రివాల్, భగవంత్ మాన్ సింగ్, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా, సీపీఐ (ఎం), సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు మాత్రమే ప్రసంగిస్తారు. వారికి ప్రొటోకాల్ ప్రకారం కేటాయించిన మంత్రులు, ముఖ్య నేతలు స్వాగతం పలుకుతారు. యూపీ మాజీ ముఖ్యమంత్రి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఢిల్లీ, పంజాబ్ సీఎంలకు మంత్రి మహమూద్అలీ, కేరళ సీఎంకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆహ్వానిస్తారు.

ఉద్యోగ అవకాశాలపై గట్టి దెబ్బ

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది భారీ ఎత్తున ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్‌వో) హెచ్చరించింది. ఉపాధి, ఉద్యోగ రంగాలు 2023లో గణనీయంగా ప్రభావితం అవుతాయని ఐక్యరాజ్యసమితి కూడా కొద్ది రోజుల క్రితం ఒక నివేదిక విడుదల చేసింది. ఇదే అంశంపై ఐఎల్‌వో తాజాగా నివేదిక విడుదల కావటం గమనార్హం. నిరుద్యోగ రేటు భారీగా పెరిగే అవకాశముందని ఐఎల్‌వో నివేదిక అంచనా వేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం, అధిక ద్రవ్యోల్బణం, కఠినమైన ద్రవ్య విధానాలు..ఇవన్నీ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, వృద్ధిరేటును 1శాతానికి తగ్గించిందని నివేదిక పేర్కొంది. ఇందులోని మరికొన్ని వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఉపాధి రేటులో వృద్ధి 2023లో 1.5శాతం ఉండొచ్చని గతంలో ఐఎల్‌వో అంచనా వేయగా, దీనిని తాజాగా మరింత తగ్గించింది. తక్కువ వేతనాలకు, నాణ్యతలేని ఉద్యోగాలకు ఒప్పుకునేలా ప్రస్తుత ఆర్థికమాంద్యం పరిస్థితుల్ని సృష్టిస్తోందని నివేదిక పేర్కొంది. విద్య, శిక్షణ రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు పెరగాల్సిన అవసరముందని, యువతకు సరైన చదువు, శిక్షణ లేకపోవటం వల్ల తక్కువ వేతనాలకు పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది నిరుద్యోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. 30 లక్షల మంది కొత్తగా నిరుద్యోగులుగా మారుతారు. మొత్తంగా వీరి సంఖ్య సుమారుగా 21కోట్లకు చేరుకుంటుంది. నిరుద్యోగరేటు 5.8శాతానికి పెరుగుతుంది. అధిక ద్రవ్యోల్బణం ఆయా దేశాల్లో నిజ వేతనాల్ని మింగేస్తాయి. ఆర్థికమాంద్యం వృద్ధి గణాంకాల్ని, ఉపాధిరేటును దెబ్బతీస్తోంది. దీనినిబట్టి కోవిడ్-19 సంక్షోభం నుంచి ప్రపంచం 2025లోగా బయట పడేలా కనపడటం లేదని ఐఎల్‌వో రీసెర్చ్ విభాగం డైరెక్టర్ రిచర్డ్ సమాన్స్ అన్నారు.

పెరగనున్న జీవనవ్యయం

కార్మికరంగంలో వేతనాలు నామమాత్రంగా ఉన్నాయి. వీటితో పోల్చుకుంటే నిత్యావసర సరుకుల ధరలు వేగంగా పెరుగుతున్నాయి. అంతటా జీవనవ్యయం పెరగటం వల్ల మరింత మంది పేదరికంలోకి కూరుకుపోతారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగిస్తే పరిస్థితి మరింత దిగజారుతుందని పరిశోధకులు అంచనావేశారు. దీనిపై ఐఎల్‌వో డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ హౌంగ్ మాట్లాడుతూ, కోవిడ్ సంక్షోభం నుంచి స్వల్ప, మధ్య ఆదాయ దేశాలు పూర్తిగా బయటపడలేదు. దీనికితోడు వాతావరణ మార్పులు, మానవ సంక్షోభం కొత్త సవాళ్లను విసురుతున్నాయని ఆయన అన్నారు.

పర్యావరణం పట్టదా..!

దావోస్ : వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్)లో పెద్ద చమురు సంస్థల పాత్రపై వాతావరణ కార్యకర్తల నుంచి ఆందోళన వ్యక్తమైంది. సంస్థల పాత్రకు వ్యతిరేకంగా వారు దావోస్‌లో నిరసన తెలిపారు. (పెద్ద చమురు సంస్థలు) వాతావరణ చర్చను హైజాక్ చేస్తున్నారని వాతావరణ కార్యకర్తలు చెప్పారు. స్విస్ రిసార్ట్‌లో జరిగే వార్షిక సమావేశానికి హాజరైన 1500 మంది వ్యాపార నాయకులలో బీపీ, చెవ్రాన్, సౌదీ అరామ్‌కోతో సహా ప్రధాన ఇంధన సంస్థలు ఉన్నాయి. వాతావరణ మార్పులతో సహా ప్రపంచ ముప్పులు వంటివి ఈ సమావేశపు ఎజెండాలో ఉన్నాయి.



స్విట్జర్లాండ్‌లోని యంగ్ సోషలిస్టు పార్టీకి నేతృత్వం వహిస్తున్న నికోలస్ సీగ్రిస్ట్ మాట్లాడుతూ.. మేము కచ్చితమైన, నిజమైన వాతావరణ చర్యను డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రపంచ వ్యాపార, రాజకీయ నేత వార్షిక సమావేశం సోమవారం దావోస్‌లో అధికారికంగా ప్రారంభమైంది. "మీరు రాజకీయ నాయకులతో ఒకే గదిలో ఉంటారు. వారి ప్రయోజనాల కోసం వారు ముందుకు వస్తారు" అని డబ్ల్యూఈఎఫ్ సమావేశంలో ఇంధన సంస్థల ప్రమేయం గురించి మాట్లాడుతూ సీగ్రిస్ట్ అన్నారు.

తక్కువ కార్బన్ ఆర్థిక వ్యవస్థలకు దేశాలు మారుతున్నందున ప్రపంచ ఇంధన మిశ్రమంలో శిలాజ ఇంధనాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, శక్తి పరివర్తనలో భాగం కావాలని చమురు, గ్యాస్ పరిశ్రమ పేర్కొన్నది. దావోస్ స్క్వేర్‌లో కురుస్తున్న మంచును సైతం లెక్క చేయకుండా వంద మందికి పైగా నిరసనకారులు గుమిగూడి ఆందోళనను చేపట్టారు. నినాదాలు వినిపించారు. 'వాతావరణానికి అనుగుణంగా మీ తిండి అలవాట్లను మార్చుకోండి' అని నినాదాలు చేశారు. "కొన్ని కంపెనీలు ప్రత్యామ్నాయాలలో నిమగ్నమై ఉన్నాయని నాకు తెలుసు. కానీ ప్రభుత్వాలు వారి సబ్సిడీలతో ప్రత్యామ్నాయ శక్తికి అనుకూలంగా వ్యవస్థను మార్చాలని నేను భావిస్తున్నాను" అని నిరసనలో పాల్గొన్న 99 % సంస్థ సభ్యులు హీథర్ స్మిత్ చెప్పారు. " పెరుగుతున్న వడ్డీ రేట్లు పునరుత్పాదక ఇంధన అభివృద్ధికి ఫైనాన్సింగ్‌ను ఆకర్షించడం కష్టతరం చేశాయి. శిలాజ ఇంధన పెట్టుబడుల నుంచి ఇంకా చాలా ఎక్కువ డబ్బు సంపాదించాల్సి ఉన్నది" అని తెలిపారు.

ఆ నలుగురు యువకుల మృతి బాధాకరం


- టీటీడీపీ అధ్యక్షులు కాసాని

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి ప్రాజెక్టులో ఈతకు వెళ్లి నలుగురు యువకులు మృతి చెందడం చాలా బాధాకరమని టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి సంబరాల్లో కనుము పండుగ రోజు ఈ విషాద ఘటన జరగటం దురదృష్టకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా చెల్లించడమే కాకుండా వారిని అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

కోరుట్ల ఎస్బీఐ ఏటీఎంలో చోరీకి యత్నం

- పోలీసులు రాగానే దొంగలు పరార్
- రోడ్డుపై చిందర వందరగా పడ్డ నోట్లు



నవతెలంగాణ - కోరుట్ల

కోరుట్ల పట్టణంలో దుండగులు సినీఫక్కీలో ఏటీఎంలో చోరీకి పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఎస్బీఐ తంగ్రిడియాలా బ్రాంచీలో శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో దుండగులు చోరీకి యత్నించారు. కారులో వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి ఎస్బీఐ బ్యాంకు వద్ద కారు నిలిపి ఏటీఎంలోకి చొరబడి వెంట తెచ్చుకున్న ఆయుధాలతో మిషన్‌ను పగులగొట్టి అందులోని డబ్బులను దొంగిలించారు. ఏటీఎం నుంచి డబ్బులు తీస్తుండగా అందులో ఉన్న అల్లారం మోగింది. దీంతో పెట్రోలింగ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. అప్పటికే డబ్బును బ్యాగ్‌లో పెట్టుకున్న దొంగలు కారులో ఎక్కుతుండగా పెట్రోలింగ్ వాహనం అక్కడికి చేరుకుంది. పోలీసు వాహనంతో చేజ్ చేయగా, దొంగలు ప్రయాణిస్తున్న కారు నుండి కరెన్సీ కట్టలు రోడ్డుపై చిందర వందరగా పడిపోయాయి. 19లక్షల 200 రూపాయలను పోలీసులు స్వాధీనం చేసు కున్నట్టు సమాచారం. పారిపోయిన దొంగలను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న డబ్బును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్క శాతం సంపన్నుల చేతిలో 40 శాతం సంపద

(మొదటిపేజీ తరువాయి)

నాటికి ఈ సంఖ్య 166కు చేరింది. 100 మంది కుబేరుల వద్ద రూ.54 లక్షల కోట్ల సంపద పోగుబడింది. దీంతో కేంద్ర బడ్జెట్‌కు 18 నెలల పాటు కేటాయింపులు చేయవచ్చు. దేశంలోని టాప్ 10 మంది కార్పొరేట్ల వద్ద రూ.27.52 లక్షల కోట్ల సంపద ఉంది. 2021 నాటి సంపదతో పోల్చితే దాదాపు 9 లక్షల కోట్లు లేదా 32.8 శాతం పెరుగుదల చోటు చేసుకున్నది. కరోనా సంక్షోభం ప్రారంభమైన నాటి నుంచి 2022 నవంబరు వరకు దేశంలో బిలియనీర్ల సంపద 121 శాతం పెరిగింది. రోజుకు దాదాపు రూ.3,608 కోట్ల సంపద పోగు చేసుకున్నారు. "2019 కరోనా తర్వాత జనాభాలో దిగువన ఉన్న 50 శాతం మంది తమ సంపాదను కోల్పోయారు. మొత్తం సంపదలో వీరి వాటా 3 శాతం కంటే తక్కువగా ఉందని అంచనా. దీని ప్రభావం అనూహ్యంగా బలహీనమైన ఆహారం, అప్పులు, మరణాల పెరుగుదలకు కారణమైంది. దేశంలోని మొత్తం 90 శాతం పైగా సంపద 30 శాతం మంది ధనవంతుల వద్ద ఉన్నది. 80 శాతం సంపద 10 శాతం మంది చేతుల్లో ఉన్నది. అగ్రశ్రేణి 5 శాతం మంది కుబేరులు మొత్తం సంపదలో దాదాపు 62 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఇది కరోనా ముందు నాటికంటే ఎక్కువ." అని ఈ రిపోర్టు తెలిపింది.

జీఎస్టీతో ప్రజలపైనే దాడి..

ఆర్థిక సంవత్సరం 2021-22లో దేశంలో వసూళ్లయిన రూ.14.83 లక్షల కోట్ల వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ల్లో 64 శాతం రాబడి కూడా అట్టడుగున ఉన్న 50 శాతం మంది నుంచి వచ్చిందే. పన్నుల్లో మూడింట్లో ఒక్క వంతు మధ్య తరగతి వారి వాటా ఉంది. జీఎస్టీ మొత్తం ఆదాయంలో కేవలం 3-4 శాతం మాత్రమే తొలి పది మంది కుబేరుల నుంచి వచ్చింది. అంటే పన్నుల రూపంలో పేద, మధ్యతరగతి ప్రజలను ఏ స్థాయిలో బాదేస్తున్నారో ఈ రిపోర్టు స్పష్టం చేస్తోంది.

వారిపై పన్నులతోనే పరిష్కారం..

ధనవంతులపై పన్నులు వేయడం ద్వారా దేశంలోని అనేక సామాజిక సమస్యలకు పరిష్కారం చూపవచ్చని ఆక్స్‌ఫామ్ సూచించింది. ఆ వివరాలు.. భారత్‌లోని టాప్ 10 మంది కుబేరులపై 5 శాతం పన్ను విధిస్తే.. బడి మానేసిన పిల్లలందరినీ తిరిగి పాఠశాలలకు తీసుకురావచ్చు. లేదా తొలి 100 మంది బిలియనీర్లపై 2.5 శాతం పన్ను విధించిన ఆ పిల్లలను స్కూళ్లకు చేరువ చేయవచ్చు. మోడీ రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత గౌతమ్ అదానీ సంపద రాకెట్ల దూసుకుపోయిన సంగతి తెలిసిందే. 2017- 2021 మధ్య పెరిగిన అదానీ సంపదపై కేవలం ఒక్క సారి పన్ను విధిస్తే రూ. 1.79 లక్షల కోట్ల నిధుల్ని సమీకరించవచ్చు. దీంతో ఏడాది పాటు దేశంలోని ప్రాథమిక పాఠశాలల్లో బోధించే 50 లక్షల మందికి వేతనాలివ్వొచ్చు. భారత్‌లోని బిలియనీర్లపై ఒకసారి రెండు శాతం పన్ను విధిస్తే రూ.40,423 కోట్ల ఆదాయం వస్తుంది. దీంతో దేశంలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలందరికీ వచ్చే మూడేండ్ల పాటు పోషకాహారం అందించవచ్చు. 10 మంది కుబేరులపై ఒకేసారి 5 శాతం పన్ను విధిస్తే రూ.1.37 లక్షల కోట్లు నిధులు సమకూరుతాయి. ఈ మొత్తం 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆయుష్ మంత్రిత్వ శాఖ అంచనా వేసిన నిధుల కంటే 1.5 రెట్లు ఎక్కువ కావడం విశేషం. దేశంలో ఒక పురుష కార్మికుడు సంపాదించే ప్రతి రూపాయికి మహిళా కార్మికులు కేవలం 63 పైసలు మాత్రమే పొందుతున్నారు. షెడ్యూల్డ్ కులాలు, గ్రామీణ ప్రాంత కార్మికుల సంపాదనల్లో తేడా మరింత ఎక్కువగా ఉంది. ఉన్నత సామాజిక వర్గాలు సంపాదిస్తున్న దానితో పోల్చితే షెడ్యూల్డ్ కులాల వారు 55 శాతం మాత్రమే పొందుతున్నారు.

ఆకలితో పిల్లల మరణాలు

"ఆకలి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆరోగ్య విపత్తులు తదితర బహుళ సంక్షోభాలతో భారత్ బాధపడుతోంది. మరోవైపు దేశంలో కుబేరులు పెరిగిపోతున్నారు. అదే సమయంలో పేదలు జీవించడానికి కనీస అవసరాలను కూడా కొనుగోలు చేయలేకపోతున్నారు. విపరీతమైన ఆకలితో ఉన్న భారతీయుల సంఖ్య 2018లో 19 కోట్ల నుంచి 2022లో 35 కోట్లకు పెరిగింది. ఆకలి కారణంగా 2022లో ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 65 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించింది.' అని ఆక్స్‌ఫామ్ ఇండియా సీఈఓ అమితాబ్ బెహర్ తెలిపారు.


రేపటి నుంచి సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభ

(మొదటిపేజీ తరువాయి)

అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, అధ్యక్షులు కె.హేమలత, జాతీయ నాయకులు పాల్గొనబోతున్నారు. మహాసభల విజయవంతం కోసం రిసెప్షన్ కమిటీ ఆధ్వర్యంలో వేసిన 27 సబ్ కమిటీలు తమ శక్తిమేర కృషిచేస్తున్నాయి. సీఐటీయూ అఖిల భారత మహాసభల ఆవశ్యకతను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు 500 కమిటీలు నిర్విరామంగా పనిచేశాయి. ఎనిమిది రోజులుగా బెంగుళూరు, చుట్టుపక్కల ప్రాంతాల్లో కార్మికులను, ప్రజలను చైతన్యపరిచేలా సాంస్కృతిక కార్యక్రమాలను రిసెప్షన్ కమిటీ నిర్వహిస్తున్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల ఎనిమిదిన్నర ఏండ్ల కాలంలో ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సామాజిక సమస్యల ఇతివృత్తంగా షార్ట్ ఫిలిం కాంపిటేషన్ నిర్వహించగా మంచి స్పందన లభించింది. కార్మికుల కుటుంబాల వద్దకెళ్లి, స్ట్రీట్ క్యాంపెయిన్స్ ద్వారా విరాళాలు సేకరించాయి.

మహాసభ నిర్వహణ కోసం సేకరించిన నిధుల్లో 90 శాతం ఈ రూపంలోనే రావడం గమనార్హం. అదే సమయంలో మహాసభల జయప్రదం కోసం కర్నాటకలో నాలుగు జీపుజాతాలు జరిగాయి. కోలార్ గోల్డ్ ఫీల్డ్ కార్మికుల పోరాట చైతన్య స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ కేజీఎఫ్ నుంచి ప్రారంభమైన జీపుజాతా మహాసభ ప్రారంభం రోజు ప్యాలెస్‌గ్రౌండ్‌కు చేరుకోనున్నది. బుధవారం ప్యాలెస్ గ్రౌండ్‌లో మహాసభ ప్రారంభ సూచికగా సీఐటీయూ జెండా ఎగురవేసే సమయంలో 500 మందితో కూడిన రెడ్‌షెట్ వాలంటీర్ల దళం ప్రత్యేకంగా డ్రమ్స్ వాయిస్తూ కవాతు చేయనున్నది. మహాసభకు హాజరయ్యే ప్రతినిధులు ప్రాంతీయ భాషల్లో ప్రసంగాలు చేసినా భాషాపరమైన సమస్యలు తలెత్తకుండా ఇంగ్లీషు, హిందీ, బెంగాలీ, తెలుగు, తమిళం, కన్నడం, మళయాలం, తదితర భాషల్లోకి వెంటనే తర్జుమా చేసే ప్రత్యేక సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు.

వనస్థలిపురం నగదు దోపిడీ కేసులో నలుగురు అరెస్ట్...



నవతెలంగాణ-హయత్‌నగర్

ఇటీవల వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన నగదు దోపిడీ కేసును పోలీసులు చేధించారు. నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 18 లక్షల నగదు, కారు, బైక్, 5 ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్ తెలిపారు. సోమవారం ఎల్బీనగర్‌లో సీపీ క్యాంప్ కార్యాలయంలో వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. నిందితులు విదేశాలకు పారిపోవడం కోసం పత్రాలు తెచ్చుకునేందుకు చార్మినార్‌కు వెళ్తున్న క్రమంలో ఇంజాపూర్ కమాన్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు రహీం ఘోరీ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ జోన్ డీసీపీ సన్ ప్రీత్ సింగ్, క్రైమ్ డీసీపీ బాల, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, ఎస్ ఓటీ అడిషనల్ డీసీపీ శ్రీనివాసులు, ఎస్ఓటీ ఏసీపీ వెంకన్న, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు సత్య నారాయణ, సుధాకర్, యాదయ్య, రాములు, రంగా, అర్జునయ్య, మన్ మోహన్, రవి కుమార్, అశోక్ కుమార్, సైదులు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేరం జరిగిన విధానం..

ఆటోనగర్‌లో ఎంఆర్‌ఆర్ వైన్స్ యజమాని వెంకట్‌రెడ్డి, భవానినగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ హమీద్ అలియాస్ నయీమ్‌లు స్నేహితులు. నయీమ్ తన వ్యాపారం కోసం వెంకట్ రెడ్డి వద్ద రూ.50 లక్షలు అప్పుగా తీసుకు న్నాడు. అది చెల్లించి అట్టి మొత్తాన్ని దొంగిలిద్దామని తన స్నేహితులు రహీం ఘోరీ, ఒమర్ బీన్ హంజా అల్ జాబ్రీ అలియాస్ అలీ, అలీ బీన్ హంజా అలీ జాబ్రీ అలియాస్ అలీతో కలిసి పథకం రచించాడు. ఈ మేరకు వెంకట్ రెడ్డికి నయీమ్ ఫోన్ చేసి అప్పు మొత్తం తిరిగి ఇస్తాననగా.. వెంకట్ రెడ్డి తన వైన్స్ వద్దకు వచ్చి ఇవ్వాలని చెప్పాడు. అనంతరం ఆ ప్రదేశాన్ని నయీమ్ తన స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై పలు మార్లు రెక్కీ నిర్వ హించాడు. ఈ నెల 6న రూ. 50 లక్షల నగదును నయీమ్.. అలీతో కలిసి బైక్‌పై వైఎంఆర్ ఆర్ వైన్స్ వద్దకు వెళ్లి వెంకట్‌రెడ్డికి అందజేశాడు. అదే సమయంలో పనామా వద్ద ఉన్న పిస్తా హౌస్ వద్ద రహీం ఘోరీ, ఒమర్ ఉన్నారు. ఆ డబ్బులు తీసు కున్న వెంకట్ రెడ్డి తన వద్ద పనిచేసే వ్యక్తితో కలిసి అక్కడి నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో కమలానగర్ సాయి బాబా గుడి వద్దకు రాగానే రహీం ఘోరీ, ఒమర్ వారిపై దాడి చేసి ఆ డబ్బును దోచుకునే ప్రయత్నం చేశారు. దాంతో చుట్టుపక్కల వారు అటుగా రావడంతో నిందితులు రూ. 25 లక్షలను మాత్రం దోచుకుని పరారయ్యారు. ఆ తరువాత నిందితులు ముంబైకు పారిపోయారు. తర్వాత దుబాయ్‌కు వెళ్లిపోవాలని నిందితులు ట్రావెల్స్‌లో పనిచేస్తున్న చార్మినార్‌కు చెందిన ఫహాన్ బీన్ అబ్దుల్ రహేమాన్ అలియాస్ ఫహాద్‌ను సంప్రదించారు. ఇదిలా ఉండగా ప్రత్యేక టీంలు సీసీఎస్, ఎస్ ఓటీ, వనస్థలిపురం క్రైమ్ టీంల సహకారంతో సీసీ కెమె రాల నిఘా ఆధారంగా నలుగురు నిందితులను ఇంజాపూర్ కమాన్ వద్ద అరెస్టు చేశారు.

మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తేనే పండుగ

(మొదటిపేజీ తరువాయి)

చేయాల్సి వచ్చిందని వాపోయారు. భూముల విషయంలో స్పష్టత వచ్చే వరకు ఉద్యమం ఆగదని అన్నారు. విలీన గ్రామాల కౌన్సిలర్లు 20వ తేదీ వరకు పార్టీలకు అతీతంగా రాజీనామాలు చేసి రైతులకు మద్దతు పలకాలని డిమాండ్ చేశారు. మంగళవారం పాత రాజంపేట్ గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసుకొని భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

మంత్రి గంగులకు సీఎం కేసీఆర్ పరామర్శ

- గంగుల మల్లయ్యకు నివాళి



నవతెలంగాణ - కరీంనగర్

రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తండ్రి గంగుల మల్లయ్య పెద్దకర్మ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కొండ సత్య లక్ష్మణ్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ హాజరై గంగుల మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గంగుల కమలాకర్ ను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర ప్రణా ళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు దీవకొండ దామోదర్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, వొడితెల సతీష్ బాబు, రసమయి బాలకిషన్, సంజయ్ కుమార్, సుంకే రవిశంకర్, కోరుకంటి చందర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, పెద్దపల్లి జెడ్పీ చైర్మెన్ పుట్ట మధు, మాజీ ఎమ్మెల్సీ లు నారదాసు లక్ష్మణ్‌రావు, కె.సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కార్పొరేషన్ చైర్మెన్లు సర్దార్ రవీందర్ సింగ్, దామోదర్ గుప్తా, బండ శ్రీనివాస్, అనిల్ కూర్మాచలం, నగర మేయర్ సునీల్ రావు, కలెక్టర్ కర్ణన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్నం అనిల్ గౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణ, కార్యదర్శి రూప్ సింగ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఓరుగంటి ఆనంద్, చల్లా హరిశంకర్, కరీంనగర్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మూడు వాయిదాల కరువుభత్యం ప్రకటించాలి

- పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలి :

సీఎస్‌కు టీఎస్ యుటీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తొలి మహిళా అధికారి శాంతికుమారిని టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏర్పుల గాలయ్య, ఎమ్మెల్సీ అభ్యర్థి పి మాణిక్ రెడ్డి సోమవారం సీఎస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బకాయి పడ్డ మూడు వాయిదాల కరువు భత్యం ప్రకటించాలనీ, పెండింగ్ బిల్లుల నిధులు ఉపాధ్యాయుల ఖాతాల్లో జమచేయాలనీ, కేజీబీవీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలనీ, బ్లాక్ చేసిన 13 జిల్లాల భార్యాభర్తల బదిలీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. బీసీ గురుకుల పాఠశాలల పనివేళలు మార్చాలనీ, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలనీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ స్కూల్, ఎయిడెడ్, కేజీబీవీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితి ఐదులక్షలకు పెంచాలని వినతిపత్రం సమర్పించారు.

వైద్యరంగంలో వసతుల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి గవర్నర్ సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జనాభాకు అనుగుణంగా వైద్యరంగంలో వసతుల మెరుగుదలకు మరిన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ సూచించారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యరంగంలో వసతులు మెరుగవడం లేదని తాను చెప్పడం లేదనీ, అయితే వసతులు ఇంకా మెరుగుపడాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. మలక్‌పేట ఆసుపత్రిలో ఇద్దరు బాలింతలు మరణించడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక గైనకాలజిస్ట్‌గా తనకు ఎన్నో ప్రశ్నలు ఉన్నాయనీ, ఆసుపత్రికి వెళ్లాలని అనుకున్నప్పటికీ పండుగ కారణంగా ఆగిపోయినట్టు తెలిపారు. గతంలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల సమయంలోనూ నలుగురు మరణించారని గుర్తుచేశారు.

పరిశీలనలో ప్రభుత్వ బిల్లులు

ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో లేవని తెలిపారు. తన పరిశీలనలో ఉన్నాయని స్పష్టం చేశారు. వర్సిటీ నియామకాల బిల్లులో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. యూనివర్సిటి నియామకాల బిల్లు.. వివాదాలతో ఆలస్యం కారాదన్నదే తన ఉద్దేశమని తెలిపారు. ఈ తరహా విధానాలను గతంలో న్యాయస్థానాలు అభ్యంతరం వ్యక్తం చేశాయనీ, యూజీసీ కొన్ని అంశాలను ప్రస్తావించిందంటూ, యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ కావాలని తెలిపారు.

వరంగల్, ఖమ్మం ప్రజలకు చేరువగా సేవలు

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన సందర్భంగా ఆమె తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రైల్వేను ఆధునీకరిస్తున్నారని, స్టేట్ ఆఫ్ ఆర్ట్‌గా రైల్వేల అభివృద్ధి జరుగుతున్నదని కొనియాడారు. ప్రజలంతా టీవీలు చూస్తున్న సమయంలో నరేంద్రమోడీ రేడియోకి పునర్వైభవం తెచ్చారని తెలిపారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుతో వరంగల్, ఖమ్మం ప్రజలకు సేవలు మరింత చేరువవుతాయని తమిళిసై అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెలు

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పస్రాలో జెండాలు పాతిన పేదలు



నవతెలంగాణ-గోవిందరావుపేట

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని సర్వేనెంబర్-109లోని ప్రభుత్వ స్థలంలో సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బి సాంబశివ మాట్లాడుతూ గత 20ఏండ్లుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సర్వే నెంబర్-109 లోని 10 ఎకరాల భూమిని రక్షిస్తూ పేదలకు ఇవ్వాలని అనేక ప్రజా ఉద్యమాలు చేసిందని గుర్తు చేశారు. జూన్ 2022న ఇది ప్రభుత్వ భూమిగా పరిగణించి మండల రెవెన్యూ కార్యాలయం స్వాధీనపర్చుకున్నట్టు తెలిపారు. అయినా భూస్వాములు ఆ భూమి తమదే నంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారన్నారు. పోలీసులు 24మంది కార్యకర్తలపై బైండోవర్ కేసు పెట్టినా గుడిసెవాసులందరూ అక్కడే భీష్మించుకు కూర్చున్నారని అన్నారు. పస్రా గ్రామంలో నిరుపేదలు, అద్దె ఇంట్లో వారందరూ 10 ఎకరాల్లో గుడిసెలు వేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, పోలీసులు స్పందించి పేద ప్రజలకు భూమి పంచాలని అన్నారు.కార్యక్రమంలో అంబాల పోషాలు, సప్పిడి ఆదిరెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల కోసం పోరాటాలు

పస్రా గ్రామంలోని సర్వే నెంబర్-109లో పుల్యాల వసంత పేరుపై గతంలో పట్టా అయిన భూమి స్థానిక రైతుల పోరాట ఫలితంగా పట్టా చెల్లదని ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య లిఖితపూర్వకంగా ఇచ్చారు. స్థానిక తహసీల్దార్ కూడా సర్వే చేసి ప్రభుత్వ భూమిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ స్థలంలో గుడిసెలు వేసినట్టు గుడిసెవాసులు తెలిపారు. ప్రస్తుతం ఈ భూమిని సాగు చేస్తున్న వ్యక్తి కూడా గతంలో వసంత పేరు మీద పట్టా కాగానే తనకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పినట్టు తెలిపారు. పట్టా రద్దు అయిన వార్త వినగానే తాను ఖరీదు చేశానని ముందుకు రావడం దుర్మార్గమని పేదలు వాపోతున్నారు.

ఆ భూమి తనదేనంటున్న పస్రా రైతు తనకు సంబంధం లేదని తాసిల్దార్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా ఇచ్చినట్టు ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. సుమారు 200 మందికి పైగా గుడిసెలు వేశామని, ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. కాగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, జిల్లా నాయకులు పొదిల్ల చిట్టిబాబును ఎస్ఐ కరుణాకర్‌రావు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్ఐను వివరణ కోరగా తమకు వచ్చిన సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకున్నామని, విచారించి వదిలివేస్తామని తెలిపారు. వారితోపాటు మరో 30మంది గుడిసె వాసులపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. వారిని స్థానిక తహసిల్దార్ అల్లం రాజకుమార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేయనున్నట్టు తెలిపారు.

సమానత్వం కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ



నవతెలంగాణ-నల్లగొండ

సమానత్వ సాధన కోసం మహిళలందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని 25వ వార్డు అబ్బాసియాకాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులపోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాలలోనూ ముందుండాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి మాట్లాడుతూ మహిళలలో ఉన్న సృజనాత్మకను వెలికి తీయడానికే ప్రతిఏడాది ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా సమస్యలు ఎక్కడ ఉన్నా వారికి అండగా ఐద్వా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి భూతం అరుణకుమారి, కమిటీ సభ్యులు విజయ, తదితరులు పాల్గొన్నారు.

ముకర్రమ్ జా మృతికి సీఎం సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ సంస్థానం ఆఖరి నిజాం.. 'మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహద్దూర్' మనుమడు, నిజాం పెద్దకొడుకు ఆజమ్ జా, దుర్రె షెహవార్ దంపతుల కుమారుడు ముకర్రమ్ జా మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సోమవారం సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నిజాం వారసుడుగా, పేదల కోసం విద్యా, వైద్య రంగాల్లో ముకర్రమ్ జా చేసిన సామాజిక సేవలకు గుర్తుగా, వారి అంత్యక్రియలను అత్యున్నతస్థాయి అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఆదేశించారు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో శనివారం రాత్రి మరణించిన ముకర్రమ్ జా మృత దేహంను హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత, వారి కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు అంత్యక్రియల సమయాన్ని, స్థలాన్ని నిర్ధారించి తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు ఎ.కె.ఖాన్‌ను ఆదేశించారు. సీఎం సూచనల మేరకు అందుకు సంబంధించిన పనులను ఆయన సమన్వయం చేస్తున్నారు. టర్కీలోని ఇస్తాంబుల్ నగరంలో ఎనిమిదవ నిజాం ముకర్రమ్ జా బహదూర్ మరణం పట్ల రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ విచారం వ్యక్తం చేశారు. ముకర్రమ్ జా బహదూర్ తాత నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన కాలంలోని ఆదర్శప్రాయమైన లౌకిక వాది అనీ, తన ప్రాణం కంటే ప్రజలను ఎక్కువగా అభిమానిస్తుండేవారని తెలిపారు. హిందువులు, ముస్లింలు నా రెండు కళ్ళు అని ఆయన ఎప్పుడూ చెబుతుండేవారనీ, ఉస్మానియా యూనివర్సిటీ, రైల్వే లైన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ , ఆర్టీసీ బస్సుల, ఆసుపత్రుల ఏర్పాటు వంటి ప్రజా సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజల మన్ననలను పొందారని పేర్కొన్నారు.. ఆయన కుటుంబ సభ్యులకు హోంమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నవాబ్ ముకర్రమ్ జా బహదూర్ కోరిక మేరకు ఆయన పూర్వీకులను ఖననం చేసిన మక్కా మసీదులోనే అతని ఖననం నిర్వహిస్తామని హోం మంత్రి తెలిపారు.

ఎనిమిదో నిజాం నవాబ్ మృతికి కాసాని సంతాపం

హైదరాబాద్ ఎనిమిదో నిజాం నవాబ్ మీర్ బరికేత్ అలీఖాన్ వాలాషాన్ ముఖరమ్జా బహాదూర్ మృతిపై తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ సంతాపం వ్యక్తం చేశారు.

మా పని అయిపోలే... మీ పనిబట్టే పనిలో ఉన్నాం

- మంత్రి హరీశ్‌రావుకు మహేష్‌కుమార్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పని అయిపోయిందంటూ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. మా పని అయిపోలేదనీ, మీ పనిపట్టే పనిలోఉన్నామని హెచ్చరించారు. ఎన్నో అటుపోట్లు చూసిన కాంగ్రెస్ సముద్రం లాంటిదన్నారు. పదవులే పరమావధిగా బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పని చేస్తున్నారని విమర్శించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు అధికారం మీద యావ లేదని పునరుద్ఘాటించారు. సోనియా గాంధీ దయ వల్లే మీకు పదవులు వచ్చాయని చెప్పారు. ఈనెల 20, 21,22 తేదీల్లో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే రాష్ట్రానికి వస్తున్నారని చెప్పారు. హాత్ సే హాత్ అభియాన్ యాత్రపై చర్చించి, కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. టీచర్ల బదిలీలు, ప్రమోషన్లలో తప్పుల తడకగా ఉందని ఉపాధ్యాయ సంఘం నాయకులు హర్షవర్ధన్ రెడ్డి విమర్శించారు. ఉపాధ్యాయ ఎన్నికల్లో కూడా మరో సారి వంచించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయనీ, ప్రతి నెల ఒకటో తేదీన రావాల్సిన జీతాలు, సమయానికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం పుట్టిన రోజు సచివాలయం ప్రారంభమా? : కోదండరెడ్డి

సీఎం ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భాన్ని పురస్కరించుకుని నూతన సచివాలయం ప్రారంభిస్తారా? అని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఫిబ్రవరి 17న సీఎం పుట్టినరోజు కాబట్టి ప్రకటించామని మంత్రి చెప్పడం హాస్యాస్పందమన్నారు. జన్మదినం పెద్దగా జరుపుకోండి కానీ, సచివాలయం ప్రారంభం ఎందుకు? అని ప్రశ్నించారు. అధికారిక భవనం నిర్మాణ ప్రారంభోత్సవానికి విధివిధానాలుంటాయని గుర్తు చేశారు. సచివాలయం నిర్మాణం ఇంకా పూర్తి కాలేదనీ, అయినా ప్రారంభోత్సవమేంటని ప్రశ్నించారు. ప్రారంభోత్సవ తేదీని పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

డిమాండ్ బ్యాడ్జీలతో కంటి వెలుగు డ్యూటీలకు హాజరవ్వాలి

టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిమాండ్ బ్యాడ్జీలతో ఈ నెల 18 నుంచి 21 వరకు కంటి వెలుగు డ్యూటీలకు హాజరు కావాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియోద్దీన్, కె.యాదనాయక్ కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు,ఈసీ ఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఏఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్‌ఆర్డి ఏఎన్ఎంలు ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలను యథావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్యారోగ్య రంగానికి బలమైన ఆయువు పట్టుగా ఉండి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏ.ఎన్.ఎంలు రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న నేటికీ రెగ్యులర్ కాకపోవడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలు ఏకకాలంలో 36 రకాల రికార్డులు ఆన్ లైన్‌లో,ఆఫ్‌లైన్‌లో నమోదు చేస్తున్నారనీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. 23 సంవత్సరాలుగా పని చేస్తున్న ఏఎన్ఎంలకు 8, 9, 10 పీఆర్సీల ప్రకారం బేసిక్ పే ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో తొలి పీఆర్సీ బేసిక్ పే ఇవ్వకుండా 30 శాతం వేతనాలు మాత్రమే పెంచారనీ, దీంతో ఏఎన్ఎంలు ప్రతి నెలా రూ.ఐదు వేలు నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే బేసిక్ పే ప్రకారం వేతనాలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండో ఏఎన్ఎంలు, ఈసీ ఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఏఎన్ఎంలు గత 23 సంవత్సరాలుగా పని చేస్తున్న కనీస వేతనాలు ఇవ్వకుండా, రెగ్యులర్ చేయకుండ ప్రభుత్వం మోసం చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే వీరందరిని ఎలాంటి షరతులు లేకుండ యథావిధిగా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న సెకండ్ ఎఎన్ఎంలు, ఈసీ.ఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఎఎన్ఎంలు, ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలు డిమాండ్ బ్యాడ్జీలు ధరించి డ్యూటీలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్పందనను బట్టి ఈ నెల 22న (ఆదివారం) భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వారు తెలిపారు.

విహార యాత్రలో విషాదం

- నలుగురు యువకులు నీటిలో పడి మృతి



నవతెలంగాణ-వికారాబాద్
ప్రతినిధి, దారూర్

వికారాబాద్ జిల్లా కోటిపల్లి ప్రాజెక్టులో నలుగురు యువకులు గల్లంతై మృతి చెందారు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు సంక్రాంతి పండుగ సందర్భంగా కోటిపల్లి ప్రాజెక్టులో సరదాగా విహారయాత్రకు వెళ్లారు. అక్కడ గుంత ప్రాంతం, బురద ఎక్కువగా ఉండడంతో గుర్తించలేదు. దీంతో నలుగురు గల్లంతు అయ్యారు. ఆ నలుగురిలో ఇద్దరికీ ఈత వచ్చినప్పటికీ, బురదలో ఇరుక్కు పోవడం కారణంగా ఒకరిని కాపాడబోయి మరొకరు అలా నలుగురు గల్లంతైనట్టు తెలుస్తుంది. ఘటనా స్థలానికి చేరుకున్న దారూర్ పోలీసులు స్థానికుల సహాయంతో నలుగురిని వెలికితీసి, వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో రాజేష్ (24), జగదీష్ (24), వెంకటేష్ (25), లోకేష్ (28) మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ప్రమాదానికి గల కారణాలు ఆరా తీశారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్న వికారాబాద్ డీఎస్పీ సత్యనారాయణ ప్రమాదానికి గల కారణాలను ఆరా తీయడం జరిగింది.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

- ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం



నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం 43 వ వార్డులో, గాంధీనగర్‌లో మహిళా సంఘం, యువజన సంఘం, నవతెలంగాణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులు వేశారని, ప్రతి ముగ్గు ఆదర్శంగా నిలిచే విధంగా యువతకు ఆలోచింప విధంగా ఉందని చెప్పారు. నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతన్నల దీనగాథలపై ముగ్గులు వేయడం వలన వారి సమస్యలు అందరూ అర్థం చేసుకునేలా ఉన్నాయన్నారు. మహిళలు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని సూచించారు. ప్రజల మధ్యలో ఉండి ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడే నాయకులను ఎన్నికల్లో గెలిపిస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ డబ్బికార్ మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు డాక్టర్ మల్లుగౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, ఆయూబ్, పరుశరాములు, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధన, సీనియర్ నాయకురాలు గాదె పద్మ, పట్టణ కార్యదర్శి అరుణ, మాజీ కౌన్సిలర్ చెనగోని యాదగిరి, కరిమున్నిసా, దేవయ్య, క్రాంతి, కోడిరెక్క మల్లయ్య, యేసు, జూకంటి హరిబాబు, వెంకటరెడ్డి, చారి, పులమ్మ, జగన్‌నాయక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకతీతంగా ముగ్గులు ఉండాలి

కుల మతాలకు అతీతంగా ముగ్గులు వేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. పట్టణంలో 34 వ వార్డు గాంధీనగర్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు మంచి సందేశం ఇచ్చే విదంగా ముగ్గులు వేశారని జూలకంటి అన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా రాజకీయ చైతన్యం కలిగి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు మల్లు గౌతమ్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రెమడాల పరశురాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, పార్టీ వన్ టౌన్ కమిటీ సభ్యులు యాదగిరి, కోడి రెక్క మల్లయ్య, వేములపల్లి వైస్ఎంపీపీ పాతూరి గోవర్ధన, మహిళా సంఘం అధ్యక్షురాలు అరుణ, బంటు రామారావు, పార్టీ శాఖ కార్యదర్శి తక్కెళ్ళపల్లి ఏసుబాబు, కేవీపీఎస్ జిల్లా నాయకులు దైద దేవయ్య, డీవైఎఫ్ఐ నాయకులు దైద శివకుమార్, రెమడాల క్రాంతి, రణధీవేకుమార్, బొంగరాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి పెద్ద పీట

మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వి .శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జనవరి 20 నుంచి 22 వరకు జరగనున్న తెలంగాణ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ - 2023 నిర్వాహణ పై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత క్రీడా మైదానాల నిర్మాణాలను ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే 50 శాతానికి పైగా ప్రారంభించామని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను సుమారు 9,500 గ్రామీణ క్రీడా ప్రాంగణాలను నిర్మించామన్నారు. వీటి ద్వారా కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్ క్రీడలను ప్రోత్స హిస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలను సాధించి రాష్ట్ర ప్రతిష్టను పెంపొందించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. కామన్వెల్త్‌లో మెరుగైన ప్రదర్శన చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నిఖత్ జరీన్ ఛాంపియన్‌గా నిలిచి ఇతర క్రీడాకారులకు స్ఫూర్తి నిచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను, కోచ్‌లను ప్రోత్సహిస్తున్నామన్నారు. స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ - 2023 లో సుమారు వెయ్యి మంది క్రీడా కారులు పాల్గొంటున్నారని వెల్లడించారు. 38 సబ్ జూనియర్, ఆరు క్యాడేట్, 39 జూనియర్, 308 సీనియర్ విభాగాల పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మెన్ ఇ. ఆంజనేయ గౌడ్, టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ గౌడ్, సెక్రెటరీ ప్రవీణ్, శ్రీకాంత్, శ్రీహరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ బ్యాడ్జీలతో కంటి వెలుగు డ్యూటీలకు హాజరవ్వాలి

టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిమాండ్ బ్యాడ్జీలతో ఈ నెల 18 నుంచి 21 వరకు కంటి వెలుగు డ్యూటీలకు హాజరు కావాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియోద్దీన్, కె.యాదనాయక్ కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు,ఈసీ ఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఏఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్‌ఆర్డి ఏఎన్ఎంలు ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలను యథావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వైద్యారోగ్య రంగానికి బలమైన ఆయువు పట్టుగా ఉండి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఏ.ఎన్.ఎంలు రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న నేటికీ రెగ్యులర్ కాకపోవడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలు ఏకకాలంలో 36 రకాల రికార్డులు ఆన్ లైన్‌లో,ఆఫ్‌లైన్‌లో నమోదు చేస్తున్నారనీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. 23 సంవత్సరాలుగా పని చేస్తున్న ఏఎన్ఎంలకు 8, 9, 10 పీఆర్సీల ప్రకారం బేసిక్ పే ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో తొలి పీఆర్సీ బేసిక్ పే ఇవ్వకుండా 30 శాతం వేతనాలు మాత్రమే పెంచారనీ, దీంతో ఏఎన్ఎంలు ప్రతి నెలా రూ.ఐదు వేలు నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే బేసిక్ పే ప్రకారం వేతనాలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండో ఏఎన్ఎంలు, ఈసీ ఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఏఎన్ఎంలు గత 23 సంవత్సరాలుగా పని చేస్తున్న కనీస వేతనాలు ఇవ్వకుండా, రెగ్యులర్ చేయకుండ ప్రభుత్వం మోసం చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే వీరందరిని ఎలాంటి షరతులు లేకుండ యథావిధిగా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న సెకండ్ ఎఎన్ఎంలు, ఈసీ.ఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఎఎన్ఎంలు, ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలు డిమాండ్ బ్యాడ్జీలు ధరించి డ్యూటీలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్పందనను బట్టి ఈ నెల 22న (ఆదివారం) భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వారు తెలిపారు.

ఎమ్మెల్యే కనుసన్నల్లోనే జగిత్యాల మాస్టర్ ప్లాన్

- ఆ విషయంలో కేటీఆర్‌తో ప్రకటన చేయించాలి : కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ మొత్తం స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కనుసన్నల్లోనే తయారైందని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సెమీ పబ్లిక్, పబ్లిక్ జోన్‌గా సూచించిన జగిత్యాల అర్బన్ మండలం మోతే గ్రామంలో సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ విషయంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రైతుల్లో ఆందోళనలు తొలగించే విధంగా మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే ప్రకటన చేయించాలని కోరారు. ప్రభుత్వ భూములు ఉండగా రైతులకు సంబంధించిన పట్టా భూములను డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో ఎందుకు చేర్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాస్టర్ ప్లాన్ విషయంలో జిల్లాలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రద్దు చేయించేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చెప్పిన మాటలను గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా జగిత్యాల మున్సిపాలిటీలో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించాలని, మాస్టర్ ప్లాన్‌ను జగిత్యాల పట్టణానికి పరిమితం చేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేయించేందుకు రైతుల పక్షాన నిలబడి అండగా ఉంటామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

టీచర్ మల్లికార్జున్‌పై దాడి దుర్మార్గం

న్యూడెమోక్రసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీచర్ మల్లిఖార్జున్‌పై సంఘ్‌పరివార్ శక్తుల దాడి దుర్మార్గమైందని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి సూర్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనపై పొంతన లేని ప్రచారాన్ని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామిక పద్ధతులకు భిన్నంగా వ్యవహరించటం తగదని తెలిపారు.రాజ్యాంగం కల్పించిన వాక్‌స్వాతంత్రాన్ని ఉల్లంఘించట మేనని పేర్కొన్నారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాకే పరిమితం కాదనీ, తమ అభిప్రాయాలను బలపర్చని వారిపై ఇలాంటి దాడులకు ఒడిగడతారని తెలిపారు. ఇది ముమ్మాటికి నియంతృత్వ చర్యేనని పేర్కొన్నారు.

కంటి వెలుగు విజయవంతానికి అన్ని శాఖలు సహకరించాలి


- జిల్లా కలెక్టర్లతో మంత్రి హరీశ్ రావు సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంటి వెలుగు కార్యక్రమం విజయవంతానికి అన్ని శాఖలు సహకరించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు కోరారు. ఖమ్మం నుంచి ఆయన కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జనవరి 18న ఖమ్మంలో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారనీ, జనవరి 19 నుంచి జిల్లాల్లో శిబిరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రజలు షెడ్యూల్ ప్రకారం వచ్చేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలనీ, ప్రతి ఇంటికి కంటి వెలుగు ఆహ్వాన పత్రిక అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాట్సప్ గ్రూపుల ద్వారా సకాలంలో క్యాంపులు ప్రారంభించేలా పర్యవేక్షించాలనీ, క్యాంపులకు వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. జిల్లాల్లో ఈ నెల 19న ఉదయం తొమ్మిది గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, జడ్పీ చైర్మన్లు జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచులు వారి పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించాలని మంత్రి సూచించారు. ఉదయం 8.45 గంటల వరకు తప్పనిసరిగా బృందాల సభ్యులు క్యాంపు ప్రాంతానికి చేరుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ, కంటి వెలుగు కార్యక్రమం కోసం 15,000 మంది సిబ్బందిని నియమించినట్టు, పరీక్షలకు అవసరమైన పరికరాలు, కండ్లద్దాలు ఇది వరకే సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, డీజీపీ అంజనీ కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముగా కమలాకర్



నవతెలంగాణ-జన్నారం

సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముగా కమలాకర్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సీపీఎస్ సమావేశంలో మాట్లాడారు. రాజస్తాన్, పంజాబ్, ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను అందిస్తున్న విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు వల్ల రూ.2లక్షల సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయకపోతే, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో సీపీఎస్ ఉద్యోగుల మహాగర్జన నిర్వహిస్తామని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను, పీఆర్సీ ఎరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోళ్ల గంగన్న, గుమ్మడి ఆయాన్, రమేష్, కాంతయ్య, షఫీక్, రాజయ్య పాల్గొన్నారు.

సంపాదకీయం

ఎంతో చేసుంటే ఇంతాయాసమెందుకు?

ఎంతో చేసుంటే ఇంత ఆయాస పడుతున్నారెందుకో ఎంతకీ బోధపడటం లేదు..! అన్ని కోట్లిచ్చాం ఇన్ని కోట్లిచ్చామని ప్రజల్ని బుకాయించి మరీ వాదిస్తున్న ఢిల్లీ పెద్దల్ని, వారి తెలంగాణ అంతేవాసుల్ని చూస్తే ఆశ్చర్యమేకాదు, ఒకింత డౌటుకూడా వస్తుంది. వారిచ్చింది నిజమా? వీరు ఇవ్వలేదనేది నిజమా? ఆ లెక్కల మాయాబజార్‌లోకెళ్తే

> మోడీ భక్తులు ఏమి భజన చేసినా, ఎంత భజన చేసినా 2008 నుండి 2021 మధ్య మన దేశం దిగువ, మధ్య ఆదాయమున్న దేశంగానే ఉంది. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) చేరుకోవడంలో మన దేశంకంటే శ్రీలంక, బంగ్లాదేశ్ మెరుగ్గా ఉన్నాయని కేటీఆర్ అంటే కిషన్‌రెడ్డి ఉలిక్కిపడ్డాడు. ఆ లెక్క తేల్చింది ఐక్యరాజ్యసమితే! బీజేపీ నాయకులు అర్థం చేసుకోవాల్సిన విషయమేమంటే "మీకిచ్చే వారికే మీరిస్తూ" అదే పాలననుకుంటే చెల్లుబాటు కాదు.

మనం బయటపడం. ఒకటి మాత్రం నిజం. ఎంతో చేశామనేవారు నిర్దిష్టంగా వాటి సంగతి తేల్చలేక కొత్తమార్గం ఎంచుకున్నట్లున్నారు. కాదేదీ ప్రచారానికి అనర్హమన్నట్లు రైళ్ళు, ఓడలు కూడా మోడీ సేవలో తరించడమే నేటి వైచిత్రి!

ఏలినవారి కబంధ హస్తాలను ఛేదించుకుని బయటకు పొక్కిన దేశీయ లెక్కలు, ఆక్స్‌ఫామ్, యు.ఎన్.డి.పి, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు వెలువరించే వివరాలు పరిశీలిస్తే ఈ ప్రచారార్భాటపు డొల్లతనం బహిర్గతమవుతుంది. తెలంగాణలో బీజేపీ ఆడుతున్న రాజకీయ చదరంగంలో 'వందే భారత్' రైలు నేడొక ఆసరాగా దొరికింది. నాయకులతో కార్యకర్తలు సెల్ఫీలు దిగడం నేడు అన్ని పార్టీలకూ విస్తరించింది. కేంద్ర మంత్రులతో, శాసనసభ్యులు సెల్ఫీలు దిగడం ఒకింత విడ్డూరంగా ఉన్నా ఇది సర్వసాధారణమై పోయింది. ఒక కేంద్రమంత్రితో, మరో కేంద్ర మంత్రి సెల్ఫీ దిగడం, దాన్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం, పత్రికలకు పంపడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.




సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ రైలు ప్రారంభాన్నే ఆర్భాటంగా జరపాలనుకున్నారు బీజేపీ నేతలు. తదనంతరం పెరేడ్ గౌండ్‌లో భారీసభ అనుకున్నారు. ఖమ్మంలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభతో తోక ముడిచినట్టు కొన్ని కథనాలు వెలువడ్డాయి. కాని రైల్వేస్టేషన్ల చుట్టూ వెలిసిన బ్యానర్లు, కటౌట్లు, తొలిరోజు 21 స్టేషన్లలో ప్రజల సందర్శనార్థం నిదానంగా వెళ్ళడమో, ఆపడమో చేస్తారట! ఎంతో చేసిన బీజేపీ నేతలు రైళ్ళను కూడా ప్రచారాస్త్రంగా వాడుకోవాల్సిన ఖర్మేం కాలిందో చెప్పగలరా? ఇదంతా గుజరాత్ తరహా అభివృద్ధి కాబోలు! మొన్న గుజరాత్‌లో గట్టెక్కినట్లే 2024లో లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయతీరాలను చేరుతామనే భ్రమల్లో ఉన్నట్లుంది. భారతదేశ వాస్తవాలు బీజేపీ నేతలు పట్టించుకోకపోయినా ఆ విధానాలపై పోరాడేవారైనా పరిగణనలోకి తీసుకోవడం తక్షణావసరం.

ఢిల్లీ-వారణాసి వందే భారత్ రైలులో సగటున రోజూ 500 ఖాళీలుంటున్నాయి. ఇప్పటివరకు ప్రారంభమైన ఏడు రైళ్ళలోనూ ఇదే స్థితి. మన పరిస్థితి త్వరలో చూస్తాం. బర్రెలను గుద్ది ఇంజన్ అంతా తుక్కుతుక్కు అయిన ఫొటోలు చూసి దేశం విస్తుపోయింది. దేశంలో ప్రజల పరిస్థితులు రోజురోజుకూ దిగజారు తున్నాయి. ప్రపంచంలో అత్యధిక మంది పేదలున్న దేశంలో వందేభారత్ రైళ్ళు, బులెట్ ట్రెయిన్స్‌ని వినియోగించగల సామర్థ్యం ఎందరికుంది? శతకోటీశ్వరులు, శత సహస్ర కోటీశ్వరులు దేశంలో పెరిగిన మాట వాస్తవం. వారుకూడా అప్పులతో చిందులు వేస్తున్నారు. ఏమైనా మోడీ సర్కార్ వారి ప్రయోజనాలకై నిలబడుతోందని వేరే చెప్పక్కర్లేదు. ఇటీవల వారణాసిలో మోడీ జెండా ఊపి ప్రారంభించిన 'గంగా విలాస్' ఓడలో 51రోజుల ప్రయాణానికి 55లక్షల రూపాయలు ఖర్చు. ఈ 'గంగా విలాస్' ఓడలో ఇప్పటికే 2024 మార్చి వరకు బుకింగ్ పూర్తయిందట! ఆయన దగ్గరవున్న 'మీటర్ బద్దే' వేరు. దాంతో సామాన్యులు కొలవబడరు. వాళ్ళంతా తాలూ, తరకే! గాలికి ఎగిరిపోయే వారేనని భ్రమపడుతున్నారు.

మోడీ భక్తులు ఏమి భజన చేసినా, ఎంత భజన చేసినా 2008 నుండి 2021 మధ్య మన దేశం దిగువ, మధ్య ఆదాయమున్న దేశంగానే ఉంది. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) చేరుకోవడంలో మన దేశంకంటే శ్రీలంక, బంగ్లాదేశ్ మెరుగ్గా ఉన్నాయని కేటీఆర్ అంటే కిషన్‌రెడ్డి ఉలిక్కిపడ్డాడు. ఆ లెక్క తేల్చింది ఐక్యరాజ్యసమితే! రోజూ పత్రికలు తిరగేస్తే ఆటో మొబైల్ రంగం కునారిల్లుతున్నా రూ.3కోట్ల బెంజ్‌కార్లు, రూ.5కోట్ల రోల్స్‌రాయ్స్ కార్ల గిరాకి తగ్గలేదు. మన హైదరాబాద్‌తో సహా అనేక పట్టణాల్లో అపార్ట్‌మెంట్లు అమ్ముడుపోకపోయినా రెండుకోట్ల రూపాయల విల్లాలు బ్రహ్మాండంగా అమ్ముడవు తున్నాయి. బీజేపీ నాయకులు అర్థం చేసుకోవాల్సిన విషయమే మంటే "మీకిచ్చే వారికే మీరిస్తూ" అదే పాలననుకుంటే చెల్లుబాటు కాదు.

ముంచుకొస్తున్న ప్రపంచ ఆర్థిక మాంద్యం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2023లో మరింత మందగించబోతున్నదని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టినా జార్జీవా మొత్తానికి బహిరంగంగా ఒప్పుకున్నారు. అంతే కాదు, దాదాపు మూడో వంతు ప్రపంచంలో స్థూల జాతీయోత్పత్తి ఇప్పుడు ఉన్నదానికన్నా తగ్గిపోతుందని కూడా ఆమె ప్రకటించారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక శక్తులు అమెరికా, యూరపియన్ యూనియన్, చైనా - ఈ మూడూ వృద్ధిలో వేగం తరుగుదలను చవిచూడనున్నాయి. ఇదే ప్రపంచ ఆర్థిక మాంద్యం ముదిరిపోడానికి కారణమవనుంది. ఆ మూడింటిలో చైనాలో కోవిడ్ తిరిగి విజృంభించడం వలన అక్కడ వృద్ధి వేగం దెబ్బ తిననుంది. వాటిలో అమెరికా వరకూ తక్కిన దేశాలకన్నా సాపేక్షంగా మెరుగైన రీతిలో ఆర్థిక వ్యవస్థ నడక ఉండవచ్చునని క్రిస్టినా విశ్వసిస్తున్నారు. దానికి ప్రధాన కారణం అమెరికాలో కార్మికుల వేతనాల స్థాయి పెద్దగా పడిపోకుండా నిలదొక్కుకోగలగడం. వాస్తవానికి దాని వలన అమెరికన్ ఆర్థిక వ్యవస్థకే కాక ప్రపంచానికి కూడా ప్రయోజనం ఉంటుంది.


ప్రభాత్‌పట్నాయక్

జార్జీవా వ్యాఖ్యలలో పొంతన కుదరని రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది: కార్మికుల ఆదాయాలను నేరుగా వేతనాల కోత రూపంలో గాని, లేకపోతే వారి సంక్షేమం కోసం చేసే ఖర్చుపై కోత విధించే రూపంలో గాని కుదించాలని ఐఎంఎఫ్ ఎప్పుడూ ప్రచారం చేస్తుంది. వ్యవస్థీకృత సర్దుబాటు చర్యలలో ఒక భాగంగా కార్మికుల ఆదాయాలను కుదించడం గురించి పట్టుబట్టే ఐఎంఎఫ్ ఇప్పుడు ఆ కార్మికుల ఆదాయాలు అమెరికాలో పెద్దగా పడిపోకుండా నిలబడినందువల్లనే అక్కడి పరిస్థితి కాస్త ఆశాజనకంగా ఉందని ఒప్పుకోవడం ఆశ్చర్యకరమైన విషయమే అయినా, ఆహ్వానించదగినది కూడా. కార్మికుల వేతనాలు పడిపోకుండా ఉన్నందువల్లనే అమెరికా ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోగలిగిందని ఆమె సూటిగా అంగీకరించకపోవచ్చు. ఆ వాస్తవాన్ని తిరగేసి అమెరికా ఆర్థిక వ్యవస్థ గట్టిగా నిలదొక్కుకో గలిగినందువల్లనే అక్కడి కార్మికుల వేతనాలు పడిపోకుండా నిలబడ్డాయని జార్జీవా వాదించవచ్చు. కాని ఆ విధంగా కార్మికుల వేతనాలు పడిపోకుండా ఉండడం ఒక "వరం"గా ఆమె పరిగణించడం అంటే, మార్కెట్‌లో కొనుగోలుశక్తిని నిలబెట్టడంలో కార్మికుల వేతనాలు పోషించే కీలకపాత్రను ఆమె గుర్తించిందన్నమాట.

సంక్షోభంలో ఉన్న దేశాల ఆర్థిక వ్యవస్థలు కోలుకోడానికి మాత్రమే వ్యవస్థీకృత సర్దుబాటు విధానాలను గురించి ఐఎంఎఫ్ పట్టుబడుతుందని, అంతే తప్ప ఆర్థిక వృద్ధికి దారి తీయడానికి మార్గంగా సర్దుబాటు విధానాలను ఐఎంఎఫ్ ఎప్పుడూ ప్రతిపాదించలేదని, అందువలన ఇప్పుడు జార్జీవా ప్రకటనను బట్టి ఐఎంఎఫ్ దృక్పథంలో ఏదో మార్పు వచ్చేసిందని మనం భావించకూడదని కొందరు చెప్పవచ్చు. కాని ఒకటి మాత్రం వాస్తవం. ఇంతకాలమూ తాను ప్రబోధిస్తూవస్తున్న విషయానికి భిన్నంగా ఇప్పుడు ఐఎంఎఫ్ చెప్పింది. అమెరికా ఆర్థికంగా నిలదొక్కుకోడానికి అక్కడి కార్మికుల వేతనాలు పడిపోకుండా ఉండడం తోడ్పడుతుందని ఒప్పుకుంది. సంక్షోభంలో ఉన్న ఇతర దేశాలలో కూడా తమ తమ సంక్షోభాలను అధిగమించడానికి అదేమాదిరిగా ఎందుకు ప్రత్యక్ష చర్యలు తీసుకోకూడదు? అన్న ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. దేశీయ డిమాండ్‌ను పడిపోకుండా నిలువుకోడానికి కార్మికుల వేతనాలను తగ్గించడమో, వారి సంక్షేమానికి చేసే ఖర్చు తగ్గించడమో చేసే బదులు, దిగుమతులపై ఆంక్షలు విధించడం, ధరలను ప్రభుత్వం ప్రత్యక్షంగా నియంత్రించడం వంటి చర్యలకు ఎందుకు పూనుకోకూడదు? నయా ఉదారవాదం ఇంతకాలమూ ప్రచారం చేస్తూ ఐఎంఎఫ్ ఇంతవరకూ గట్టిగా పట్టుబడు తున్నదానికి, ఇప్పుడు జార్జీవా ఒప్పుకున్న విషయానికి (కార్మికుల వేతనాలు పడిపోకుండా నిలబడడం అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా నిలబడడానికి దోహదం చేస్తుంది అన్న విషయం) మధ్య పూర్తి తేడా ఉంది అన్న విషయం గమనించాలి.

ఇక జార్జీవా చెప్పిన దాంట్లో పొంతన లేని రెండో విషయం సంగతి చూద్దాం. అమెరికాలో కార్మికుల వేతనాలస్థాయి పడిపోకుండా నిలబడడం అమెరికా వృద్ధికి దోహదం చేస్తూనే, మరోపక్క అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీస్తుందని, దానివలన అమెరికన్ ఫెడరల్ రిజర్వు అక్కడ వడ్డీరేట్లను మరింతగా పెంచక తప్పదని ఆమె చెప్పారు. ఇది రెండు పర్యవసానాలను సూచిస్తోంది. మొదటిది: ప్రస్తుతానికి అమెరికా వృద్ధి రేటు కొనసాగినా, రాబోయే మాసాల్లో ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లు పెంచడం వలన దెబ్బ తినవచ్చు. తక్కిన దేశాలతో పోల్చితే అమెరికా పరిస్థితి 2023లో బాగానే ఉన్నట్టు కనిపించినా ఈ పరిస్థితి దీర్ఘకాలంపాటు కొనసాగబోవడం లేదు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో జరిగే పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద మొత్తంగానే ప్రభావం చూపుతాయి. కాబట్టి రాబోయే మాసాల్లో ప్రపంచ ఆర్థిక మందగమనం మరింత పెరిగే అవకాశాం స్పష్టంగా ఉంది. కోవిడ్ తాకిడి నుండి కోలుకుని చైనా గణనీయంగా పురోగమించితే తప్ప ప్రపంచ ఆర్థిక మాంద్యం మరింత దిగజారడం అనివార్యంగా కనిపిస్తోంది. 2023 ప్రారంభంలో ప్రపంచంలో మూడోవంతు వరకూ ఆర్థికమాంద్యం ఆవరించినది కాస్తా అనతికాలంలో మరింత ఎక్కువ భాగానికి ఆ మాంద్యం విస్తరించనుంది. ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఏవిధంగా ఉండబోతోందో ఆ వ్యవస్థ ప్రతినిధే స్వయంగా ప్రకటించారు.

ఇదేమాదిరిగా ప్రపంచబ్యాంకు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలో నెలకొన్న ఆర్థిక మాంద్యపు తీవ్రత గురించి, ప్రత్యేకంగా మూడో ప్రపంచదేశాలమీద దాని ప్రభావం ఏవిధంగా పడబోతోంది అన్న విషయం గురించి హెచ్చరిస్తోంది. 2022 సెప్టెంబర్‌లో ప్రపంచబ్యాంకు విడుదల చేసిన ఒక పత్రంలో ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు 2023లో 1.9శాతంగా ఉండబోతోందని ప్రపంచబ్యాంకు అంచనా వేసింది. అయితే, ప్రపంచబ్యాంకు గాని, ఐఎంఎఫ్‌గాని ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యం ప్రధానంగా ఉక్రెయిన్ యుద్ధం వలన, దాని కారణంగా పెరిగిన ద్రవ్యోల్బణం వలన (దానితోబాటు కొంతవరకూ కోవిడ్‌మళ్ళీ తలెత్తడం వలన) వచ్చిందేనని చెప్తున్నాయి. ఆ ద్రవ్యోల్బణం కారణంగానే అన్నిదేశాల్లోనూ వడ్డీరేట్లు పెరిగాయని, ఇప్పుడు అది ఆర్థిక మాంద్యానికి దారితీసిందని అంటున్నాయి. అంతే తప్ప ఈ ముప్పు వెనుక నయా ఉదారవాద విధానాల పర్యవసానాలు పోషించిన పాత్ర ఊసే ఎత్తడం లేదు.

ఇంతకూ, ఆర్థికమాంద్యం ముంచుకురావడానికి ఈ రెండు సంస్థలూ చూపుతున్నవి సరైన కారణాలు కావు. ఉక్రెయిన్ యుద్ధం మొదలవడానికి చాలా ముందే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం తలెత్తింది. అప్పటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోవిడ్ తాకిడి నుండి కోలుకోవడం కూడా మొదలైంది. కోవిడ్ కారణంగా సరుకుల సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నదని, దానివల్ల ద్రవ్యోల్బణం

> ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఏవిధంగా ఉండబోతోందో ఆ వ్యవస్థ ప్రతినిధే స్వయంగా ప్రకటించారు.నిజానికి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక మార్గాంతరం లేని స్థితిలో పడిపోయిన వాస్తవ పరిస్థితిని ఇది సూచిస్తోంది. పశ్చిమదేశాల సామ్రాజ్యవాదం కొన్ని సంవత్సరాలుగా బిగించిన పట్టును యధాతథంగా నిలబెట్టుకోవాలంటే అవి ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగించాల్సిందే. అప్పుడు ఈ ద్రవ్యోల్బణం, దానితోబాటు వాళ్ళు సృష్టించిన ఆర్థిక మాంద్యం కొనసాగాల్సిందే. అప్పుడు నిరుద్యోగం పెరగక తప్పదు. ఇది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంచుకున్న మార్గమే. ఇందులో ఆశ్చర్యపడవలసినది ఏమీ దేదు. దానిని ప్రతిఘటించడమే ముందున్న కర్తవ్యం.



తలెత్తిందని అప్పుడు చెప్పుకొచ్చారు. కాని అప్పుడు కూడా చాలామంది ఆ వివరణతో ఏకీభవించలేదు. వాస్తవ సరుకుల కొరత కన్నా, సరుకుల కొరత ఏర్పడబోతోందన్న అంచనాతో బడా కార్పొరేట్లు ముందస్తుగా తమ లాభాల మార్జిన్‌లను బాగా పెంచివేసి సరుకుల ధరలు పెరిగిపోడానికి కారణమయ్యారని, అందువల్లనే ద్రవ్యోల్బణం ఏర్పడిందని వారు అసలు సంగతి బైటపెట్టారు. ఆ విధంగా ద్రవ్యోల్బణం విజృంభిస్తున్న సమయంలో ఉక్రెయిన్ యుద్ధం మొదలైంది. ఆ పేరుతో పశ్చిమ పెట్టుబడిదారీ దేశాలు రష్యా మీద ఆంక్షలు విధించాయి. ఇదంతా కలిసి ద్రవ్యోల్బణం ఇతోధికంగా పెరగడానికి దారితీసింది.

ముడిచమురు ధరలు ఏవిధంగా పెరిగిపోయాయో పరిశీలిస్తే ఉక్రెయిన్ యుద్ధం తోనే ద్రవ్యోల్బణం మొదలైందన్న వాదన తప్పు అని స్పష్టం అవుతుంది. ప్రపంచం కోవిడ్ సంక్షోభం నుండి 2021లో కోలుకుంటున్న సమయంలో క్రూడాయిల్ ధరలు పెరగడం మొదలైంది. 2021 ఆరంభంలో బ్యారెల్ ముడిచమురు 50.37 డాలర్లు ఉన్నది కాస్తా ఆ ఏడాది చివరికి 77.24 డాలర్లకు ఎగబాకింది. ఇది 50శాతం కన్నా ఎక్కువ పెరుగుదల. అదే ఉక్రెయిన్ యుద్ధం జరిగిన ఏడాది 2022లో చూస్తే 78.25 డాలర్లనుండి 82.82 డాలర్లకు పెరిగింది. ఇది 5.8శాతం పెరుగల మాత్రమే. వాస్తవానికి ప్రస్తుతం సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో ఉన్న ద్రవ్యోల్బణం రేటు కన్నా ఇది తక్కువ. రష్యా మీద ఆంక్షలు విధించినట్టు ప్రకటించగానే క్రూడాయిల్ ధర అమాంతం 133.18డాలర్లకు పెరిగిపోయింది. అయితే ఆ వెంటనే అంతే వేగంగా వెనక్కి వచ్చింది. అంటే ఉక్రెయిన్ యుద్ధం వల్లనే ద్రవ్యోల్బణం అన్న వాదన తప్పు అని స్పష్టం అవుతోంది. నిజానికి యుద్ధం కన్నా ప్రధాన కారణం అమెరికా విధించిన ఆంక్షలు .

బ్రెట్టన్‌వుడ్ సంస్థల విశ్లేషణ లోపభూయిష్టంగా ఉండడం మాత్రమే కాదు. ఆ సంస్థలకు ఈ ప్రపంచ మాంద్యం ఏవిధంగా ముగింపునకు రాబోతోందో కూడా అవగాహన లేదు. వాళ్ళు చెపుతున్నట్టు ఉక్రెయిన్ యుద్ధం వల్లనే ఈ మాంద్యం ముంచుకొచ్చింది వాస్తవమే అయితే, ఆ యుద్ధాన్ని త్వరగా ముగించడానికి పూనుకోవాలి కదా! కాని పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు ఈ యుద్ధాన్ని త్వరగా ముగించడానికి సుముఖంగా లేరు. దానికి బదులు, ఈ యుద్ధాన్ని సాగదీసి, ఆక్రమంలో రష్యా పూర్తిగా బలహీనపడి తమకు దాసోహం కావాలని వాళ్ళు కోరుతున్నారు. అందుకే ఈ రెండు సంస్థలూ ఉక్రెయిన్ యుద్ధం త్వరగా ముగిసిపోవడానికి అనుగుణంగా ఏ ప్రతిపాదనలనూ చేయడం లేదు. అంతే కాదు, వడ్డీ రేట్లను మరింత పెంచడం మినహా, తద్వారా మాంద్యాన్ని మరింత ముదరబెట్టడం మినహా, వాళ్ళ దగ్గర ఏ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలూ లేవు. స్వేచ్ఛామార్కెట్ సూత్రానికి ఆ సంస్థలు ఎంతగా అంకితం అయిపోయాయంటే వారి ఊహల్లో ద్రవ్యోల్బణాన్ని అదుపుచేయడానికి తోడ్పడే మరే ఇతర ప్రతిపాదనలూ లేనే లేవు. (నిజానికి ప్రభుత్వాలు నేరుగా మార్కెట్‌లో జోక్యం చేసుకుని ధరలను నియంత్రించవచ్చు. అప్పుడు ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంది.) ఆర్థికమాంద్యం ప్రభావం గురించి వాపోవడం మినహా వారేమీ చేయడం లేదు.

ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు డేవిడ్ మల్పాస్ రుణభారాలతో మగ్గిపోతున్న మూడో ప్రపంచదేశాల గురించి మాట్లాడుతూ, ఆ దేశాల రుణభారానికి ప్రధాన కారణం అధిక వడ్డీరేట్లు అని చెపుతున్నాడు. కాని ఆ అధిక వడ్డీరేట్లను తగ్గించే ప్రతిపాదన ఏదీ చేయడం లేదు. ఈ బ్రెట్టన్‌వుడ్ సంస్థలు చాలా అతిగా మూడో ప్రపంచదేశాల పేదల మీద జాలి పడుతున్నాయి కాని వారి కష్టా లకు పరిష్కారం చూపేవిషయంలో చాలా తక్కువగా కదులు తున్నాయి.

ఇది కేవలం ఆ సంస్థలకున్న పిరికితనం వల్ల వచ్చినది కాదు. నిజానికి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక మార్గాంతరం లేని స్థితిలో పడిపోయిన వాస్తవ పరిస్థితిని ఇది సూచిస్తోంది. పశ్చిమదేశాల సామ్రాజ్యవాదం కొన్ని సంవత్సరాలుగా బిగించిన పట్టును యధాతథంగా నిలబెట్టుకోవాలంటే అవి ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగించాల్సిందే. అప్పుడు ఈ ద్రవ్యోల్బణం, దానితోబాటు వాళ్ళు సృష్టించిన ఆర్థిక మాంద్యం కొనసాగాల్సిందే. అప్పుడు నిరుద్యోగం పెరగక తప్పదు. ఇది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంచుకున్న మార్గమే. ఇందులో ఆశ్చర్యపడవలసినది ఏమీ దేదు. దానిని ప్రతిఘటించడమే ముందున్న కర్తవ్యం.

- స్వేచ్ఛానువాదం




జెఆర్ఎఫ్ వయోపరిమితిని ఎత్తివేయాలి

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి) పరిశోధన, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల ఎంపిక నిమిత్తం సంవత్సరానికి రెండు పర్యాయాలు నేషనల్ ఎలిజిబిటీ పరీక్ష (నెట్) నిర్వహిస్తుంది. ఇందులో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జెఆర్ఎఫ్) సాధించడానికి ప్రస్తుతం అమలులో ఉన్న 30ఏండ్ల గరిష్ట వయసు నిబంధన వలన అభ్యర్థులకు సరైన న్యాయం జరగడం లేదు. నెట్ ప్రశ్నాపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉండి ఒక రకంగా సివిల్ సర్వీసెస్ పరీక్షతో సరిసమానంగా ఉండడం, కేవలం ఆరుశాతం మాత్రమే అర్హత సాధించే విధంగా నిబంధనలు రూపొందించడం వలన కూడా అభ్యర్థులు ఆశించిన లక్ష్యాలను సాధించలేకపోతున్నారు. అందువలన ఈ ప్రాయోగిక పరీక్షని ఆయా ప్రాంతీయ భాషలలో నిర్వహించే దిశగా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం ఆరుశాతం మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం వలన ఆ ఆరుశాతం దరిదాపులోకి చేరుకోలేని అభ్యర్థులు ప్రతిసారి మరో ప్రకటన కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. అలా ప్రతిసారి చెల్లించాల్సిన ఫీజులు అభ్యర్థులకు తడిసి మోపెడు అవుతున్నాయి. ఒక రకంగా అత్యధిక ధనంతో పాటు విలువైన సమయం కూడా వృధా అవుతున్నది. అభ్యర్థులు నిరంతర సాధనతో లెక్చరర్ షిప్‌కి స్వల్ప మార్కులతో అర్హతని సాధించినప్పటికీ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ని సాధించలేక పరిశోధనా విద్యకు దూరం అవుతున్నారు. నిజానికి విద్య అంటేనే నిరంతర ప్రక్రియ. అలాంటి విద్యపై ముఖ్యంగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ కోర్స్‌లో పరిశోధన నిమిత్తం పరిశోధకులకు నిధులు చేకూర్చే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పరీక్షపై గరిష్ట వయసు నిబంధనని విధించడం ఏమాత్రం సహేతుకం కాదు. ఈ గరిష్ట వయోపరిమితి నిబంధన వలన పరిశోధనపై ఆసక్తివున్నా అనేక మంది ఔత్సాహికులు పరిశోధనా విద్యకు దూరం అవుతున్నారు. ఇలా పరిశోధనా విద్యకు నోచుకోని వారి సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది తప్ప తగ్గడం లేదు. ఈ విషయాన్ని అనేక సందర్భాలలో అనేక గణాంకాలు వెల్లడిస్తూనే ఉన్నాయి.

ముఖ్యంగా 2022 సంవత్సరంలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) ఎంబిబిఎస్ విద్యలో ప్రవేశాలకు సంబంధించి గతంలో రూపొందింపబడి ఉన్న గరిష్ట వయోపరిమితిని ఎత్తివేసి వయస్సుతో నిమిత్తం లేకుండా అందరికీ వైద్య విద్యని ఆర్జించే అవకాశాన్ని కల్పించిన విషయం తెలిసిందే. అలాగే నేడు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు పోటీపడేవారికి కూడా గరిష్ట వయసు నిబంధన లేదు. కేవలం డాక్టరేట్ పరిశోధనా కోర్స్‌లలో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే అర్హతా పరీక్షకు గరిష్ట వయోపరిమితిని విధించడం అనేది ఏరకంగా చూసినా సహేతుకం కాదు. అందువలన ఇప్పటికైనా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిటీ టెస్టు ద్వారా నిర్వహించే జూనియర్ లెక్చరర్ షిప్ అర్హతా పరీక్షని రాయడానికి గరిష్ట వయోపరిమితిని తక్షణమే ఎత్తివేయాలి. తత్ఫలితంగా ఎంతోమంది పరిశోధక ఔత్సాహికులకు ఎంతగానో లబ్ది చేకూరుతుంది. మరెన్నో పరిశోధనలు ప్రజా బాహుళ్యంలో వెలుగు చూడగలవు.

- జె.జె.సి.పి. బాబూరావు సెల్: 9493319690



జైళ్లు కాదు బళ్లు కావాలి

దేశంలో నేరస్తులు పెరగడంతో అటు న్యాయ స్థానాలకు, ఇటు పోలీసు, జైళ్ల యంత్రాంగానికి పని భారం పెరుగుతున్నది. శిక్ష పడిన ఖైదీల కంటే, నేరారోపణ ఎదుర్కొంటున్న ఖైదీలే సుమారు 77శాతం మంది జైళ్లలో మగ్గుతున్నారు. కాబట్టి ఇప్పుడు నూతన జైళ్ళు నిర్మించాలి అనే మాటలు వినబడుతున్నాయి. నిజానికి ఈ ఆధునిక కాలంలో జైళ్ళు, ఖైదీల సంఖ్య రోజు రోజుకు తగ్గుముఖం పట్టాలి. కానీ పెరుగడం ఆందోళన కలిగించే అంశం. 2020 నుంచి 2021 కాలానికే సుమారు 15శాతం నేరాలు, నేరస్తుల సంఖ్య పెరగటం గమనార్హం. దీనికి ప్రధాన కారణం విద్య లేకపోవడం. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకపోవడం. రాజ్యాంగం ప్రకారం ప్రతీ ఒక్కరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య అందేటట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. కానీ రకరకాల జీవోలు, ఎన్ఈపీ-2020 లాంటి విధానాల ద్వారా నాణ్యమైన విద్యను ప్రజలకు దూరం చేస్తున్నారు. నూతన విద్యా ప్రణాళిక ప్రకారం చిన్న తరగతుల నుండే పరీక్షలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా డ్రాప్ అవుట్స్ పెరుగుతాయి. సంస్కృతం, వృత్తి విద్యలు, వాస్తు విద్యలకు ఎక్కువగా చోటు కల్పించారు. దాంతో సరైన విజ్ఞానం లేక ఉపాధి కోసం వక్రమార్గాలు పడుతూ, అసాంఘిక శక్తులుగా మారే అవకాశం మరింతగా ఏర్పడుతుంది. పేదరికం, కుటుంబ, ఆర్థిక, సామాజిక , ఆరోగ్య పరిస్థితులే అనేక సందర్భాల్లో నేర ప్రవృత్తి పెరగడానికి కారణం అవుతున్నవి. అలాగే సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా ద్వారా హింసా ప్రవృత్తి, మహిళలుపై అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్ వంటివి పెరుగుతూ జైళ్ళు ఖైదీలు, నేరారోపణ ఎదుర్కొంటున్న వారితో కిక్కిరిసి పోతున్నాయి. దీంతో ఖైదీల్లో అనేకులు అనారోగ్యాలకు గురవుతున్నారు. 2020లో 2116మంది జైల్లో ఉన్న ఖైదీలు మరణించారు అని నివేదికలు చెబుతున్నాయి. దీంతో జైళ్లలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఖైదీల సంఖ్య తగ్గుముఖం పట్టాలి అంటే చదువుతో పాటు యువతకు ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. ముఖ్యంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు అధిక బడ్జెట్ కేటాయింపులు చేయాలి. నూతన పరిశ్రమలు స్థాపించడానికి ముమ్మర ప్రయత్నాలు చేయాలి. సిలబస్‌లో మతపరమైన అంశాలు తొలగించాలి. సామాజిక శాస్త్రాలకు అధిక ప్రాధాన్యత కల్పించాలి. సైన్స్, గణితంతో పాటు సాంఘిక శాస్త్రం, ఇతర సామాజిక సబ్జెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. తల్లిదండ్రులు కూడా సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేటట్లు ఇంటి నుంచే తర్ఫీదు ఇవ్వాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించుటంతోపాటు సమాజంలో వెనుకబడిన తరగతుల వారికి, మహిళలకు ప్రభుత్వాలు రక్షణగా నిలవటం ద్వారానే మనదేశంలో నేరస్తులు తగ్గి, నూతన జైళ్ళు నిర్మించే పరిస్థితి ఏర్పడదు అని గ్రహించాలి.


- ప్రసాదరావు

పెన్షన్ ఒక సామాజిక బాధ్యత

పత్రికలు పెట్టుబడిదారుల విషపుత్రికలు అని శ్రీశ్రీ ఏనాడో చెప్పారు. పెట్టుబడిదారులకు పాదుకలల్లే తయారైన పాలకులకు నేడు పత్రికలు వందిమాగదులై వంతపాడు తున్నాయి. పాత పెన్షన్ విధానాన్ని ఒక "విషపూరితమైన విధానం" (ఓల్డ్ పెన్షన్ ఈస్ ఏ ఓల్డ్ 'పాయిజన్') అంటూ టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక భోగి పండుగ రోజు ఎడిటోరియల్‌ని ప్రచురించింది. అంతే కాకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న కొన్ని రాష్ట్రాలను, ఈ అంశంలో తీర్పునిచ్చిన ఢిల్లీ హైకోర్టును కూడా తప్పుపడుతూ అలాంటి ప్రయత్నాలను పూర్తిగా మానుకోవాలంటూ, కొత్త పెన్షన్ విధానానికే కట్టుబడి ఉండాలంటూ ఓ ఆజ్ఞాపనలాంటి సూచన చేసింది. ఇది ఎడిటోరియల్‌గా వచ్చింది కాబట్టి పత్రిక యాజమాన్యం యొక్క అభిప్రాయంగా మాత్రమే చూడటానికి వీలు లేదు. దీని వెనుక నూతన పెన్షన్ విధాన రూపకర్తల, ప్రభుత్వ పెద్దల హస్తం లేదని కొట్టిపారేయలేం. సదరు పత్రిక కథనం పాత పెన్షన్ విధానం వలన ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుందని, అందుచేత దానిని విరమించుకుని నూతన పెన్షన్ విధానానికి కట్టుబడాలని తెలిపింది. అయితే ప్రభుత్వ ఖజానాకు పన్నులను వసూలు చేసి అనేక మొత్తాలను సేకరిస్తున్నది ఉద్యోగులేనన్న వాస్తవాన్ని మాత్రం మరుగున పడేసింది.


జి. తిరుపతయ్య

"ప్రభుత్వంలోనూ, ప్రభుత్వేతర రంగాల్లోనూ పనిచేస్తున్న ఉద్యోగులు ఎవరు కూడా వేరే ఏ రకమైన ఉపాధిని చేపట్టరాదు" అన్న నిబంధన నియామక పత్రాలలోనే ఉంటుంది. అనగా ఉద్యోగులందరూ తమకు కేటాయించిన పనికి మాత్రమే పరిమితం కావాలి. అలాంటి కట్టుబాటును అమలుజేసిన చోట భవిష్యత్ బాధ్యత ఎవరిది? ఇప్పుడు వృద్ధాప్య సమయంలో ఉద్యోగులకు యాజమాన్యాలు లేదా ప్రభుత్వాలు కనీసం అన్నం పెట్టడానికి కూడా సిద్ధంగా లేవు. ఇది ఎంతటి దారుణం? జీవిత కాలమంతా కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి విధేయత చూపిన ఉద్యోగుల పట్ల, వారి భవిష్యత్తు పట్ల ఇంతటి ఘోరమైన వైఖరిని ప్రదర్శిస్తూ పెన్షన్ను 'పాయిజన్'గా వ్యక్తికరించిన వారిది ఒక విషపూరిత భావజాలంగా భావించాల్సిందే. 2004 తర్వాత నియమితులై రిటైర్ అవుతున్న వారికి వందల్లో మాత్రమే నూతన పెన్షన్ అందుతున్న సంగతి సదరు పత్రికకు తెలియదని భావించలేం. కేంద్ర ప్రభుత్వం కూడా పూర్తి అవగాహనతో, ఉద్దేశపూర్వ కంగానే పత్రికలను ఇలాంటి రాతలకై పురమాయిస్తున్నది. పరిపాలన అంటే లాభాపేక్ష కోసం పెట్టుబడిదారులకు వెసులుబాట్లు కల్పించే యంత్రాంగమా? లేదా విశాల ప్రజానీకానికి ఉపయోగపడే సంక్షేమ విధానమా? ఉద్యోగులను వారి యుక్త వయసులో ఉపయోగించుకొని వృద్ధాప్యంలో వదిలివేయడం ఏమాత్రం సమంజసం కాదు. అమలవుతున్న నూతన పెన్షన్ విధానానికి సమకూరుతున్న మొత్తం కూడా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులుగా పెట్టి ఉద్యోగి పదవి విరమణ పొందిన రోజు ఎంతైతే అందుబాటులో ఉందో దానిని మాత్రమే పెన్షన్‌గా పొందేలా స్టాక్ మార్కెట్ దయాదాక్షిన్యానికి వదిలేశారు. అంటే ఏమాత్రం ఈ విధానంపై ప్రభుత్వానికి కంట్రోల్ లేదన్నమాట. పెట్టుబడిదారుల లాభాలపై పరిమితులు లేవు, వారు ఎగ్గొడుతున్న పన్నులపై నియంత్రణ లేదు, రాజకీయ అవసరాల కోసం పరిపాలనలో జరుగుతున్న తప్పిదాలపై విచారణ లేదు. కానీ శ్రమకోర్చి, జీవిత కాలాన్ని వెచ్చించిన ఉద్యోగుల భవిష్యత్తుపై మాత్రం కక్ష సాధింపు పరిపాటిగా మారింది. పెన్షన్ ఫండ్‌ను, ప్రావిడెంట్ ఫండ్‌ను, ఇతర పొదుపులన్నింటినీ స్టాక్ మార్కెట్‌కి మళ్ళించి కావలసిన మేర స్పెక్యులేషన్ జరిపి మిగిలిన మొత్తాలను సదరు ప్రజల మొహాలపై జల్లే విషపూరిత విధానాన్ని తప్పుబట్టకుండా... సమాజ నిర్మాణానికి పునాదులేసిన వారిని సజీవంగా పూడ్చిపెట్టే ఆలోచనలకు పత్రికలు వంతపాడటం అవివేకం.



ప్రపంచంలోని అనేక దేశాలతో పోల్చితే వృద్ధాప్య పథకాల అమలులో భారత్ ఎంతో వెనకబడి ఉన్నది. చిన్న పిల్లలు, వృద్ధుల సంక్షేమం రాజ్యం కాక మరెవ్వరు చూస్తారు? కోవిడ్ మహమ్మారికి బలైన వారిలో అనేకులు వృద్ధులే ఉండటానికి కారణం వారికి సరైన ఆదాయ వనరు లేకపోవడమే!

గుత్త పెట్టుబడిదారులు ఒక చేతితో రాజకీయాన్ని, మరో చేతితో వార్తా మాధ్యమాలను పూర్తిగా నియంత్రిస్తున్నారు. అందు చేత పెట్టుబడిదారులకు ఉపయోగపడే రాజకీయ విధానాలను మాత్రమే ప్రజలకు చేరవేసేందుకు దాదాపు అన్ని మాధ్యమాలు పనిచేస్తున్నాయి. ఇలాంటి పోకడలను వ్యతిరేకించే వారు ఎవరైనా ఎన్‌డీటీవీ రూపంలో ఉంటే వాటిని మొత్తానికి మొత్తంగా బలవంతంగానైనా కొనేస్తారన్న వాస్తవం ఈ మధ్యనే బయటపడింది. కేవలం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నడుస్తున్న కొన్ని మాధ్యమాలు తప్ప, ఉద్యోగుల కార్మికుల కర్షకులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూ మాధ్యమాలే లేకుండా పోయాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రజలలో చీలిక తెచ్చి, ఉద్యోగులపై సామాన్యులను ఉసిగొలిపేలా ఉన్నది. అందుకే సామూహిక అంగీకారానికై(కామన్ కన్సెన్సస్) ప్రయత్నించాలని కూడా సదరు పత్రిక

> జీవిత కాలమంతా కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి విధేయత చూపిన ఉద్యోగుల పట్ల, వారి భవిష్యత్తు పట్ల ఇంతటి ఘోరమైన వైఖరిని ప్రదర్శిస్తూ పెన్షన్ను 'పాయిజన్'గా వ్యక్తికరించిన వారిది ఒక విషపూరిత భావజాలంగా భావించాల్సిందే. 2004 తర్వాత నియమితులై రిటైర్ అవుతున్న వారికి వందల్లో మాత్రమే నూతన పెన్షన్ అందుతున్న సంగతి సదరు పత్రికకు తెలియదని భావించలేం. కేంద్ర ప్రభుత్వం కూడా పూర్తి అవగాహనతో, ఉద్దేశపూర్వకంగానే పత్రికలను ఇలాంటి రాతలకై పురమాయిస్తున్నది.

సంపాదకీయం సూచించింది. అనగా మెజారిటీ అభిప్రాయాన్ని కూడగట్టాలని చెప్పకనే చెప్పింది. అయితే ఈ ప్రతిపాదన ఇంతటికే పరిమితవదు. భవిష్యత్తులో పర్మనెంట్ ఉపాధి కల్పనపై కూడా ఇలాంటి వాదనే వినిపిస్తుంది. అగ్నిపథ్ పేర అగ్ని వీరులను నాలుగేండ్ల కోసం సైన్యంలోకి నియమించింది కూడా పెన్షన్‌తో పాటు ప్రావిడెంట్ ఫండ్‌ను కూడా ఎగవేసేందుకే! యువరక్తాన్ని దేశ సరిహద్దుల్లో ముళ్ళ కంచెలవద్ద శత్రువుకు ఎదురు నిలివి, వారి భవిష్యత్తును మాత్రం గాలికొదిలేయడం తలదించుకునే అంశం. కానీ ఈ వాస్తవాలను సాధారణ ప్రజానీకం గమనించే స్థితిలో లేకుండా మతం అనే మత్తుమందు ద్వారా మత ఏకీకరణను ఒక ఆయుధంగా వాడుతున్నారు. సామాజిక సమస్యలపైకి ప్రజల దృష్టిని పోనివ్వకుండా తమ అధికార పీఠాన్ని సుస్థిరపరిచు కునేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు కూడా అధికార పార్టీ విషపూరిత మత కౌగిలిలో ఇరుక్కున్నారు. మనిషిని ఒక వస్తువుగా 'ఉపయోగించి వదిలేసే' (యూజ్ అండ్ త్రో) సంస్కృతి మరింత పెరిగిపోతున్నది. అందుచేతనే ప్రభుత్వా లందించే సంక్షేమ పథకాలపై కోర్టులతో సహా సామాన్యులు సైతం పెదవి విరుస్తుంటారు. ఇది పూర్తిగా అవగాహనా లోపం. వ్యవస్థ అభివృద్ధికి కారకులైన వారి సంక్షేమం సామాజిక బాధ్యత. అందుకే 'పెన్షన్ ఒక వాయిదా వేయబడిన వేతనం'గా అభివర్ణింపబడుతుంది.

సెల్: 9951300016

పండుగ పూట విషాదం

ఒకరు మృతి, కోమాలో మరొకరు

నవతెలంగాణ-తల్లాడ



పండుగ పూట మండలంలో మూడు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నూతనకల్ గ్రామానికి చెందిన పమ్మి మురళి(30) నూతనకల్ సెంటర్ నుండి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కల్లూరు వైపు నుండి ఖమ్మం వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో పమ్మి మురళి తీవ్రగాయాలపాలై మృతి చెందారు.

వెంకన్నపేట గ్రామానికి మేము బాలరాజు(26) పాయపూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్ళిపోయాడు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

గంగాదేవి పాడుకు చెందిన తాళ్లూరి వెంకటేశ్వరరావు(35) గంగదేవ్ పాడు నుండి చెన్నూరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మల్చూరు తండా వద్ద ఉన్న బంకులో పెట్రోల్ పెట్రోల్ పోయించుకునేందుకు ఎడమవైపు ద్విచక్ర వాహనంపై ఆగారు. అదే సమయంలో తల్లాడ వైపు నుండి కల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. బైక్ ఉన్న తాళ్లూరు వెంకటేశ్వరరావు కుడికాలు విరిగి గాయాలయ్యాయి. ఈ మేరకు తల్లాడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ నివాళి

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడకు చెందిన కందాల ప్రసాద్ గుండెపోటుతో మృతి చెందారు. ప్రసాద్ ఆర్టిస్టుగా అందరికి చిరపరిచితుడు. విషయం తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు, జి.వి.ఆర్, గుండ్ల వెంకటేశ్వర్లు తేళ్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-చింతకాని

అనారోగ్య కారణంగా సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న నేరడ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన చెక్కులను గ్రామ ఉప సర్పంచ్ దూసరి గోపాలరావు సోమవారం అందజేసారు. గ్రామానికి చెందిన సిలువేరు లక్ష్మీకి రూ.30000లు, మట్టా మమతకి రూ. 22000 వేల చెక్కులు సీనియర్ జర్నలిస్ట్ దూసరి నేతాజీతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి షేక్ దస్తగిరి, సిపిఐ మండల నాయకులు గోగుల ఆదినారాయణ, సిపిఐ గ్రామ శాఖ సహాయ కార్యదర్శులు మట్టా రవి, కటిరాల మహేష్, మట్టా నరేష్, బండి విజయకుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కట్టకూరులో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో కట్టకూరు గ్రామంలో జిల్లా విష్ణువర్ధన్(20) జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపాన ఉన్న గుట్టల మధ్య ట్రిప్ పైపుతో చెట్టుకు ఉరివేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తండ్రి జిల్లా లచ్చయ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట నాగరాజు తెలిపారు.

పత్తి, వరి ధాన్యం దగ్ధం

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో ముత్తారంలో తాళ్ల నారాయణ ఇంట్లో గత కొద్ది కాలంగా అద్దెకు ఉంటున్న కన్నెబోయిన సుగుణకు చెందిన పది క్వింటాల పత్తి, ఐదు బస్తాల వరి ధాన్యంతో పాటు, ఇంట్లో ఉన్న వస్తువులు ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. జరిగిన అగ్ని ప్రమాదంపై బాధితురాలతో పాటు, గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అగ్ని ప్రమాద ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

వితంతువును వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ఓ వితంతువును వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకటగిరి గ్రామానికి చెందిన అనూష భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన సైదులు కొంత కాలంగా ఆమెను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయమై ఈనెల 10వ తేదీన అనూష తల్లి సైదులుని మందలించింది. దీన్ని మనస్సులో పెట్టుకొని ఈనెల 15వ తేదీ (ఆదివారం) అనూష, ఆమె తల్లితో సైదులు ఘర్షణపడి వారిపై దాడిచేశాడు. ఈ సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట కృష్ణ తెలిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని ఏదులాపురంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డిఏదులాపురం పంచాయతీ పరిధిలోని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్ణకుమార్, చిన్న వెంకటరెడ్డి, భాస్కర్, పెద్ద వెంకటరెడ్డి, మామిడి సుదర్శన్ రెడ్డి, సురేందర్, రమేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అశ్వితకు సీపీఐ(ఎం) ఆర్థిక సాయం

నవతెలంగాణ-ముదిగొండ

హైదరాబాద్ భాస్కర్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సంపాదించిన మండల పరిధిలో అమ్మపేట గ్రామానికి చెందిన సిపిఐ (ఎం) పార్టీ నాయకులు, అమరజీవి ఊటుకూరు సైదులు కూతురు పేదవిద్యార్థిని ఊటుకూరి అశ్వితకు సిపిఐ (ఎం) ముదిగొండ గ్రామశాఖ రూ.10 వేలు వితరణ చేయగా, మచ్చా వీరయ్య భవనంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు నగదును సోమవారం అశ్వితకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబిబిఎస్ చదువు పూర్తి చేసి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని అశ్వితకు సూచించారు. సిపిఐ(ఎం) పార్టీ కుటుంబానికి అండగా ఉంటదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మండల నాయకులు వేల్పుల భద్రయ్య, చెన్ను అంజయ్య, అమ్మపేట గ్రామశాఖ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వరరావు, నాయకులు ఊటుకూరు గోపయ్య, నంబూరు వెంకటేశ్వరరావు, రేణుక పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేసిన గుమ్మడి నరసయ్య

తిరుమలాయపాలెం: సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 13, 14, 15 తేదీలలో పిండిప్రోలు గ్రామంలో విద్యార్థులకు, యువకులకు మహిళలకు కబడ్డీ, క్రికెట్, కుర్చీలాట, ముగ్గుల పోటీలను పీడీఎస్‌యూ, పివైఎల్, పిడబ్ల్యు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్టీ సీనియర్ నాయకులు రాయల నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి కమ్మ కోమటి నాగేశ్వరరావు, పిఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి, జిల్లా కార్యదర్శి టీ ఝాన్సీ లక్ష్మి, పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఆజాద్, పివైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్వి రాకేష్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే రైతు సంఘం లక్ష్యం

నవతెలంగాణ-కూసుమంచి

రైతులను సంఘటితం చేసి రైతుల హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక సంఘం, రైతుల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రైతు సంఘం పని చేస్తుందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో రైతు సంఘం 2023 క్యాలండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కార్పొరేట్ శక్తులు వ్యవసాయాన్ని ధ్వంసం చేస్తూ రైతు జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో రైతుల ఐక్యం చేసి రైతు హక్కుల కోసం ప్రభుత్వాలను మేడలు వంచి రైతుల హక్కుల కోసం, రైతులను ఐక్యం చేస్తున్న ఏకైక సంఘం, రైతుల సంక్షేమ లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, గుడవర్తి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మదినేని రమేష్, మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగదార్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, సీనియర్ నాయకులు శీలం గురుమూర్తి, వ్యకాస మండల అధ్యక్ష కార్యదర్శులు ముడు గన్య నాయక్, చిట్టూరి వెంకన్న, నేలకొండపల్లి మండల రైతు సంఘం కార్యదర్శి ఇంటూరి అశోక్, మండల కమిటీ సభ్యులు మల్లెల సన్మంతా రావు పాల్గొన్నారు.

ఖమ్మంలో పనికి మాలిన బ్యాచ్..!

- ఖమ్మం నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మంత్రి పువ్వాడ

ఖమ్మం రూపురేఖలుమారిపోతాయి : హరీష్‌రావు

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మంలో పనికి మాలిన బ్యాచ్ తనపై దుష్ప్రచారం చేస్తోందని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మండిపడ్డారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి అజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో ఈ నెల 18న జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభ ఖమ్మం నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తాను కూకట్‌పల్లి నుంచి పోటీ చేయడం లేదని, ఖమ్మంలోనే ఉంటానని స్పష్టం చేశారు. ఖమ్మంలో కొద్ది మంది పనికిమాలిన బ్యాచ్ ఉందన్నారు. వాళ్లకు అబద్ధాలు చెప్పడం తప్పా ఏమీ తెలియదని మండిపడ్డారు. బీజేపీ వాళ్లకు ఒక అబద్దాల గ్రూప్ ఉందని, అజయ్ అన్న కూకట్‌పల్లి పోతుండు అని కొత్త ప్రచారం మొదలు పెట్టారన్నారని విమర్శించారు. 'అజయ్ అన్న కూకట్ పల్లి ఏం పీకడానికి పోతాడు. ఇక్కడి వాళ్లని పీకటానికి అజయ్ అన్న ఉన్నాడు.. ఇంకా దంచాల్సిన వాళ్లని దంచాకనే అజయ్ అన్న ఎటైనా పోతాడు.. అజయ్ అన్న సైన్యం చూసి ఎంత భయపడుతున్నారంటే.. అజయ్ అన్నను లోకల్ నుంచి పంపించి ప్రశాంతంగా ఉండాలని చేస్తున్నారు. పార్టీ ఐక్యంగా ఉంటే చూడలేకపోతున్నారని' అన్నారు. అజయ్ అన్న ఖమ్మంను అభివృద్ధి చేసిండని, పాత బస్టాండ్ తీసి కొత్త బస్టాండ్ పెట్టిండు.. మళ్ళీ పాత బస్ స్టాండ్‌ను సిటీ బస్ స్టాండ్‌గా మార్చిండు అని ఈర్ష పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభ అవకాశాన్ని 33 జిల్లాల్లో మన ఖమ్మానికి కేసీఆర్ ఇచ్చారని, ఖమ్మం మీదుగానీ ఖమ్మం ప్రజల మీద గానీ కేసీఆర్‌కి ఎంత అభిమానం ఉందో ఒకసారి మీరే ఆలోచించాలన్నారు. ఇలాంటి బంగారు అవకాశాన్ని మనం అందిపుచ్చుకోవాలని చెప్పారు. మీరు వాట్సాప్ గ్రూప్‌లు, ఫేస్‌బుక్, ట్విట్టర్లలో కూడా యాక్టివ్ ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మం సభను విజయవంతం చేయాలన్నారు.

రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ ఖమ్మం నగరం మిగిలిన నగరాలకు ఆదర్శంగా నిలిచిందని, ఖమ్మంను చూసి ఇతరులు నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అభివృద్ధికి తగినట్లుగా 18న జరిగే బహిరంగ సభ జన సమీకరణ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఖమ్మం రూపు రేఖలు మారిపోయాయని ,8 సంవత్సరాల కాలంలో 12 నుంచి 13 కోట్ల రూపాయలతో అద్భుత నగరంగా రూపుదిద్దుకుందన్నారు. లకారం ట్యాంక్ బండ్, కేబుల్ బ్రిడ్జ్, ఐటీ టవర్న చూసి మేము మా నియోజక వర్గంలో ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఎటు చూసినా 10 కిలో మీటర్ల మీద సెంట్రల్ లైటింగ్, నాలుగు లైన్ల రోడ్డు, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, కొత్త బస్టాండ్, సైడ్ డ్రైన్స్, నూతన కార్పొరేషన్ భవనంతో పాటు గోళ్లపాడు చానల్ అభివృద్ధి, మంచినీటి సమస్యలు పరిష్కారం చేసుకున్నారని, త్వరలోనే సీతారామ ద్వారా 10 లక్షల ఎకరాలు సస్యశ్యామలం కానుందని తెలిపారు. రెండు జీవనదుల నీటిని వాడుకునే అవకాశం అటు పాలేరుకు ఖమ్మంకు దక్కిందన్నారు.

కేసిఆర్ దూరదృష్టితో ప్రజలకు వైద్య సౌకర్యాలు మరింత అందుబాటులోకి తేచేందుకు 33 జిల్లాలో వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణను దేశం అనుసరిస్తున్నదని తెలంగాణలో రైతుబంధు పేరితే సిఎం కిసాన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మనం మిషన్ కాకతీయ ఏర్పాటు చేస్తే అమత్ సరోసర్ పేరుతో, మిషన్ భగిరథ్ ద్వారా రాష్ట్రంలో ఇంటింటికి తాగునీరు అందిస్తుంటే ఫుడ్ ఫర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఖమ్మం జిల్లా ప్రజలు ఈ దఫా చరిత్రను తిరగరాసి 10కి 10 స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపిలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, నాయకులు పల్లా రాజేశ్వరరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజా, సుడా చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్లు, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొంటారా? ఆత్మహత్య చేసుకోమంటారా?

- కెసిఆర్‌కు ఓ రైతు బహిరంగ లేఖ
- స్పందించిన డిసిసిబి, మోటమర్రి సహకార సంఘం

నవతెలంగాణ - బోనకల్



ధాన్యం కొనుగోలు చేస్తారా? ఆత్మహత్య చేసుకోమంటారా అని ఓ రైతు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశాడు. అనంతరం పురుగుమందు డబ్బాతో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఆత్మహత్యాయత్నానికి దిగిన సంఘటన మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామంలో సోమవారం జరిగింది. బాధిత రైతు షేక్ ఫకీర్ సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరిని సాగు చేశాడు. ఆ పొలంలో సాంబ మసూరి సాగు చేశాడు. పంట ఇంటికి వచ్చి నెల రోజులు గడుస్తుంది. అప్పుచేసి పెట్టుబడి తో వ్యవసాయం చేశాడు. పంట ఇంటికి రావడంతో ఇచ్చిన అప్పు కోసం ప్రతి రోజు తన ఇంటి చుట్టూ రుణ దాతలు తిరుగుతున్నారని తెలిపారు. తన ధాన్యం విషయంపై మార్కెటింగ్ శాఖ అధికారులకు సైతం సమాచారం ఇచ్చాడు. కానీ నెల రోజులు అవుతున్న తన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయడం లేదని తెలిపాడు. దీంతో మరో మార్గం లేక పురుగుమందు డబ్బా పట్టుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఆత్మహత్యకు దిగాడు. ఈ విషయం తెలిసి ఆ గ్రామ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు మరికొందరు రైతులు కార్యాలయం వద్దకు వెళ్లి రైతు ఆత్మహత్య చేసుకోకుండా నచ్చచెప్పేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. సర్పంచ్ సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. తన ధాన్యాన్ని వెంటనే అధికారులు కొనుగోలు చేయకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని దీనికి ప్రభుత్వం, అధికారులే కారణం అని స్పష్టం చేశాడు. అధికారులు తన ధాన్యాన్ని కొనుగోలు చేసి తాను అప్పుల పాలు కాకుండా, ఆత్మహత్య చేసుకోకుండా కాపాడుతారో తన శవాన్ని సంక్రాంతి పండుగకు బహుమతిగా అందుకుంటారో అధికారులే తేల్చుకోవాలని స్పష్టం చేశాడు. ముఖ్యమంత్రికి రాసిన బహిరంగ లేఖను స్థానిక మీడియా ప్రతినిధులకు అందజేశారు. తాను నెలరోజులుగా నరకం అనుభవిస్తున్నానని మరో మార్గం లేకనే ఆత్మహత్యకు దిగుతున్నానని స్పష్టం చేయటంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మోటమర్రి సహకార సంఘం వెంటనే స్పందించింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆడిటర్ పులికంటి జగదీష్, మోటమర్రి సహకార సంఘ సీఈవో గుడిద కృష్ణారావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతుతో చర్చలు జరిపారు. ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమింప చేశారు. ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. తాను ఆత్మహత్య చేసుకోకుండా స్పందించిన, కొనుగోలుకు సహకరించిన ప్రతి ఒక్కరికి రైతు పకీరు సాహెబ్ కృతజ్ఞతలు తెలిపారు.

యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కూసుమంచి

జిల్లా కేంద్రంలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ లేకపోవడం వలన డిగ్రీ చదువుకున్నటువంటి పేద మధ్యతరగతి విద్యార్థులపై చదువుకునే దాని కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, మండల నాయకులు సతీష్, లోకేష్, తరుణ్ పాల్గొన్నారు.

యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వల్లంకొండ రాంబాబు

నవతెలంగాణ-బోనకల్



తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మండల పరిధిలోనే పోరాటాల పురిటిగడ్డ, వీరా తెలంగాణ రైతాంగ సాయిధ పోరాటాల గడ్డ గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన వల్లంకొండ రాంబాబు ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభల్లో ఖమ్మం జిల్లా టీఎస్ యుటిఎఫ్ కోశాధికారిగా ఉన్న రాంబాబు రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. బోనకల్ మండలంలోని పెద్ద బీరవల్లి ప్రాథమిక పాఠశాలలో వల్లం కొండ రాంబాబు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రాంబాబు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. రాంబాబు కుటుంబం మొదటి నుంచి సిపిఎం పార్టీలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్నారు. ఆయన ఎన్నికైన సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతి ప్రీతం, గుగులోతు రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు సదాబాబు, సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, ఎంపిపి కంకణాల సౌభాగ్యం, లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత మండల కమిటీ సభ్యులు ఎంసీఆర్ చంద్ర ప్రసాద్, ఆలస్యం పుల్లారావు, పసుపులేటి నరసింహారావు తదితర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వ్యవసాయాన్ని కాపాడుకోవాలి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



రైతు చేతిలో ఉన్న వ్యవసాయాన్ని కాపాడుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సంక్రాంతి సందర్భంగా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు అభినందన సభ నిర్వహించారు. పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టిన పాలడుగు గ్రామం వనమా చిన్న సత్యనారాయణ, వైరా నారికొండ అమరేందర్, లాలాపురం గ్రామం ఎస్.డి పాషాలను తెలంగాణ రైతు సంఘం, బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో డాక్టర్ చీకటి భారవి, జట్లా రంగారావు, పిల్లలమర్రి సుబ్బారావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాల వలన వ్యవసాయ రంగంలో సంక్షోభంలో ఉందని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని వాగ్దానం చేసి రైతులకు ఉన్న అప్పు రెట్టింపు చేశారని, వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన శ్రీలంక, పాకిస్తాన్ దేశాలలో ఆహారం అందుబాటులో లేక ప్రజల చనిపోయే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. రైతు వ్యవసాయం కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, మాజీ ఎంపిపి బొంతు సమత, సిఐటియు జిల్లా నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, గోపవరం సోసైటి డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, నర్వనేని శ్రీనివాసరావు, మాదినేని రజినీ తదితరులు పాల్గొన్నారు.

వందే భారత్ రైలుకు ఘనంగా స్వాగతం పలికిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-మధిర

మధిర చేరుకున్న వందేభారత్ రైతులకు బీజేపీ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి. బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్, ఏలూరి నాగేశ్వరావు, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి, పెరుమాళ్ళ పల్లి విజయరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి, చిలువేరు సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి, రామేశెట్టి నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థులకు సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ప్రోత్సాహకాలు

నవతెలంగాణ -కూసుమంచి

మండల పరిధిలోని ఐఐటి ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ప్రోత్సాహకాలు అందించింది. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలేరుకు చెందిన పెరుగు మోహన్ కు ,ఈశ్వరమాధారంకు చెందిన నందిగామ లక్ష్మీ నారాయణకు ఒక్కొక్కరికి 5,000/-చొప్పున చెక్కులను తహశీల్దార్ కె.వియంఎ మీనన్, ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య అందించారు. ఈ కార్యక్రమంలో యంపీఓ రామచంద్రరావు, మట్టపల్లి నరసింహారావు, కోట్యా పాల్గొన్నారు.

శివుని ఎదుట రంగవల్లులు

విజేతలకు బహుమతులు అందజేసిన ఎంపీపీ శ్రీనివాసరావు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం శివుని విగ్రహం వద్ద సర్పంచ్ ఎంపీటీసీ దంపతులు శీలం కోటిరెడ్డి శివపార్వతుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, వెంకట్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

మర్లపాడులో ముగ్గుల పోటీలు



మధిర : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ సిద్ధినేనిగూడెం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు సర్పంచ్ వేమిరెడ్డి పెద్ద నాగిరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట చిన్న అంజమ్మ, పీఏసీఎస్ ఛైర్మన్ కటికల సీతారామిరెడ్డి, వార్డు సభ్యులు తల్లపురెడ్డి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కేసీఆర్‌కు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు బహిరంగ లేఖ

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్రంలోని ప్రింట్ మరియు డిజిటల్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులలో 99 శాతం మంది దిగువ, మధ్య తరగతి, పేద కుటుంబాలకు చెందినవారే. వారికి వచ్చే ఆదాయంతో కుటుంబాలు గడవని దుస్థితి ఉన్నది. వృత్తి మీద గౌరవం, గుర్తింపు కోసం బతుకులీడుస్తున్నారు. కాని బతకలేకపోతున్నారు. ఇది గమనించే మీరు వారి కోరికలను పరిష్కరిస్తామని హామీ యిచ్చారు. చాలా సంవత్సరాలు అయినా అమలు కాలేదు. గతంలో ఖమ్మం జిల్లా జర్నలిస్టులకు ఖమ్మంలోనే యిచ్చిన హామీ కోసం కళ్ళల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు. మీరు బిఆర్ఎస్. ఆవిర్భావ సభ మా ఖమ్మంలోనే ఏర్పాటు చేయటాన్ని ఖమ్మం జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. బిఆర్ఎస్ ఆవిర్భావ సభ జర్నలిస్టుల సమస్యలకు పరిష్కార వేదిక అవుతుందని, వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతుందని ఆశిస్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు.

డిమాండ్లు

1) జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ళు యివ్వాలి.

2) వర్కింగ్ జర్నలిస్టులందరికి హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు యివ్వాలి.

3) దళిత జర్నలిస్టులకు దళితబంధు యివ్వటంతోపాటు వర్కింగ్ జర్నలిస్టులందరికి జర్నలిస్టు బంధు యివ్వాలి.

4) జర్నలిస్టులకు రాయితీతో కూడిన రైల్వే పాస్‌ను పునరుద్ధరించాలి.

5) కేరళ, తమిళనాడు, కర్నాటక మాదిరిగా రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

6) మహిళా జర్నలిస్టులకు రక్షణ, రవాణా సౌకర్యాలు కల్పించాలి.

7) జి.ఓ. నెం.239 సవరించి, ఆర్.ఎన్.ఐ.తో నడుస్తున్న చిన్న పత్రికలను ఎం. ప్యానెల్‌లో చేర్చాలి.

8) చిన్న పత్రికలకు ప్రోత్సాహకాలతోపాటు, అక్రిడిటేషన్ కార్డులు యివ్వాలి.

9) డిజిటల్ మీడియా సమస్యలన్నింటినీ పరిష్కరించాలి.

10) జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి, రక్షణ చట్టం చేయాలి.

11) డెస్క్ జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. అవసరమైనప్పుడు విధుల్లోకి తీసుకొని, ఆపై తీసివేస్తే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

12) డెస్క్ జర్నలిస్టులకు 6 1/2 గం.ల పని విధానం కొనసాగించాలి.

13) యాడ్స్, సర్క్యులేషన్ టార్గెట్ పేరుతో విలేఖరులపై వేధింపు చర్యలను అరికట్టాలి.

గ్రామసమస్యలపై సర్పంచ్‌కు వినతి

నవతెలంగాణ-కారేపల్లి

మండలంలోని వెంకిట్యాతండా గ్రామ సమస్యలపై గ్రామ ఉద్యోగుల సంక్షేమ సంఘం సోమవారం గ్రామ సర్పంచ్ బానోత్ బాలీకి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని పాఠశాలలో విద్యాయేతర కార్యక్రమాలను జరగనీయవద్దని, రహదారులపై పశువులను కట్టివేయటంతో పారిశుధ్య లోపం, ప్రమాదాలకు కారణమవుతుందని వినతిలో పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోనీ వీధీ లైట్ల నిర్వాహణ, పచ్చదనం పరిశుభ్రతపై దృష్టి పెట్టి రోజు వారిగా పనులు చేయించాలని కోరారు. వృద్ధాప్య పింఛన్లు వస్తూ మధ్యలో ఆగిపోయిన, రాని వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవెళ్ళి పరిష్కరించాలని వినతిలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెంకిట్యాతండా ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గుగులోత్ శంకర్, కోశాధికారి గుగులోత్ శ్రీనివాస్‌లు తదితరులు ఉన్నారు.



ప్రజలందరూ లక్షలాదిగా తరలిరండి

ఎమ్మెల్యేలు సండ్ర, పెద్ది సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-కల్లూరు

ఈ నెల 18న ఖమ్మంలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ మొదటి బహిరంగ సభ జన సమీకరణ ఏర్పాట్లపై సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, ఇంచార్జీ నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో నాయకులతో సమావేశమై సమీక్షించారు. సోమవారం రాత్రి జన సమీకరణలపై ముఖ్య నాయకులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశ చరిత్రలో నిలిచే బిఆర్ఎస్ ఆవిర్భావ మొదటి సభ ఖమ్మం లో ఏర్పాటు చేయడం మనందరకూ గర్వ కారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవల్లి రఘు, జడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, రైతు సమన్వయ సమితి కమిటీ సభ్యులు డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి. చంద్రరావు, ఏఎంసి వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, డిసిసిబి డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండి. ఇస్మాయిల్, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పెడకంటి రామకృష్ణ, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొరకొప్పు ప్రసాద్, సీనియర్ నాయకులు మేకల కృష్ణ, సర్పంచ్ నందిగాం ప్రసాద్, పెద్దబోయిన నారాయణ రావు, కిరణ్ పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో వినూత్నంగా సంక్రాంతి ముగ్గులు

నవతెలంగాణ-వైరాటౌన్.



ఐద్వా వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినూత్నంగా సంక్రాంతి ముగ్గులు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సిపిఐ(ఎం) పార్టీ సింబల్ తో సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి గుడిమెట్ల రజిత వేసిన సంక్రాంతి ముగ్గు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నది.



వ్యవసాయ కార్మిక సమస్యలపై ఐక్య ఉద్యమాలు

వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో

ఆ సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ముదిగొండ

వ్యవసాయ కార్మిక సంఘ సమస్యలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో ఆ సంఘం మండల సమావేశం మండల నాయకులు నెమలి సైదులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై పల్లె పల్లెలో ప్రచారం చేస్తూ కార్మికులను సంఘటితం చేయాలన్నారు. ఉపాధి కూలీలకు ఈజీఎస్ పనులలో కోత విధించి ఉపాధి లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వత్సవాయి జానకిరాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య, నాయకులు మందరపు వెంకన్న, పుచ్చకాయల లక్ష్మయ్య, చెన్ను నాగరాజు, మేడా నారాయణ, కటారి హుస్సేన్, కత్రం గురవయ్య, బట్టు రాజు, యలమద్ది శ్రీనివాసరావు యర్రదేశి భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

వైరా బోడేపుడి కళానిలయం వైద్య శిబిరం విజయవంతం

91 నెలలుగా వైద్య శిబిరం నిర్వహణ

నవతెలంగాణ-వైరా టౌన్



వైరా బోడేపుడి కళా నిలయం ఆధ్వర్యంలో ప్రతి నెల మూడవ ఆదివారం స్థానిక సీపీఐ(ఎం) కార్యా లయం బోడేపుడి వేంకటేశ్వరరావు భవనం నందు నిర్వహించే వైద్య శిబిరాన్ని 91వ నెల విజయ వంతంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. స్మార్ట్ మాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ వైద్య బృందం ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబిరం బాధ్యులు బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, మాదినేని రజిని, మల్లెంపాటి ప్రసాదరావు, అనుమోలు రామారావు, కంభంపాటి సత్యనారాయణ, శీలం నారాయణరెడ్డి, యనమద్ది రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
ఖమ్మం
6
మంగళవారం 17 జనవరి 2023

నవతెలంగాణ డైరీని ఆవిష్కరించిన ఎంపీ వద్దిరాజు

నవతెలంగాణ-ఖమ్మం

నవతెలంగాణ దినపత్రిక డైరీని సోమవారం ఖమ్మం పట్టణంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవతెలంగాణ సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ రీజినల్ మేనేజర్ జావీద్, సిబ్బంది వీరారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.



సంక్రాంతి సందడి

- ఇంటి ముంగింట్ల రంగు వల్లులు
- గ్రామాల్లో క్రీడా పోటీలు
- ఆడిపాడిన యువత



తల్లాడ



మధిర

నవతెలంగాణ-కారేపల్లి

సంక్రాంతి సందర్భంగా పల్లెలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. పండుగతో పట్టణాల నుంచి పల్లెకు వచ్చి పండుగను సంతోషాలతో సందడిగా జరిపారు. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశాయి. బోగి మంటలు వేసి వాటి చుట్టు ఆడుతూ పాడుతూ యువతి కేరింతలు కొట్టారు. పండుగ రోజు ప్రతి ఇంటి ముంగింట సంక్రాంతి రంగువల్లులు వాటి మధ్యలో గొబ్బెమ్మలు తీరొక్క పూలు, కూరగాయాలు, రేగుపండ్లు వేసి అలంకరించారు. ముగ్గుల అలంకరణకు పోటీలు పడ్డారు.

విశ్వనాధపల్లిలో సందడి చేసిన పొంగల్ గ్రూపు

విశ్వనాధపల్లిలో పొంగల్ ప్యామిలీ వాట్సప్ గ్రూపు సభ్యులు సందడి చేశారు. ప్రతి ఏడాది పొంగల్ ప్యామిలీ గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలను జరుపుతారు. 30 కుటుంబాలకు చెందిన 100 మంది వరకు పెద్దలు పిల్లలు అంత ఒక్కదగ్గరు సంబురాలను జరుతుంటారు. వివిధ రకాల సాంప్రదాయ క్రీడలు, నృత్యాలు,పాటలతో మూడు రోజుల పాటు సందండి చేశారు. అందరు కలిసి వినోద కార్యక్రమాలలో పాల్గొని గ్రామస్తులను అనందంలో ముంచేత్తారు. విశ్వనాధపల్లిలో కబడ్డీ పోటీలకు స్పాన్సర్ చేశారు.

క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

బోనకల్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, సర్పంచ్ నోముల వెంకట నరసమ్మ, మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్, సిపిఎం మధిర పట్టణ మాజీ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాలలో సిపిఎం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యం కలిగిన అనేక మంది క్రీడాకారులు ఉన్నారని, కానీ అటువంటి వారికి సరైన ప్రోత్సాహం లేక రాణించలేకపోతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులకు ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో



బోనకల్

సహాయ సహకారాలు అందిస్తూ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాపినేని రమేష్, పాపినేని అప్పారావు, పాపినేని వెంకటరావు, నోముల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో ముగ్గుల పోటీలు

ముదిగొండ : మండల పరిధిలో వెంకటాపురం గ్రామంలో రాయల కమలమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విజేతలతో పాటు, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) మండల నాయకులు కందుల భాస్కరరావు, ఐద్వా మండల అధ్యక్షులు మందరపు పద్మ, సిపిఐ (ఎం) గ్రామ శాఖ కార్యదర్శి కటారి హుస్సేన్, నాయకులు మందరపు వెంకన్న పాల్గొన్నారు.

యువతను క్రీడా రంగంలో ప్రోత్సహించడంలో విఫలం : డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్

మధిర : యువతను క్రీడా రంగంలో ప్రోత్సహించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ అన్నారు. దెందుకూరు గ్రామ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కామ్రేడ్ వూట్ల వెంకటయ్య స్మారకంగా సంక్రాంతి పండుగ సందర్భంగా ఆట, పాట, ముగ్గుల, పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మద్దాల ప్రభాకర్ ప్రారంభించారు. ఐద్వా సంఘం టౌన్ అధ్యక్షులు సేక్ ఫాతిమా బేగం, హేమలత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి తెలప్రోలు రాధాకృష్ణ, నాయకులు వూట్ల శంకర్ రావు, అల్లూరి నాగేశ్వరావు, పల్లికంటి విల్సన్ డీవైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు కేసరి వీరభద్రం, వాడపల్లి మురళి, బండి నరేష్, శివకేశవ్, రాజేష్, నాజీర్ గోపి, గుర్రం సాయి పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు

కారేపల్లి : మాజీ దివంగత ముఖ్యమంత్రి తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని



కారేపల్లి

కారేపల్లిలో సోమవాం టీడీపీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలను మాజీ సర్పంచ్ మండెపూటి రాణి ప్రారంభించారు. ఈపోటీల్లో మహిళలు ఉత్సహంగా పాల్గొని తమ సృజనాత్మకను చాటుకున్నారు. విజేతలకు ఈనెల 18వ తేదిన నిర్వహించే ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు మండెపూడి శ్రీనివాసరావు, ఎండీ.యాకూబ్, కసంచి రమేష్, దుగ్గెంపూడి కొండలరావు, పోలూరి రామారావు, చిన్ని శ్రీనివాసరావు, బొగ్గారపు ముఖర్జీ యలగందుల మధు, కాసాని లక్ష్మినారాయణ. దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పాటి అబ్బయ్య, చిలుముల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉసిరికాయలపల్లి ముగ్గుల పోటీలు

ఉసిరికాయలపల్లిలో పర్సా ట్రస్ట్, మధర్ థెరిస్సా యూత్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో మహిళలు ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలకు డాక్టర్ పర్సా పట్టాభి రామారావు- డాక్టర్ విజయలక్ష్మి దంపతులు బహుమతులు అందజేశారు.

పాతకారాయగుడెంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-పెనుబల్లి

పాత కారాయిగూడెం యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాతకారాయిగూడెం గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ, మండల ఉపసర్పంచ్ నరుకుళ కస్తూరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-పెనుబల్లి

క్రికెట్ క్రీడాకారులకు నగదు, మెమెంటోలు సోమవారం విజేతలకు అందజేశారు. సంక్రాంతి సందర్భంగా పెనుబల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా క్రికెట్ క్రీడా పోటీలు మండల కేంద్రంలో నిర్వహించారు. ముగింపు సందర్భంగా విజేతలకు సీఐ హనోక్, ఎస్సై సూరజ్ చేతుల మీదుగా నగదు, మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా క్రికెట్ క్రీడా పోటీలను నిర్వహించిన నిర్వాహకులును సిఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో పొట్లపల్లి వెంకటేశ్వరరావు, మల్లెల రాజా తదితరులు పాల్గొన్నారు.

చొప్పకట్లపాలెంలో విజయవంతంగా ముగిసిన సంక్రాంతి క్రీడలు

బోనకల్ : మండల పరిధిలోని చొప్పకట్లపాలెంలో సంక్రాంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా కమిటీల ఆధ్వర్యంలో 13,14, 15 తేదీలలో క్రీడా, సాంస్కృతిక, వైజ్ఞానిక పోటీలను నిర్వహించారు. ఎస్.ఎఫ్.ఐ జెండాను పరిటాల వినయ్, డివైఎఫ్ఐ జెండాను దారెల్లి ఆంజనేయులు ఆవిష్కరించారు. స్టార్ గుర్తును షేక్ హస్సాన్ సాహెబ్, చిరంజీవి పుసులూరి అశ్లేషలు అందంగా తీర్చిదిద్దారు. కబడ్డీ, వాలీబాల్, క్విజ్, ముగ్గులు, పాటలు, బస్తాల పరుగు, స్కిప్పింగ్ వంటి క్రీడలలో క్రీడాకారులు ఔత్సాహికంగా పాల్గొన్నారు. పండుగకు గ్రామానికి చేరుకున్న బంధువులు సైతం క్రీడలను ఆసక్తిగా తిలకించారు. ఆదివారం రాత్రి క్రీడలలో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామంలో వ్యవసాయ, అనుబంధ రంగాలలో ప్రతిభ కనబరుస్తున్న రైతులు షేక్ మదార్ సాహెబ్, కోటపర్తి ఎలిశమ్మ, బాలు శైలజలను సన్మానించారు. పేదరికాన్ని జయించి కష్టపడి చదివి ఉద్యోగం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలచిన వేశాల నాగరాజును, ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యశిస్తూ ప్రతిభ కనబరుస్తున్న షేక్ సలీమ్ ను కూడా ఘనంగా సన్మానించారు. విజేతలకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు, మాజీ సర్పంచి బూసి వెంకటేశ్వర్లు, ఐద్వా నాయకురాలు బోయనపల్లి వాణిలతో పాటు బహుమతి దాతలు బహుమతులు అందజేశారు. డీవైఎఫ్ఐ గ్రామశాఖ అధ్యక్షులు షేక్ హస్సాన్ సాహెబ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి దారెల్లి ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు నల్లమోతు సాయికుమార్, బండి శ్రీనివాసరావు, కొండేటి అప్పారావు, రచ్చ మధు సూదన్ రావు, చలమల అజయ్ కుమార్, బోయనపల్లి పున్నయ్య, ఉన్నం వెంకటేశ్వర్లు, పరిటాల కొండలరావు, రచ్చ శివకుమార్, కొండేటి ప్రవీణ్, మెట్టెల వీరబాబు, దరిశ రాము, బండి సతీష్, దారెల్లి శ్రీను, నోముల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

దాసరి..@ 4జీ

- 4తరాల దాసరి వంశవృక్ష సమ్మేళనం
- వివిధ ప్రాంతాల నుంచి 600 మందితో
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ డాక్టర్ బండి
- అందరిని ఒకచోటికి రప్పించిన వైస్ ఎంపీపీ చిట్టినాయన
- సంక్రాంతి పండుగ రోజున ఒక్కటైన వంశవృక్ష సభ్యులు

నవతెలంగాణ- సత్తుపల్లి

ఒకే వంశవృక్షానికి సంబంధించిన కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరితే అదో మరపురాని అనుభూతి, తాతయ్య, నానమ్మ, పెద్దనాన్న, పెద్దమ్మ, చిన్నాన, పిన్ని, అన్నయ్య, తమ్ముడూ అంటూ నాలుగు తరాలకు (4జీ) సంబంధించిన ఆ కుటుంబ సభ్యులంతా ఒకరినొకరు కలుసుకొని సరదాగా గడిపితే ఆ ఆనందమే వేరు. మనం ఎంత సంపాదించామన్నది ప్రధానం కాదు, కుటుంబ సభ్యులందరితో ఒకరోజైనా ఆనందంగా గడిపితే ఆ అనుభూతిని జీవితంలో మర్చిపోలేం. వయసులో చిన్నవాడయినా ఒక మంచి ఆలోచన రావడమే తరువాయి అన్నట్లుగా అందరిని ఒకేచోట రప్పించేందుకు సత్తుపల్లి వైస్ ఎంపీపీ దాసరి వెంకట్రామిరెడ్డి, అతని కుమారుడు మధు మోహన రెడ్డి నమాయత్తమయ్యారు. అందరూ కలుసుకొనే వేదికను ఖరారు చేశారు. సంక్రాంతి పండుగ రోజున దాసరి వంశవృక్ష కుటుంబ సభ్యులంతా సుమారు 600 మందికి పైగా మండలంలోని సత్యనారాయణపురం రోడ్డులోని దాసరి వారి పామాయిల్ తోటలో ఆదివారం సమ్మేళనమయ్యారు. కార్యక్రమంలో హెటిరో అధినేత, ఎంపీ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బండిని పిలవడానికి కారణముంది. బండి మాతృమూర్తి దాసరి వారి ఆడబిడ్డ కావడంతో బండి సైతం ఈ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆటాపాటలతో రోజంతా సరదాగా...

దాసరి కుటుంబ సభ్యులు ఈ సమ్మేళన కార్యక్రమంలో ఆనందంగా గడిపారు. చిన్నారులు, యువకులు, యువతులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించిన అందరిని ఒకేచోటకు చేర్చిన తండ్రీకొడుకులు వెకట్రామిరెడ్డిని, అతని కుమారుడు మధుమోహనరెడ్డిని ఎంపీ బండితో పాటు పలువురు కుటుంబ సభ్యులు అభినందించారు. ఇన్ని యేండ్ల కాలంలో తామంతా అందరం కలిసి సమ్మేళనమయింది ఇదే మొదటిసారి అని, ఇకనుంచి ప్రతీ సంక్రాంతికి ఇదే విధంగా దాసరి కుటుంబ సభ్యులమంతా సమ్మేళనమవుతామని మధు తెలిపారు. కార్యక్రమంలో దాసరి ప్రభాకరరెడ్డి, ఒగ్గు కేశవరెడ్డి, దాసరి దివాకరరెడ్డి విజయ దంపతులు, మాధవరెడ్డి, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

చీరెకు నిప్పంటుకొని వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-కల్లూరు

ప్రమాదవశాత్తు చీరెకు నిప్పు పట్టుకొని వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై బి. కొండలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని చిన్న కోరుకొండ గ్రామానికి చెందిన అరిగెల వెంకటమ్మ(75) ఆదివారం ఉదయం చింత చెట్టు కింద ఉన్న చెత్తంతా ఏరి నిప్పంటించింది. ఆ మంటలు చీరెకు అంటూకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కల్లూరులో ప్రథమ చికిత్స చేయించి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఖమ్మంలోనే ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-పెనుబల్లి



స్నేహ స్ఫూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం 30 మంది వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. పెనుబల్లి, పల్లెవాడ చౌడవరం గ్రామాలకు చెందిన పేద వృద్ధులకు ట్రస్ట్ డైరెక్టర్ పొట్లపల్లి శ్రీనివాసరావు వితరణతో దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పొట్లపల్లి శ్రీనివాసరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, వేముల రవికుమార్, శైలజ, అబ్దుల్ జాన్ బి, సునీత రాణి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి



- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు డిమాండ్
- 8 ఏండ్లుగా చిమ్మపుడిలో క్రీడలు : రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్

నవతెలంగాణ-రఘునాథపాలెం

క్రీడల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు అధిక నిధులు కేటాయించి, గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు, డివైయఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల.రమేష్ లు డిమాండ్ చేశారు. స్థానిక చిమ్మపూడి గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో బోడెపూడి ట్రస్ట్ సహరికారంతో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ విద్యార్థుల, యువకుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూనే క్రీడలో యువత రాణించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. చిమ్మపూడి గ్రామంలో గత ఎనిమిది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని,క్రీడలు ఆడటం వలనే మానసిక ఉల్లాసం కలుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ప్రతాపనేని.వెంకటేశ్వర్లు, సీపీఐ గ్రామ నాయకులు ప్రొద్దుటూరి వెంకట్ రెడ్డి, చంద్రమ్మ, రమేష్, టోర్నమెంట్ మేనేజ్ మెంట్ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ గ్రామ, మండల నాయకులు జోనెబోయిన నవీన్, దశరద.వీరబాబు, దొంతు.గణేష్, రేమల్లే జైపాల్, రాచర్ల.నరేష్, దశరద.వినోద్, సురేష్, కుదురుపాక.సాయి, పావురాల.పవన్,షేక్.సమీర్, జోనెబోయిన.వెంకటేష్, లోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మచ్చా వీరయ్య

- నిజాం మిలటరీని గడగడలాడించిన ధీశాలి
- విరోచిత పోరాటంలో వీరమరణం పొందిన ఉద్యమకెరటం
- నేడు 74వ వర్ధంతి

నవతెలంగాణ-ముదిగొండ

భూమి కోసం, భుక్తి కోసం తెలంగాణ పేద ప్రజల విముక్తి కోసం విరోచితంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4వేల మంది వీరులు బలిదానమయ్యారు. నైజాం నవాబ్‌నుగడగడలాడించి మిలటరీ బలగాలను తరిమికొట్టి ప్రజలకు అండదండలు ఇచ్చి ఎర్రజెండాను రెపరెపలాడించిన ముదిగొండ మండల గోకినపల్లి ముద్దుబిడ్డ మచ్చా వీరయ్య. తెలంగాణ సాయుధ పోరాట విరోచిత పోరాటంలో వీర మరణంపొందారు.ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామానికి చెందిన మచ్చా వీరయ్య ఉన్నత వర్గానికి చెందిన వారు. ఆంధ్ర మహాసభ ముఖ్య కార్యకర్తగా ఉంటూ 1943-46 మధ్య ఎన్నో ప్రజా సమస్యలపై ఉద్యమాల్లో పాల్గొన్నాడు. 1947-48 నాటికితెలంగాణ సాయుధ పోరాటం ఉధృతం అవుతున్న నేపథ్యంలో అంకుటిత దీక్ష, పట్టుదలతో ధైర్య సాహసాలు ప్రదర్శించి కమ్యూనిస్టు పార్టీకి దళ నాయకుడయ్యారు. ప్రజా సమస్యలపై పని చేస్తూ వారికి రక్షణగా నిలిచాడు. యూనియన్ భూభాగం నుంచి పిండిప్రోలు ప్రాంతంలోని దళాలను కలుపుకుని రహస్య స్థావరాలలో మచ్చా దళ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. నైజా నవాబు మిలటరీ బలగాలను తరిమికొట్టే వ్యూహా లను పన్నారు. కమ్యూనిస్టు పోరాట ఎజెండాపై సమీక్షా సమావేశాలు జరిపి కేంద్ర కృత ప్రజాస్వామ్యాన్ని అమలు పరిచారు. మచ్చా వీరయ్య దళంలో పని చేసే దళ సభ్యులు పేద కుటుంబాలకు చెందిన సాధారణమైన కార్యకర్తలు ఉన్నారు. మచ్చా వీరయ్య వ్యక్తిత్వం నిబద్ధతమైన సిద్ధాంతంలో సాయుధ పోరాట పంధాను ఎంచుకున్నాడు. సభ్యుల నుంచి నిషితమైన విమర్శలను ఆయన సేకరించేవారు. తమ పొరపాట్లను అంగీకరించి భవిష్యత్తులో అలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకుంటానని వాగ్దానం చేసే ముక్కుసూటి తనం ఆయనది. అందుకే ఆయనను దళ సభ్యులు, సహచరులు, అనుచరులు మచ్చా వీరయ్య అంటే అంతులేని అప్యాయత, విశ్వాసం ఉండేది. మచ్చా వీరయ్య దళంలో గోకినపల్లి గ్రామానికి చెందిన వాసిరెడ్డి లింగయ్య, యరమనేని వెంకటనర్సయ్య, ఆయన భార్య రాజమ్మ, పారుపల్లి పుల్లయ్య, పమ్మి గ్రామానికి చెందిన నారపొంగు లక్ష్మయ్య, రాయబారపు ముత్తయ్య, గోపయ్యలు దళం సభ్యులుగా పని చేశారు. మచ్చా వీరయ్య అనుచరులుగా పత్తు సాహెబ్, మీగడ కోటయ్యలు ఉండేవారు. మండలంలోని బాణాపురం, వెంకటాపురం, ముత్తారం, పమ్మి, కమలాపురం, గంధసిరి, అమ్మపేట, నేలకొండపల్లి ప్రాంతాల్లో కమ్యూనిస్టు గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసి నెహ్రూ సైన్యాలను తరిమితరిమి కొట్టి గ్రామాల్లో కాంగ్రెస్ భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా ప్రజలను



ఒక్కటి చేసి ఐక్య ఉద్యమాలు నిర్వహించారు. ప్రజల మధ్యనే ఉంటూ పోరాటాలు కొనసాగిస్తున్న సమయంలో మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తులను నైజా మిలటరీ బలగాలు చుట్టుముట్టారు. మచ్చా వీరయ్య, ఆయన సహచరుడు కృష్ణమూర్తిని బలగాలు చిత్రహింసలకు గురి చేయగా మచ్చా వీరయ్య ఒక్క రహస్యమైనా చెప్పకపోవడం విశేషం. చివరకు రెండు కండ్లు పొడిచినా భయపడని ధైర్యం మచ్చా వీరయ్యది. వీరు తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడు గంగవరపు శ్రీనివాస్‌కు ముఖ్య అనుచరులు. నైజాం సైన్యాలు వీరయ్య, కృష్ణమూర్తిని ఖమ్మం రూరల్ ప్రాంతంలో కాచి రాజుగూడెం గ్రామంలో 1949 జనవరి 17న కాల్చి



చంపారు. ఆయన మరణం నేటికి 74 ఏండ్లు. ఆయన స్ఫూర్తి ఎందరికో ఆదర్శం. ఆదర్శప్రాయుడు మచ్చా వీరయ్య నిత్యం ప్రజల హృదయాల్లో సజీవంగా ఉంటూ నిలువెత్తు స్థూపమై గ్రామ ప్రజల గుండెలో వెలుగుతున్నాడు. ప్రతి ఏటా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మచ్చా వీరయ్య వర్ధంతి సభలు జరిపి ఆయనకు ఘనంగా నివాళ్లర్పిస్తారు.

నూతన సమీకృత కలెక్టరేట్లో
కార్యకలాపాలు ప్రారంభం

కార్యాలయంలో కొలువు తీరిన కలెక్టర్ అనుదీప్

- స్వాగతం పలికిన జేసీ, డీఆర్డీఏ
- తొలి సమావేశం ప్రజావాణిలో కలెక్టర్
- నూతన కలెక్టరేట్లోకి అన్ని శాఖలు షిఫ్ట్ కావాలి
- 17 వరకు అల్టిమేట్ చర్యలు తప్పవు
- కలెక్టర్ అధికారులకు ఆదేశం





నవతెలంగాణ-పాల్వంచ

ప్రజలకు అందుబాటులో అన్ని శాఖలు ఒకే దగ్గర ఉండే విధంగా పాల్వంచలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాన్ని ఏర్పాటు చేసి ఇటీవలే ముఖ్యమంత్రి కేసీఆర్ చేత ప్రారంభించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ఈ నూతన కలెక్టరేట్ భవనం నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తొలుత కలెక్టర్ అనుదీప్ తన కార్యాలయంలో కొలువుదీరారు. దీంతో జేసీ వెంకటేశ్వర్లు, డీఆర్ఓ అశోక్ చక్రవర్తి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పలు అధికారులు, జర్నలిస్టు సంఘాల పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం తొలి సమావేశం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. సంక్రాంతి తెల్లవారి కావడంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో అన్ని ప్రాంతాల నుండి సమస్యలు విన్నవించుకోనేందుకు రాలేకపోయారు. ఈ ప్రజావాణిలో తొలి దరఖాస్తు పాల్వంచకు చెందిన అఫ్జల్ పర్వీన్ అనే మహిళ అందజేశారు. అనంతరం నూతన భవనంలోకి కొన్ని శాఖలు తన కార్యాలయాల్లోకి షిఫ్ట్ కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన కలెక్టరేట్ అన్యాంగులతో అన్ని శాఖలకు గదులు నిర్మించినప్పటికీ ఇంకా కార్యాలయంలోకి రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. 17 కల్ల షిఫ్ట్ కానీ శాఖలపై చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏను ఆదేశించారు. ప్రజావాణికి జిల్లాలో ఉన్న అధికారులు హాజరయ్యారు. హాజరుకాని అధికారులతో టెలికాన్ఫరెన్స్లో ఆయనే సమస్యలపై మాట్లాడారు. నూతన కలెక్టరేట్లో కార్యకలాపాలు ప్రారంభం పట్ల జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

5 లక్షల మందితో భారీ బహిరంగ సభ

- తెలంగాణ మోడల్ని దేశవ్యాప్తంగా విస్తరిస్తాం
- విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు



నవతెలంగాణ-మణుగూరు

ఈ నెల 18న ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ తొలి సభకు ఐదు లక్షల మందికి పైగా ప్రజలు హాజరవుతున్నారని విప్, ఎమ్మెల్యే ంగా కాంతారావు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ విధానాలను ఎండగట్టేందుకు కేరళ, పంజాబ్, ఢిల్లీ ముఖ్యమంత్రితో పాటు ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్లు హాజరవుతున్నారని అన్నారు. వామపక్షాల జాతీయ నాయకత్వం ఈ మహాసభకు హాజరవుతున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా విస్తరించేందుకు ఖమ్మం సభ వేదిక కానున్నది అన్నారు. పూర్తి స్థాయిలో నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణి నాయకత్వం ఖమ్మం సభకు ప్రజలను తరలించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం సభ వేదికగా దేశవ్యాప్త బీఆర్ఎస్ ఎజెండాను ప్రకటిస్తారని అన్నారు. దేశంలోని చిన్న చిన్న పార్టీలు బీఆర్ఎస్లో విలీనం కావడానికి సిద్ధమవుతున్నాయని అన్నారు. తెలంగాణలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశ ప్రజలందరూ కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఖమ్మం సభ దేశ చరిత్రలోనే స్థిర స్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవ ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్



నవతెలంగాణ పాల్వంచ

ఘనంగా గణతంత్ర దినోత్సవ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారం ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలను ఉద్దేశించి చేయనున్న ప్రసంగ పాఠం తయారీకి అన్ని శాఖల అధికారులు వారి శాఖల్లో సాధించిన ప్రగతిపై ప్రగతి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ప్రగతి మైదానాన్ని పరిశుభ్రం చేయించాలని సూచించారు. పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వాహణకు షెడ్యూల్ తయారు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో రథోత్సవం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామాలయంలో ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మూలవర్లకు పంచామృతాలతో అభిషేకం ఉత్సవ స్థాపన, విశేష అలంకరణ అనంతరం రథసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్షేణపూజ, పుణ్యాహవచనం, అష్టదిక్పాలకుల పూజ, రథబలి కార్యక్రమం ముగించుకుని స్వామి వారిని తిరువీధి సేవ నిర్వహించారు. తిరువీధి సేవ అనంతరం ప్రదానద్వారం వద్ద స్వామివారికి, లక్ష్మీఅమ్మవారికి వాదోపవాదాలుగా ప్రళయ కలహోత్సవం కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. అనంతరం ఆరగింపు సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు,

అందత్వాన్ని దూరం చేయడానికి కంటి వెలుగు



నవతెలంగాణ-టేకులపల్లి

అందత్వాన్ని దూరం చేయడానికి కంటి వెలుగు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుండి ప్రారంభమవుతున్నట్లు కంటి వెలుగు ప్రత్యేక అధికారి వేల్పుల విజేత సోమవారం తెలిపారు. సులానగర్ ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయడానికి కావలసిన సూచనలు, సలహాలు సిబ్బందికి సూచించారు. కావలసిన సామగ్రిని పరిశీలించారు. మండల పరిధిలోని గ్రామపంచాయతీలలో ప్రజలందరికీ తెలిసే విధంగా ఆహ్వాన పత్రికలు రెండు రోజులు ముందుగా ప్రతి ఇంటికి పంపిణీ చేయాలని, గ్రామాలలో డప్పు ప్రచారము చేయించాలని, 18 ఏండ్లు దాటిన ప్రజలందరూ ఉపయోగించుకునే విధముగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి దినేష్, శ్రావణి ,పావని, సనత్ కుమార్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్కు తీవ్రగాయాలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి (గుండాల)

రోడ్డు ప్రమాదంలో జీబు డ్రైవర్కు తీవ్రగాయాలైన ఘటన సోమవారం గుండాల మండలం ముత్తాపురం గ్రామంలో చోటు చేసుకుంది. ప్రమాదం వివరాలు ఇలా ఉన్నాయి... గుండాల నుంచి కాచనపల్లి గ్రామానికి బ్యాంక్ పని నిమిత్తం కిరాయికి జీబు డ్రైవర్ పూనెం రాములు వెళ్తున్నాడు. ఇల్లందు పట్టణం నుంచి బొలేరో వాహనం వస్తున్న క్రమంలో గుండాల మండల పరిధిలోని ముత్తాపురం గ్రామ సమీపంలో ఉన్న మూల మలుపు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దాంతో జీబు డ్రైవర్ రాములు కాలు విరిగి, ఛాతి భాగంలో తీవ్ర గాయాలు కాగా, జీబులో ఉన్న పూనెం శ్రీనుకు గాయాలు, వజ్జ ఎర్రయ్య స్వల్ప గాయాలయ్యాయి. ముత్తాపురం స్థానికులు ప్రమాదం గమనించి క్షతగాత్రులను గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని ఖమ్మం తరలించారు. డ్రైవర్ రాములు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

సంస్కృతి, సాంప్రదాయాలను మరవద్దు

- దంతేలబోరా సర్పంచ్ గద్దల రమేష్
- ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి పంపిణీ



నవతెలంగాణ-పాల్వంచ

సంస్కృతి, సాంప్రదాయాలను మరవద్దు అని దంతేలబోరా సర్పంచ్ గద్దల రమేష్ అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని దంతేలబోరా ఎస్సీ కాలనీ గ్రామ పంచాయతీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామస్తుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ గద్దల రమేష్ పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిద్దుల శివ శేఖర్, కోలేటి రాంబాబు, రాము, తిరుపతిరావు, ఆదిలక్ష్మి, శ్రీను, సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి దళితుడికి రూ.10 లక్షలు వస్తాయి

- దళిత జాతి కేసీఆర్కి రుణపడి ఉంటుంది
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్



నవతెలంగాణ-మణుగూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బందు ద్వారా ప్రతి దళిత కుటుంబానికి పది లక్షల రూపాయలు అందుతాయని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ క్యాస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలో దళిత బంధు ద్వారా లబ్ధి పొందిన యూనిట్లను పరిశీలించారు. మండలం మున్సిపాలిటీ పరిధిలో 14 యూనిట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని దీవెన క్లాత్ మర్చంట్ షాపును పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ఎలాంటి ష్యూరిటీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం దళిత బంద్ ద్వారా రూ.10 లక్షలను లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్లో జమ చేస్తుంది అన్నారు.

కంటి వెలుగు కేంద్రం సందర్శన

నవతెలంగాణ-చంద్రుగొండ

కంటి వెలుగు రైతు వేదిక కేంద్రంను మండల కంటి వెలుగు ప్రత్యేక అధికారి కె.సంజీవరావు, మండల ప్రజా పరిషత్ అధికారిని అన్నపూర్ణ కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం సందర్శించారు. 18న జరిగే కంటి వెలుగు కార్యక్రమం సంబంధించిన ఏర్పాటును పరిశీలించారు. పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ, మండల పంచాయతీ ఆఫీసర్ తోట తులసి రామ్, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, హెల్త్ సూపర్ వైసర్ ఇమామ్, పద్మ, ఏఎన్ఎం పుల్లమ్మ ఆశాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం

నవతెలంగాణ-టేకులపల్లి

రాబోయే అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని, అందుకు ప్రతి కార్యకర్త సైనికులు లాగా పనిచేయాలని, హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, వాడ వాడను కాంగ్రెస్ జెండా పండుగ నిర్వహించుకుందామని టీపీసీసీ చీమల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారము టేకులపల్లి మండలాధ్యక్షుడు బి.దేవానాయక్ ఆధ్వర్యంలో మండలంలోని గంగారం, వజ్జానిగూడెం, లచ్చగూడెం తదితర గ్రామాలలో పర్యటించారు. నెల 26వ తారీఖున రేవంత్ రెడ్డి పాదయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, సమ్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సింగరేణి, బీటీపీఎస్ రహదారి

- ఆందోళనలో ప్రజలు





నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సింగరేణి ఉపరితల గల నుండి భద్రాద్రి పవర్ ప్లాంటుకు బొగ్గును సరఫరా చేసే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రోజుకు 14000 టన్నుల బొగ్గును సరఫరా చేసేందుకు భారీ వాహనాలు రాకపోకలు వినియోగిస్తున్నారు. దీనికి తోడు ఇసుక ర్యాంపుల నుండి 24 గంటలు ఇసుకను రాష్ట్రవ్యాప్తంగా ఈ రహదారి ద్వారానే చేరవేస్తుంటారు. దీనికి తోడు ములుగు జిల్లా ఏటూరు నాగారం నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం వరకు నిత్యం బస్సులు ఇతర వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. ఇంత రద్దీలో ఇసుక లారీలు బొగ్గు లోడు లారీల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇదిలా ఉండగా రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. ఎదురుగా వచ్చే లారీ నుండి తప్పుకునేందుకు వీలు లేకుండా రహదారి చిద్రమైంది. మణుగూరు ఓసి నుండి ప్రధాన రహదారికి కలిపే ప్రాంతంలో రోడ్డు ప్రమాదకరంగా మారింది. బొగ్గు సరఫరా వాహనాల రద్దీతోపాటు విపరీతమైన దుమ్ము లేవడంతో రోడ్డు ప్రమాదకరంగా ఉన్నది. ప్రయాణికులు బిక్కు బిక్కుమంటు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. మణుగూరు నుండి బీటీపీఎస్ వెళ్లే రహదారి ఓసీ ఫోర్ డౌన్లో కనపడని పెద్ద గొయ్యి ఉన్నది. దగ్గరకు వెళ్లే వరకు కనిపించదు. అనేకమంది ద్విచక్ర వాహనాలు దారులు గుంటలో పడి తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. కొందరికి కాళ్లు చేతులు విరిగి వికలాంగులయ్యారు. ధమ్మక్కపేట పంచాయతీ చిక్కుడు గుంట గ్రామం వద్ద రహదారి మరమ్మతుల పేరుతో మట్టి పోసి వదిలేశారు. వాహనాల రద్దీ కారణంగా విపరీతంగా దుమ్ము లేవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడడం లేదు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్బీ అధికారులు స్పందించాలని రోడ్డు మరమ్మత్తులు చేయాలని ప్రజల కోరుతున్నారు. సింగరేణి, భద్రాద్రి పవర్ ప్లాంట్ అధికారులు దీనికి బాధ్యత వహించి రోడ్డును బాగా చేయించాలని ప్రజలు ప్రజాసంఘాలు కోరుతున్నాయి.



మాజీ సీఎం మాయావతి జన్మదిన వేడుకలు

- యెర్రా కామేష్ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-కొత్తగూడెం

బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి బెహన్ కుమారి మాయావతి 67వ జన్మ దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పరిపాలన బాధ్యతలు నిర్వహించి పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. దాదాపు 200ల ఇంటర్మీడియట్ కళాశాలలను ఏర్పాటు చేశారని మరో 5,549 ప్రభుత్వ పాఠశాలలను నిర్మించి ఉచిత విద్యను అందించిన గొప్ప నేతగా అభివర్ణించారు. 28,419 గ్రామలకు అంబేద్కర్ గ్రామ నిర్మాణ్ పథకం ద్వారా అభివృద్ధి చేసిన ఘనత ఆమెకు దక్కిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ గంధం మల్లికార్జున్ రావు, సాయి, అసెంబ్లీ మహిళా కన్వీనర్ కోలా మల్లికా, నాగుల రవికుమార్, తాటిపాముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించకుంటే ప్రళయ గర్జన

- ఫోరం రాష్ట్ర గౌరవ చైర్మెన్ శ్రావణబోయిన నర్సయ్య



నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్ర సాధనకై 1969 నుండి 2014 వరకు అనేక దశల్లో పోరాటాలు నిర్వహించి ఎంతో మంది బలిదానం అయిన తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్రావు విస్మరించారని, ఉద్యమకారులను గుర్తించకుంటే ప్రళయ గర్జన తప్పదని 1969 తెలంగాణ ఉద్యమ పోరాట ఫోరం రాష్ట్ర గౌరవ చైర్మెన్ శ్రావణబోయిన నర్సయ్య హెచ్చరించారు. సోమవారం కూలీలైన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ కారులు అనేక దఫాలుగా సీఎంను కలిసినప్పటికీ ఫలితం లేకుండా పోతుందని తెలిపారు. ఇప్పటికైనా ఉద్యమకారులను గుర్తించాలన్నారు. లేని పక్షంలో ఉద్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షులు ఎం.వళీబాబా, రాష్ట్ర కార్యదర్శి శ్రీపాదసత్యనారాయణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కాకెల్లి సైమన్, అల్లి భాస్కర్, తమ్మిశెట్టి రామారావు పాల్గొన్నారు.

అత్యంత ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు

- కంటి వెలుగు క్యాంపులను విజయవంతం చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్లో ఆరోగ్యశాఖ మంత్రి హరీష్, సీఎస్ డా.శాంతి కుమారి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్కు ఆదేశం





నవతెలంగాణ-పాల్వంచ

అత్యంత ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కంటి వెలుగు క్యాంపులను విజయవంతం చేయాలని, ఈ నెల 19వ తేది ఉదయం 9 గంటల నుంచి అన్ని జిల్లాలలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించాలని రాష్ట్ర ఆర్థిక వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై సోమవారం మంత్రి హరీష్ రావు ఖమ్మం కలెక్టర్ కార్యాలయం నుంచి, సీఎస్ డా.శాంతికుమారి, డీజీపీ అంజనీ కుమార్ వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రిజ్వి, కమిషనర్ శ్వేత మహంతి హైదరాబాద్ బీఆర్కె భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంటి వెలుగు క్యాంపుల నిర్వహణ పట్ల తీసుకోవాల్సిన చర్యలను మంత్రి వివరించారు. సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా 3వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతున్నారని, చాలా ప్రాధాన్యతా కార్యక్రమమని చెప్పారు. పకడ్బందీగా అమలు చేయాలని మంత్రి సూచించారు. కంటి వెలుగు క్యాంపుల నిర్వహణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు.

జనవరి 18న ఖమ్మంలో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభిస్తారని, తదుపరి అన్ని జిల్లాలలో జనవరి 19న ఉదయం 9 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, జడ్పీ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు వారి పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలలో కలెక్టర్, డీఎంహెచ్ఓ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కంటి వెలుగు బృందాలు రాత్రి బస చేయుటకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఉదయం 8.45 గంటల వరకు తప్పనిసరిగా బృంద సభ్యులు క్యాంపు ఉన్న ప్రదేశాలకు చేరుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. కంటి వెలుగు క్యాంపులు విజయవంతం అయ్యేందుకు పంచాయతీ కార్యదర్శుల, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు, వీఓఏలను భాగస్వామ్యం చేయాలని, క్యాంపు నిర్వహణ ముందస్తు సమాచారం ప్రజలకు తెలియజేసి ప్రతి ఇంటికీ ఆహ్వాన పత్రిక అందించాలని చెప్పారు. ప్రజలు ఉదయం, మధ్యాహ్న సమయాల్లో వచ్చే విధంగా షెడ్యూల్ చేయాలని మంత్రి సూచించారు. ప్రతి వైద్య బృందానికి క్యాంపు నిర్వహణ కోసం అవసరమైన సామగ్రి, మందులు, కళ్ళద్దాలు అందించేలా చర్యలు తీసుకున్నామని మంత్రి చెప్పారు. కంటి వెలుగు ఉచిత శిబిరాలకు వచ్చే ప్రజలు తప్పనిసరిగా వారి ఆధార్ కార్డు తీసుకుని వచ్చే విధంగా అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో క్యాంపుల నిర్వహణ కంటే ముందుగా ఆశా, ఎఎన్ఎంలు పర్యటించి షెడ్యూల్ వివరాలు తెలియజేస్తూ కంటి వెలుగుపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎంపీఓ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మండల ప్రత్యేక అధికారులు ప్రతి రోజూ వారి పరిధిలో క్యాంపుల నిర్వాహణను పర్యవేక్షణ చేయాలని చెప్పారు. జిల్లా స్థాయిలో డిఎం హెచ్ ఓ, ఇతర ప్రోగ్రాం అధికారులు విస్తృతంగా పర్యటిస్తూ క్యాంపుల నిర్వహణను తనిఖీ చేయాలని మంత్రి ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న సీఎస్ డా.శాంతి కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు నిర్వహిస్తున్నందున ప్రణాళిక బద్ధంగా క్యాంపులు నిర్వహించు విధంగా చర్యలు చేపట్టి ప్రజలు కంటి పరీక్షలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొదట విడత కంటి వెలుగు కంటే అదనపు సిబ్బంది ఏర్పాటు ద్వారా ప్రజలకు కంటి వెలుగు క్యాంపులు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలకు సౌకర్యార్ధంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఏ చిన్న పొరపాటు కూడా జరగకుండా జాగ్రత్త వహించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఐడీఓసీ నుండి కలెక్టర్ అనుదీప్, జిల్లా వైద్యాధికారి డా.శిరీష, డీఎస్పీ వెంకటేష్ బాబు, డీపీఓ రమాకాంత్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలోని పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన కండె మానస అనే వివాహిత 108 వాహనంలో సోమవారం ప్రసవించింది. 108 వాహన సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన నిండు గర్భిణీ మానసకు ఆదివారం అర్ధరాత్రి పురిటి నొప్పులు అధికంగా రావడంతో 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో, సిబ్బంది వెంటనే మానసను ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. స్థానిక వైద్యులు ఆమె పరిస్థితిని పరిశీలించి, కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దాంతో 108 వాహన సిబ్బంది మానసను తీసుకుని వెళ్తుండగా, కొత్తగూడెం దాటాక రామవరం సమీపంలో 108 వాహనంలోనే మానస పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించి, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. దాంతో మానస కుటుంబ సభ్యులు సమయాస్ఫూర్తితో సాధారణ కాన్పు అయ్యేలా చేసిన ఈఆర్ సీపీ నవనీత్, ఈఎమ్టీ పి.భాగ్యమ్మ, పైలట్ శ్రీహర్షలను అభినందించారు.

పసికందులను కాపాడిన సీఆర్పీఎఫ్ బలగాలు

- జవాన్లను అభినందించిన సెకండ్ కమాండెంట్ శెకావత్





నవతెలంగాణ-చర్ల

తమ ప్రాణాలను పణంగా పెట్టి మంటల్లో చిక్కుకున్న పసికందులను సీఆర్పీఎఫ్ 151 బెటాలియన్ జవాన్లు సురక్షితంగా కాపాడారు. ఛత్తీస్ ఘడ్ తెలంగాణ సరిహద్దు పామేడు గ్రామంలో నిర్మించిన సీఆర్పీఎఫ్ 151 బెటాలియన్ క్యాంపు సమీపంలోని పూరి గుడిసెలో సోమవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగినాయి. గుడిసెలో నుంచి పొగ, మంటలు రావడాన్ని గమనించిన సీఆర్పీఎఫ్ క్యాంప్ సెంట్రీ జవాన్ గుడిసెలో నుంచి మంటలు వస్తున్న విషయాన్ని డిప్యూటీ కమాండెంట్ ప్రదీప్ సింగ్ షెకావత్కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన డిప్యూటీ కమాండెంట్, కమాండెంట్స్ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మంటలను ఆర్పి మంటలలో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను సురక్షితంగా రక్షించారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఉంగా కుటుంబానికి తక్షణ సహాయంగా దుప్పట్లు, మందులు, వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. సకాలంలో స్పందించి అగ్ని ప్రమాదంలో నుంచి చిన్నారులను రక్షించిన జవానులను డిప్యూటీ కమాండెంట్ ప్రదీప్ సింగ్ షెకావత్, స్థానికులు ప్రశంసించారు.

19న కంటి వెలుగు కార్యక్రమం



నవతెలంగాణ-చర్ల

ఈ నెల 19వ తారీకు నుండి ప్రారంభం కానున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తహసీల్దార్ బి.భరణి బాబు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం తహసిల్దార్ మండలంలోని పెద్దిపల్లి, సత్యనారాయణపురం కంటి వెలుగు కేంద్రాలను పరిశీలించారు. కంటి వెలుగు కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని వైద్యాధికారులకు తగు సూచనలు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎమ్ఓ చింతా సత్యనారాయణ వైద్యాధికారి దివ్య, నయన, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
www.praja.khammam@gmail.com
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం 17 జనవరి 2023

పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికల నిర్వహించాలి

- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

పాల్వంచ : పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేస్తూ యువతరం పార్టీ క్లీన్ అండ్ గ్రీన్ ఎర్త్ సొసైటీ ఆదివాసీ గిరిజన సేవా సంఘం బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాల్వంచ మున్సిపాలిటీకి సుమారుగా 23 సంవత్సరాల నుంచి ఎన్నికలు లేక పాలకవర్గం లేక అభివృద్ధి కుంటుపడుతుందని ప్రశ్నించేవారు లేక ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కోట్లు ప్రకాష్, క్లీన్ అండ్ గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షులు బట్టు కృష్ణ, ఆదివాసీ గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాషా, భిక్షం, రాష్ట్ర సెక్రెటరీ పోయెమ్ కృష్ణకుమార్, బీఎస్పీ మండల అధ్యక్షులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్లో ప్రవేశించిన పండు స్ట్రైకర్స్ కొత్తగూడెం

- రసవత్తరంగా సాగుతున్న యూసుఫ్ క్రికెట్ టోర్నమెంట్

బూర్గంపాడు : మండల కేంద్రంలో జరుగుతున్న యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఐదో రోజైన సోమవారం జరిగిన మొదటి క్వాటర్ ఫైనల్ ఫైనల్ మ్యాచ్‌లో గియస్ బూర్గంపాడు జట్టుపై విజయం సాధించిన పండు స్ట్రైకర్స్ కొత్త గూడెంజట్టు సెమిఫైనల్‌కి ప్రవేశించింది. మొదట బ్యాటింగ్ చేసిన బూర్గంపాడు గియస్ జట్టు 91 పరుగులు చేయగా పండు స్ట్రైకర్స్ కొత్తగూడెం జట్టు కేవలం 10.4 ఓవర్లులలో 95 పరుగులు చేసి విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో టాస్ ఓడిపోయి బ్యాటింగ్ చేసిన ధోని ఎలెవన్ పాల్వంచ జట్టు నిర్ణీత 15 ఓవర్లకు గాను 14.1 ఓవర్లలో 87 పరుగులు చేసి ఆలౌట్ అయింది. 88 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన జెమినీ లెవెల్ అశ్వాపురం జట్టు 14 ఓవర్లలో 8 నష్టానికి 91 పరుగులు చేసి విజయం సాధించింది. బౌలింగ్‌లో 1వికెట్ తీసి బ్యాటింగ్ లో 28 పరుగులు చేసిన కెప్టెన్ అజయ్ జెమినీ 11 అశ్వాపురం మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఈ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌ను సర్వో రాష్ట్ర నాయకులు గొర్ల వీరబాబు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వెన్న అశోక్ కుమార్ అందజేశారు. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్లో మొదటి బ్యాటింగ్ చేసిన టిల్లు 11 కొత్తగూడెం తన నిర్ణీత 15 ఓవర్లకు ఆరు వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. 133 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన బ్లూ క్యాప్ భద్రాచలం జట్టు 15 ఓవర్లకు గాను 6 వికెట్లు కోల్పోయి 119 పరుగులు చేసి ఓటమి చవిచూచింది. బ్యాటింగ్‌లో 73 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలిచిన నవీన్ టిల్లు ఎలెవన్ కొత్తగూడెం జట్టు ప్లేయర్ మాన్ ఆఫ్ ద మ్యాచ్ గెలుచుకున్నాడు గెలుచుకున్నాడు.

దుప్పట్ల పంపిణీ

మణుగూరు : దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధినేత గంట రాధా తెలిపారు. సోమవారం కమలాపురం, రాయి గూడెం, పాములపల్లి, బట్ట మల్లయ్య గుంపు, కళ్యాణపురం, అన్నారంలలో పేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బట్టీల గుంపు సర్పంచ్, వార్డ్ మెంబర్లు, ఆశ వర్కర్లు, ట్రస్ట్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అనసూయ జీవితం ఆదర్శనీయం : కూనంనేని

మణుగూరు : సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోల్లోజి అయోధ్య చారి సతీమణి కామ్రేడ్ అనసూయ జీవితం నేటి మహిళలకు ఆదర్శమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మణుగూరు మండలం రామాంజరం గ్రామంలో కామ్రేడ్ బోల్లోజు అనసూయ వర్ధంతిసభలో చాలా వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర నాయకత్వం పాల్గొన్నారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మావోయిస్టులకు విరవకుండా వామపక్ష ఉద్యమాలకు వెన్నుదన్నుగా ఉన్న అనసూయ జీవితం ఆదర్శనీయమన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు అనసూయమ్మ సుపరిచితులేనన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాకాల పాటి వెంకటేశ్వర్లు (పెద్దబ్బాయి), ఖమ్మం జిల్లా కార్యదర్శి భాగం హేమంతరావు, రావులపల్లి రాంప్రసాద్, అక్కి నరసింహారావు, జంగం మోహన్ రావు, సుధాకర్, ఎస్.కే.సర్వర్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాములు, టీవీ.ఎం.వి.ప్రసాద్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు సామాజిక అవగాహన పెంచుకోవాలి

కొత్తగూడెం : ప్రస్తుతం భారత దేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహనను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. 'ప్రస్తుత సామాజిక-ఆర్థిక పరిస్థితులు ఒక అవగాహన' అనే అంశంపై ప్రకృతి ఆశ్రమంలో, సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు పాల్గొని మాట్లాడారు. ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ మాటున దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బామ్ సెఫ్, బహుజన విజ్ఞాన వేదికల సంయుక్త ఆధ్వర్యంలోజరిగిన సమావేశంలో బహుజన విజ్ఞాన వేదిక ఫౌండర్ ఎస్. వెంకటేశ్వర్లు, బామ్ సెఫ్ జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీ సలిగంటి శ్రీనివాస్, నాగా సీతారాములు, సభ్యులు జి.శ్రీకాంత్, ఎం.రామనాదం, నబీసాహెబ్, న్యాయవాది మారపాక రమేష్, కె.హరిప్రసాద్, గాయకులు యమ్.వెంకట ముత్యం, వెంకట్, ఏసుపాదం, కోటేశ్వరరావు, దయాసాగర్, సుగుణారావు, సర్వయ్య పరశురాములు, అనిల్ కుమార్, నజీర్ అహ్మద్, పాషాలు పాల్గొని మాట్లాడారు.

ముగిసిన నవీన్ కుమార్ మెమోరియల్ వాలీ బాల్ క్రీడలు

- విన్నర్స్‌గా అచ్చుతాపురం, రన్నర్‌గా మామిడిగూడెం జట్లు నిలిచాయి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని అచ్చుతాపురం గ్రామంలో ఏఎస్‌పీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన చర్ల, దుమ్ముగూడెం మండలాల సోయం నవీన్ కుమార్ 13వ మెమోరియల్ క్రీడలు ఆదివారంతో ముగిసాయి. మూడు రోజుల పాటు జరిగిన క్రీడల్లో పలు టీములు తలపడగా చర్ల మండలం అచ్చుతాపురం జట్టు విన్నర్‌గా నిలవగా మామిడిగూడెం జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. మాడవస్థానంలో చర్ల మండలం కొయ్యూరు జట్టు నిలిచింది. విజేతలకు మొదటి బహుమతి అచ్చుతాపురం ఉపాధ్యాయులు ఏజె.ప్రబాకర్ అందజేసిన రూ.15,116, ద్వితీయ బహుమతి సివిల్ ఇంజనీర్ కొర్సా వెంకటేశ్వర్లు అందజేసిన రూ.3,116లు అందజేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ ఆటలు నిర్వహించి విజేతలకు ఆదివాసి మహిళా సంఘం ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. బహుమతుల ప్రదానం కార్యక్రమంలో ఏటీపీ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు, ఏఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు, ఏటిపి నాయకులు కారం గాంధీ, అపకా శ్రీను, కొర్సా చిట్టిబాబు, సోయం కృష్ణ, కోటేశ్వరరావు, బక్కయ్యలతో పాటు అచ్చుతాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ తెల్లం కృష్ణవేణి, ఉపసర్పంచ్ బుటారి నాగమణి, పీఈటీలు పూర్ణచందర్‌రావు, బాలకృష్ణ, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రామున్ని దర్శించుకున్న మెడికల్ సైన్సు ప్రొఫెసర్ల బృందం

నవతెలంగాణ-భద్రాచలం

ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రొఫెసర్ దీపాంకర్, వారి బృందం భద్రాచలంలోని శ్రీసీత రామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం స్వామి వారి దర్శనానికి వచ్చిన ప్రొఫెసర్ల బృందానికి దేవస్థానం పర్యవేక్షకులు స్వాగతం పలికారు. ముందుగా బలపీఠం వద్ద పూజలు చేసిన అనంతరం స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం లక్ష్మీ తాయారు అమ్మ వారిని, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ప్రొఫెసర్ల బృందం భద్రాచలం పట్టణంలోని సాయిబాబా మందిరమును, ముత్యాలమ్మ తల్లి మందిరమును దర్శించుకున్నారు. సాయిబాబా మందిరానికి వచ్చిన ఈ బృందానికి దేవస్థానం సభ్యులు ఘనంగా స్వాగతం పలికి స్వామివారి అమ్మవారి వస్త్రాలను తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు దీపాసిస్ బి.సాయి, దుర్గేష్ ప్రసాద్ సాహూ, నిషాకర్ సాహూ, శశాంక శేఖర్ పండ, శ్రీనివాసరావు, సాయిబాబా దేవస్థానం సభ్యుడు వెంకటేశ్వర్లు, భద్రాచలం ఏటీడీఓ నర్సింగ్ రావు, పీఓ సీసీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామయ్యను ఆల్ ఇండియా ఇనిస్టూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రొఫెసర్ దీపాంకర్, వారి బృందం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పర్ణశాల రామయ్యను దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి ప్రదాన ఆలయంలో అర్చక స్వాములు శేషం కిరణ్ కుమారాచార్యులు, భార్గవా చార్యులు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సీతాకుటీర ప్రదేశం, ఉమారామలింగేశ్వరాస్వామి ఆలయం, నారచీరల ప్రాంతాలను సందర్శించి పర్ణశాల విశిష్టత గురించి ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లు పరిశీలన

కొత్తగూడెం : కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ, చుంచుపల్లి మండల ప్రత్యేక అధికారిణి మెరుగు విద్యాలత కోరారు. సోమావారం మండలంలో ఆమె పర్యటించారు. ఏర్పాట్లు పరిశీలించారు. ఈనెల 19వ తేదీ నుండి 30వ తేదీవరకు పెనగడప గ్రామ పంచాయతీలో ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమం కోసం పెనగడప గ్రామపంచాయతీ హై స్కూల్ నందు ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీడీఓ సకినాల రమేష్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, డాక్టర్ బి.నవజ్యోతి, ఆప్తామెటిక్ ఆఫీసర్ సిహెచ్.శంకర్, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది వీరభద్రమ్మ, సురేఖ, రమేష్, పంచాయతీ కార్యదర్శి హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలి : ఆర్‌సీఓ

నవతెలంగాణ-భద్రాచలం

సంక్రాంతి సెలవులు ముగియగానే సెలవులకు ఇండ్లకు వెళ్లిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు తిరిగి ఆశ్రమపాఠశాలలకు, వసతి గృహాలకు, గురుకుల పాఠశాలలకు తిరిగి చేరుకుంటారని, వారు పాఠశాలలకు రాగానే వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని పాఠశాలల్లో చేర్చుకోవాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) ఇన్చార్జి ఆర్‌సీఓ గురుకులం డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ప్రాజెక్ట్ అధికార అధికారి పనులపై వెళ్లినందున పరిపాలన అధికారి భీమ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని రమాదేవితో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలు స్వీకరించి, తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ఐటీడీఏ ద్వారా, ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సురేష్ బాబు, ఐటీడీఏ విభాగం చెందిన రాందాస్, చలపతి శ్రీనివాస్, వివిధ శాఖలకు చెందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ కోల్ వాష్ రి ప్లాంట్ మూసివేత

- రోడ్డున పడుతున్న కార్మికులు



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణిలో వాషరీ ప్లాంట్లు ఒక్కోటి మూతపడు తున్నాయి. తక్కువ నాణ్యత కలిగిన బొగ్గును ఎక్కువ నాణ్యత కలిగిన బొగ్గుగా మార్చేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ఉపరితల గనుల్లో లభించే జీ15 గ్రేడ్ బొగ్గును శుద్ధి చేసి జీ9 గ్రేడ్‌గా మార్చేందుకు ఈ ప్లాంట్లు ఉపకరిస్తాయి. మణుగూరు, రామగుండం, మంద మర్రిలో వీటినేర్పాటు చేయగా మందమర్రిలో నిర్వహణ లోపంతో గుత్తేదారు మధ్యలోనే పనులు ఆపేశారు. కొన్నేళ్ల క్రితం మూతపడింది. తాజాగా మణు గూరులో ఉన్న ఒక్క ప్లాంట్ ఈ నెల 20 నుంచి సేవలు ఆగిపోనున్నాయి. వాషరీ ప్లాంట్లు ప్రస్తుతం సింగరేణికి భారంగా మారాయి. కొన్నేళ్ల క్రితం గనుల్లో ఉత్పత్తి అయిన జీ15 గ్రేడ్ బొగ్గు రవాణా చేయొద్దని థర్మల్ కేంద్రాలు విధించిన నిబంధనల మేరకు కోల్ వాషరీ ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జీ15 సరకునూ పవర్ ప్లాంట్లు కొనుగోలు చేస్తుండటం సింగరేణికి కలిసొచ్చిన అంశం. గతంలో జీ15 గ్రేడ్ టన్ను రూ.970 ఉండేది. ప్రస్తుతం అదే రకం టన్ను రూ.1620 పలుకుతుంది. తక్కువ నాణ్యత కలిగిన ముడి సరకునకూ మంచి ధర లభిస్తోంది. ఈ పరిస్థితుల్లో శుద్ధి చేసి నాణ్యమైన గ్రేడు తీసుకురావటం ద్వారా సింగరేణికి అదనపు భారం అవుతుంది. ఒక టన్ను బొగ్గును శుద్ధి చేసేందుకు రూ.210 ఖర్చు చేయాల్సి వస్తోంది. కోల్ వాషరీ ప్లాంట్లు మూతపడటంతో పర్యావరణానికి కొంత మేలు జరగనుంది. శుద్ధి తర్వాత వ్యర్థాల నీటిని బయటకు వదులుతుంటారు. ఆ నీరు వాగులు, చెరువుల్లో కలుస్తున్నాయి. దీనివల్ల నీటి కాలుష్యం పెరుగుతుంది. కోల్ వాషరీ ప్లాంట్లు మూసివేతతో జలాల కలుషితం తగ్గనుంది. మణుగూరులో వ్యర్థాల నీరు సమితి సింగారం చెరువుకు ప్రవహిస్తుంటాయి. అయితే ప్లాంట్లు ఆగిపోవ టంతో కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు.

అర్ధాంతరంగా మూసివేస్తున్నట్లు యాజ మాన్యం ప్రకటించటంతో ఎన్నో ఏళ్లగా పనిచే స్తున్న వారు కార్మికులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మణుగూరులోని ప్లాంట్లో గ్లోబల్ కంపెనీ కార్మికులు సుమారు 100 మంది ఉన్నారు కాంట్రాక్ట్ కార్మికులు 60 మంది ఉన్నారు. సుమారు 200 మంది కార్మికులు జీవన ఉపాధిని కోల్పోతున్నారు. వీరంతా ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్లోబల్ కోల్ వాషరీ ప్లాంట్తో సింగరేణి ఒప్పంద గడువు ముగిసింది. ఈ క్రమంలోనే వాటికి బొగ్గు అందించటం లేదు. నిజానికి నాలుగేళ్ల క్రితమే కంపెనీతో గడువు ముగిసినా పొడిగించారు. గ్లోబల్ వాసరీ ప్లాంట్ గడువు ఉపయోగించి కార్మికులకు ఉపాధి చూపించాలని లేదా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కార్మికులు కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ప్రజావాణి వినతులపై సత్వర చర్యలు చేపట్టాలి

- అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం



నవతెలంగాణ-పాల్వంచ

ప్రజావాణిలో వచ్చిన వినతులు పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయపు భవనంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మండలాల నుండి వచ్చిన దరఖాస్తులపై తహసిల్దారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా వివరాలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చూపాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో చుంచుపల్లి మండలం, బాబుక్యాంపునకు చెందిన భూక్యా వీరన్న తాను గత ఏడు సంవత్సరాలుగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు జిరాక్సు, స్టేషనరీ, ఇంటర్నెట్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నానని దాని ద్వారానే ఆధారం చేసుకుని జీవిస్తున్నాని, డీఈఓ కార్యాలయం నూతన కలెక్టరేట్ లో ఏర్పాటు చేయడం వల్ల ఉపాధికోల్పోయానని, తనకు కలెక్టరేట్ ప్రాంగణంలో కానీ బయట కానీ జిరాక్స్, ఇంటర్నెట్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం డీఆర్‌కు ఎండార్స్ చేశారు. పినపాక, భద్రాచలం నియోజకవర్గాలకు చెందిన గోదావరి నది ముంపు బాధితులు రెండు నియోజకవర్గాల్లో దాదాపు 25 వేల మంది వరద ముంపుకు గురయ్యామని, ముంపు బాధితులకు సురక్షిత ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మిస్తామని ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలైన ఆదివాసిలకు, దళితులకు, ఇతర వర్గాల నిరుపేద సామాజిక వర్గ ప్రజలకు ఇళ్ల నిర్మించాలని దరఖాస్తు చేశారు. పాల్వంచ మండలం, మంచికంటి నగర్‌కు చెందిన గురుగుంట్ల బూబమ్మ వితంతువైన తాను కొన్ని సంవత్సరాల నుండి నవభారత్ వద్ద రోడ్డు పక్కన చిన్న బడ్డీకొట్టు పెట్టుకుని టీ అమ్ముకుంటు జీవనం సాగిస్తున్నాన్నానని, ఇపుడు బడ్డీ కొట్టు తీయాలని చెప్తున్నారని, జీవనాధారం కోల్పోతున్నానని, తనకు న్యాయం చేయాలని చేసిన ఫిర్యాదును పరిశీలించిన ఆయన తగు చర్యలు నిమిత్తం కలెక్టరేట్ ఓఎస్డీకి ఎండార్స్ చేశారు. సుజాతనగర్ మండలం, సీతంపేటబంజర గ్రామానికి చెందిన గుగులోత్ మంగ్యా సర్వే నెం.1073/ రు/5లో 1.30 ఎకరం భూమి కలదని, అట్టి భూమికి 2021 సంవత్సరం నుండి రైతుబంధు నిధులు రావడం లేదని, తనకు రైతుబంధు మంజూరు చేపించాలని చేసిన ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం ధరణి కో ఆర్డినేటర్‌కు ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం, గట్టాయిగూడెం గ్రామానికి చెందిన బి.పూర్ణ చంద్రరావు పాల్వంచ మండల పరిధిలోని పెద్దమ్మతల్లి (శ్రీ కనకదుర్గ దేవాలయంలో) గతంలో జరిగిన, ప్రస్తుతం జరగున్న అభివృద్ధి పనుల్లో నిబంధనలు ఉల్లంఘించారని దేవాలయ ప్రతిష్టకు బంగం కలుగకుండా బాద్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని చేసిన ఫిర్యాదును పరిశీలించిన ఆయన తగు చర్యలు నిమిత్తం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ బహిరంగ సభకు భారీ జన సమీకరణ

- రేగా, నామా, తుమ్మల, మెచ్చా సన్నాహక సమావేశం
- పొంగులేటి వర్గం దూరం

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ నెల 18న ఖమ్మం గుమ్మంలో జరగనున్న బీఆర్ఎస్ భహిరంగ సభకు మండలాలు వారీ భారీగా జనం సమీకరణ చేయనున్నారు. ఈ మేరకు నియోజక వర్గాలు వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించే క్రమంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసారు. ఇందులో ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు హాజరై మండలాలు వారీగా బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులకు, ప్రజా ప్రతినిధులకు, ముఖ్య నాయకులకు, కీలక నేతలకు దిశా నిర్దేశం చేసారు. ప్రతీ మండలం నుండి 1000 మందికి పైగా జన సమీకరణకు ప్రయాణం ఏర్పాట్లుకు ప్రణాళికలు రూపొందించారు. కాగా ఇప్పటి వరకు పొంగులేటి వర్గంగా కొనసాగిన కొందరు ముఖ్య నాయకులు ఈ సన్నాహక సమావేశానికి దూరంగా ఉండటం విశేషం. ఈ కార్యక్రమంలో బండి పుల్లారావు, జుజ్జూరపు వెంకన్న బాబు, దొడ్డాకుల రాజేశ్వరరావు, పైడి వెంకటేశ్వరరావు, జల్లిపల్లి శ్రీరామమూర్తి, కోటగిరి సీతారామ స్వామి, జూపల్లి కోదండ వెంకట రమణారావు, సంక ప్రసాద్ రావు, కాసాని చంద్రమోహన్, మందపాటి రాజమోహన్ రెడ్డి, మోటూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) మాజీ సర్పంచ్ మృతి

- కారం వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటు
- రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-చర్ల

సీపీఐ(ఎం) మాజీ సర్పంచ్, మండల కార్యదర్శి తండ్రి కామ్రేడ్ కారం వెంకటేశ్వర్లు ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా ఆరోగ్యంతో బాధపడుతూ.. సత్యనారాయణపురంలో తన స్వగృహం వద్ద మృతి చెందారు. కారం వెంకటేశ్వర్లు సీపీఐ(ఎం) పార్టీకి ఎంతో విధేయుడుగా ఉంటూ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన ఆరోగ్య సమస్యతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని మచ్చ తెలిపారు. తొలుత కారం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మండల కమిటీ సభ్యులతో సందర్శించి అరుణ పతాకం కప్పి ఘనంగా నివాళులర్పించారు. సుమారు 70 సంవత్సరాలు ఉన్న మృతుడు కారం వెంకటేశ్వర్లు ఒక టర్మ సిపిఎం సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టడమే కాక పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ తన తనయుడు కారం నరేష్ ను పార్టీలో ఉంచి హెూల్ టైమర్‌గా బాధ్యతలు చేపట్టాలని సూచించి పార్టీకి విశ్వాస పాత్రుడుగా కారం నిలిచాడని మచ్చా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బ్రహ్మాచారి, మండల కమిటీ సభ్యులు రాంపండు, మచ్చా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి, దొడ్డి హరినాగవర్మ, పామారు బాలాజీ, కొమరం లక్ష్మి, సిఐటియూ నాయకులు, సిపిఎం పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఖమ్మం సభ అపూర్వ ఘట్టం

- తండోపతండాలుగా కదలాలి
- బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నేత, ఎంపీ నామ పిలుపు
- తెలంగాణా అంటేనే అభివృద్ధి, సంక్షేమం





నవతెలంగాణ-పాల్వంచ

18న ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ భారీ బహిరంగ ఖమ్మం సభ అపూర్వ ఘట్టం కావాలని తండోపతండాలుగా కదలి రావాలని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు, రైతులకు, విద్యార్థి, యువజన, మహిళా లోకానికి పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్వగృహంలో వనమా అధ్యక్షతన జరిగిన సభ సన్నాహక సమావేశంలో నామ మాట్లాడారు. చరిత్రాత్మకమైన ఖమ్మం సభ దేశ రాజకీయాలకు మార్గదర్శకం చేస్తుందని అన్నారు. నేడు దేశం యావత్తు చూపు ఖమ్మం సభ వైపే ఉందని తెలిపారు. చైతన్యవంతమైన ఖమ్మం జిల్లా ప్రజలు సభకు పెద్ద ఎత్తున హాజరై తమ సత్తా చాటాలన్నారు. తెలంగాణా అంటే అభివృద్ధి, సంక్షేమం అన్నారు. నేడు దేశం యావత్ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మోడల్ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తుందన్నారు. తెలంగాణా అభివృద్ధిని చూసి కుట్రలతో కేంద్రం తెలంగాణను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. నిధులు, ప్రాజెక్టులు ఇవ్వకుండా, విభజన హామీలు ఏ ఒక్కటి ఇవ్వకుండా వివక్షత చూపిస్తుందన్నారు. కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక బిల్లును పార్లమెంటులో తీవ్రంగా అడ్డుకున్నట్లు నామ చెప్పారు. అయితే మెజార్టీ ఉందని, పార్లమెంట్‌లో ఆమోదించిందని, కానీ లక్షలాది మంది రైతులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళన చేయడంతో బిల్లును కేంద్రం వాపసు తీసుకుందని నామ గుర్తు చేశారు. ప్రధాని రైతులకు క్షమాపణ చెప్పారని అన్నారు. సీఎం కేసీఆర్ తన గొంతిలో ప్రాణం ఉన్నంత వరకు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారని అన్నారు. ఇది రైతు ప్రభుత్వం అని నామ అన్నారు. ఈ సందర్భంగా నామను గజ మాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మాజీ మంత్రి బసవరాజు సారయ్య, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కంచర్ల చంద్రశేఖర్ రావు, కావు సీతాలక్ష్మి, కిలారు నాగేశ్వరరావు, భూక్యా రాంబాబు, బరపటి వాసుదేవరావు, బిందు చౌహాన్, బత్తుల వీరయ్య, వెంకట్రావ్, మండే హన్మంతరావు, కొత్వాల శ్రీనివాసరావు, డిండిగాల రాజేందర్, రాజుగౌడ్, సరస్వతి, శాంతి, జగన్, రజాక్, కాసుల వెంకట్, మహిపతి రామలింగం, విశ్వనాధం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాబందుల్లా పీక్కుతింటున్న వైద్యులు

- మెడికల్ మాఫియా అడ్డాగా మారిన భద్రాచలం ఆస్పత్రులు
- పద్ధతి మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు
- మావోయిస్టు పార్టీ కార్యదర్శి ఆజాద్ హెచ్చరిక



నవతెలంగాణ-చర్ల

మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన భద్రాచలం ఇప్పుడు మెడికల్ మాఫియాకు కాసులు కురిపిస్తోందని భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే-ఏఎస్ఆర్) కార్యదర్శి ఆజాద్ విమర్శించారు. ఆ మేరకు సోమవారం చర్ల పాత్రికేయులకు ఓ లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో ముఖ్యంగా భద్రాచలం ప్రాంతం పూర్తి ఏజెన్సీ ప్రాంతం కావడంతో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని సంపాదనే ధ్యేయంగా ఆసుపత్రులు పనిచేస్తున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని బూచిగా చూపి వారిని భయభ్రాంతులకు గురిచేసి రోగుల రక్తం పిండుకుంటున్నారని ఆ లేఖలో ఆజాద్ ధ్వజమెత్తారు. ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, ఆంధ్ర ప్రాంత గిరిజనులు, గిరిజనేతరులతో పాటు స్థానిక తెలంగాణ ప్రాంత ప్రజలను వైద్యం౦ ఎరుతో రోజుల తరబడి ఆసుపత్రుల్లో ఉంచి అవసరం లేకున్నా రకరకాల పరీక్షలు చేస్తూ ల్యాబులు, ఆస్పత్రులు, వైద్యులు ప్రజలను డబ్బుల కోసం హింసిస్తున్నారన్నారు. ప్రజల నమ్మకానికి తూట్లు పొడుస్తూ కొందరు వైద్యులు రాక్షసుల్లా తయారయ్యారని, పెద్దోళ్లు.. పేదోళ్లనే తేడాలు లేకుండా రోగుల రక్తం జలగల్లా పీల్చుతున్నారన్నారు. ఆరోగ్య సమస్యలను అలుసుగా చేసుకుని, మనిషిలో రకరకాల పరీక్షల పేర్లతో భయాన్ని సృష్టిస్తూ ఆసుపత్రి వర్గాలు గందరగోళంను సృష్టిస్తూ జేబులు నింపుకుంటున్నాయన్నారు. ప్రైవేటు ఆసుపత్రి మొదలుకొని ప్రభుత్వ ఆసుపత్రి వరకు కాసుల కక్కుర్తి మరిగిన వైద్యులు జనాలను పీడించుకుతింటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలలో పని చేసే వైద్యులు సైతం తమ సొంత క్లీనిక్లకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ ప్రభుత్వ పనివేళలను విస్మరిస్తున్నారని, సమయానికి రోగికి అందించాల్సిన వైద్యాన్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల్లో లేనిపోని అబద్ధపు అపోహలతో భయాన్ని పెంచి తమ సొంత క్లీనిక్స్ కి తరలించుకుం టున్నారన్నారు. ప్రధానంగా మెడికల్ మాఫియాగా మారిన వైద్య వృత్తి ఫార్మ కంపెనీలతో జతకడుతూ తక్కువ ధరకు అమ్మాల్సిన మందులను బ్రాండుల పేర్లతో ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఇక్కడి వైద్యులు మనుషులని కరెన్సీ నోట్లు ముద్ర వేసే యంత్రాల్లా భావిస్తూ నోటికి వచ్చిన టెస్టుల పేర్లు చెప్తూ.. చేతికి వచ్చిన ఖరీదైన మందుల రాస్తూ పేద ప్రజలను రాబందుల్లా పీక్కుతింటున్నారని ఆ లేఖలో ఆజాద్ దుయ్యబట్టారు.

భద్రాచలం మెడికల్ మాఫీయాకు హెచ్చరిక

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు వారి సమయాన్ని పూర్తిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేటాయించకుండా ఇలానే ప్రవర్తిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గిరిజన ప్రాంతమైన భద్రాచలం ప్రాంతంలో సంపాదనే ధ్యేయంగా ప్రయివేటు ఆసుపత్రులను ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో నివసించే గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కోట్లకు పడగెత్తిన వైద్యులు, ల్యాబ్, మెడికల్ షాప్‌ల యజమానులు తమ పద్ధతిని మర్చుకొక పోతే ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు.



అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ వినతి

నవతెలంగాణ-పాల్వంచ

అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే మార్చి నెలలో సమ్మెకు సిద్ధమవుతామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే.సత్య అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనియెడల మార్చి ఒకటి రెండు మూడు తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ధనలక్ష్మి జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా రవి కుమార్, భూక్య రమేష్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమానికి ఆశాలకు అదనంగా పారితోషకాలు చెల్లించాలి

కంటి వెలుగు కార్యక్రమానికి ఆశాలకు అదనంగా వారితోషకాలు చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేసి, మాట్లాడారు. టీఏడీఏ సదుపాయం కల్పించాలణీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అదనపు పారిదోషకం పైన ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆశాలు ఆందోళన చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే.సత్య, జిల్లా కమిటి సభ్యులు దొడ్డ రవి కుమార్, భూక్య రమేష్ పాల్గిన్నారు.

తాత్కాలిక అవసరాలు కోసం వెంపర్లాడితే బజారు పాలు అవుతారు

- మాజీ మంత్రి తుమ్మల

నవతెలంగాణ-అశ్వారావుపేట

అభివృద్ధి చేసిన వారిని, పురోభివృద్ధికి పాటు పడే వారిని వదలేసి తాత్కాలిక అవసరాలు కోసం వేరే వారి కోసం వెంపర్లాడితే బజారు పాలు అవుతారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల 18న గుమ్మంలో నిర్వహించనున్న భహిరంగ సభకు భారీ జన సమీకరణ కోసం ఆదివారం అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న తుమ్మల నాగేశ్వరరావు హాజరైన ముఖ్య నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి పై విధంగా వ్యాఖ్యానించారు. డబ్బులు ఇచ్చి తరలించిన జనం సభ మధ్యలోనే తిరుగు ప్రయాణం అవుతుంటారని అభిప్రాయపడ్డారు. 18న జరిగే సభను విజయవంతం చేసి బీఆర్ఎస్ ప్రతిష్టను దేశవ్యాప్తంగా ప్రదిర్శించాలని కోరారు. జన సమీకరణకు ఎలా ఏర్పాట్లు చేయాలని అనే విషయాలను ఎంపీ నామా నాగేశ్వరరావు పర్యవేక్షిస్తారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, అయిదు మండలాలు అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య నాయకులు, కీలక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు స్థిరమైన జీవనోపాధిని అందిస్తూ...

చిజామి వీవ్స్... నాగాలాండ్ మహిళలకు జీవనోపాధిని కల్పిస్తున్న ఓ సంస్థ. గతంలో కేవలం తమ ఇంటికి మాత్రమే పరిమితమైన నేత పని ఇప్పుడు వ్యాపారంగా మార్చుకున్నారు. సాంప్రదాయ, సమకాలీన నాగా వస్త్రాలను తయారు చేసే 600 మంది మహిళలు జీవనోపాధి అవకాశాలను పొందారు. ఒకప్పుడు కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారు ఇప్పుడు స్థిరమైన జీవనోపాధిని పొందేలా చేసేందుకే అత్షోల్ థోపి సంస్థను ప్రారంభించింది. ఆ వివరాలేంటో మనమూ తెలుసుకుందాం.



కుటుంబాన్ని పోషించుకోడానికి నాగాలాండ్ మహిళలకు వ్యవసాయమే ఆధారం. మిగిలిన సమయాలలో వారికి ఉపాధి అవకాశాలు అతి తక్కువగా ఉన్నాయి. వారి కోసమే 2008లో ప్రారంభించబడింది చిజామి వీవ్స్. ఇది నాగాలాండ్ మహిళలకు స్థిరమైన ఉపాధిని కల్పించే లక్ష్యంతో ఏర్పడిన ప్రాజెక్ట్. ప్రతి ఇంట్లో పోర్టబుల్ నడుము మగ్గాన్ని ఆపరేట్ చేయడంలో మహిళల నైపుణ్యాలను ఇది మెరుగుపరుస్తుంది. ఇంతకు ముందు వారు కేవలం తమ కుటుంబ అవసరాల కోసమే మగ్గం పని చేసేవారు. "ప్రతి ఇంటిలో నేత కార్మికులు ఉంటారు. వారు వారి తల్లులు, పెద్దల నుండి నైపుణ్యాలను నేర్చుకుంటారు" అని చిజామి వీవ్స్‌లో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అత్షోల్ థోపి అంటున్నారు. నేడు చిజామి వీవ్స్ నాగాలాండ్‌లోని వివిధ ప్రాంతాల నుండి 600 మంది మహిళా నేత కార్మికుల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. వీరు కుషన్ కవర్‌లు, బ్యాగులు, సాంప్రదాయ శాలువాలు, మేఖలా (ర్యాప్ స్కర్ట్) మొదలైన వాటిని సమకాలీన, గిరిజన నాగా డిజైన్‌లలో తయారు చేస్తారు.



స్థిరమైన జీవనోపాధి

చిజామి వీవ్స్ అనేది NENterprise చొరవ. ఇది ఎన్‌జీఓ నార్త్ ఈస్ట్ నెట్‌వర్క్ (NEN) ద్వారా ట్రస్ట్‌గా నమోదు చేయబడిన ఒక ప్రత్యేక సంస్థ. NEN 1995లో ఈశాన్య భారతదేశంలో అభివృద్ధి, సామాజిక, లింగ సమానత్వం, పర్యావరణ న్యాయం వంటి సమస్యలపై దృష్టి సారించే మహిళా హక్కుల సంస్థగా ప్రారంభించబడింది. మూడు సంవత్సరాల తర్వాత నాగాలాండ్‌లోకి ప్రవేశించి ఫేక్ జిల్లాలోని చిజామి గ్రామంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించింది. ఇది లింగ వివక్ష, పాలన, సహజ వనరుల నిర్వహణ రంగాలలో కూడా పని చేస్తుంది. మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించాల్సిన అవసరం చిజామి వీవ్స్ పుట్టుకకు దారితీసింది. 2010లో రూ. 5 లక్షల ప్రారంభ నిధులను పొందిన ఈ ప్రాజెక్ట్‌కు గ్లోబల్ ఫండ్ ఫర్ ఉమెన్, ఫోర్డ్ ఫౌండేషన్, NEN కింద మద్దతిచ్చే ఫోర్డ్ ఫౌండేషన్, నాగాలాండ్ ప్రభుత్వ మహిళా అభివృద్ధి విభాగం నుండి సహాయం అందించబడింది.

కొంతమంది ఎగతాళి చేసారు

చిజామి గ్రామానికి చెందిన ఏడుగురు నేత కార్మికులతో చిజామి వీవ్స్ ప్రారంభించబడింది. వీరు వాణిజ్యపరంగా నేయడానికి నిపుణులైన నేత కార్మికులచే శిక్షణ పొందారు. డిజైన్‌లను తొలుత నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌కు చెందిన విద్యార్థులు తయారు చేశారు. అయినప్పటికీ చాఖేసాంగ్ తెగకు చెందిన మహిళా నేత కార్మికులు తమ గిరిజన రంగులు, డిజైన్‌లకు వెలుపల బట్టలు నేయడం మొదట్లో బేసిగా భావించారు. "ప్రారంభంలో మహిళలు నలుపు, తెలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు రంగులకు మాత్రమే అలవాటు పడ్డారు. అవి వారి గిరిజన రంగులు. మేము అభివృద్ధి చేస్తున్న కుషన్‌ల రంగుల డిజైన్‌లను చూసి కొంతమంది మహిళలు ఎగతాళి చేసారు, నవ్వారు" అని 2005లో NENలో చేరి నేత ప్రాజెక్ట్‌ను నిర్వహిస్తున్న అటోషోల్ చెప్పారు. ప్రస్తుతం దాదాపు 60శాతం మంది మహిళా నేత కార్మికులు నెలకు రూ. 5,000-రూ. 6,000 మధ్య ఎక్కడైనా సంపాదిస్తున్నారు. ఈ చొరవ చాలా మందికి జీవనోపాధిని అందించడానికి చేనేతను మాత్రమే ఉపయోగించుకుంటుంది. నేత కార్మికులు ఉపయోగంలేని వాటిని ఉత్పత్తి చేసినప్పటికీ వారికి డబ్బు చెల్లిస్తుంది. "మేము ప్రతి స్త్రీకి జీవనోపాధిని అందించాలి. కానీ అందరు మహిళలు నేతలో నిపుణులు కాదు. నాణ్యమైన ఉత్పత్తులను చేయడానికి సమయాన్ని వెచ్చించలేరు.

> "మహిళలు కూడా తమ ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటారు. వారు తమ ఆలోచనలను పంచుకోవడానికి, వారి హక్కులను తెలుసుకోవడానికి, వారి కుటుంబాలలో తమ కోసం తాము మాట్లాడుకోవడానికి నెమ్మదిగా అలవాటుపడుతున్నారు"



కాబట్టి మేము తరచుగా యువతుల నుండి ఉపయోగం లేని ఉత్పత్తిని పొందుతాము. కాని మేము వారి పనిని తిరస్కరించలేము" ఆమె జతచేస్తుంది.

ఖర్చులు ఎక్కువగా ఉంటాయి

చాలా మంది మహిళలు వ్యక్తిగతంతో పాటు సంఘం కార్యకలాపాలకు ప్రాధాన్యతనిస్తాయి. చిజామి వీవ్స్ వారి ఇళ్ల నుండి నేయడానికి, తుది కుట్టు, అసెంబ్లీ కోసం చిజామి గ్రామంలోని దాని కేంద్రానికి ఉత్పత్తులను తీసుకురావడానికి వీలు కల్పిస్తుంది. అయితే మోడల్ దాని సొంత సవాళ్లతో కూడా వస్తుంది. ఫేక్ జిల్లాలోని 17-18 గ్రామాలలో, అలాగే కొహిమా, షామటోర్ జిల్లాలో అనేక మంది నేత కార్మికులు నివసిస్తున్నందున ఆరుగురు సభ్యుల బృందం నాణ్యత నియంత్రణను నిర్వహించడం కష్టంగా ఉంది. రవాణా ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. డెలివరీ తరచుగా ఆలస్యం అవుతుండటంతో ఢిల్లీ, దిమాపూర్ లేదా కోహిమా నుండి ముడిసరుకును సోర్సింగ్ చేయడంలో బృందం లాజిస్టికల్ సవాళ్లను ఎదుర్కొంటుంది.

స్థానిక మార్కెట్‌కు విక్రయిస్తుంది

"కొన్నిసార్లు మన దగ్గర నూలు అయిపోతుంది. మేము దానిని కోహిమా లేదా దిమాపూర్ నుండి వెంటనే కొనుగోలు చేయలేము. అవసరమైన రంగుల ప్రకారం బయటి నుండి ఆర్డర్ చేయాలి, ఇది నేత కార్మికులకు ఇవ్వబడిన ఆర్డర్‌లను ఆలస్యం చేస్తుంది" అని అత్షోల్ చెప్పారు. ఉత్పత్తులు మూడు రోజుల (కుషన్ కవర్‌లను తయారు చేయడానికి) నుండి 15 రోజుల వరకు (మెఖ్లా కోసం) ఎక్కడైనా పట్టవచ్చు. ఇవి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఛానెల్‌ల ద్వారా విక్రయించబడతాయి. బృందం ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫోన్ కాల్‌ల ద్వారా ఆర్డర్‌లను తీసుకుంటుంది. ఇది స్థానిక మార్కెట్‌లకు విక్రయిస్తుంది. కొహిమాలో దుకాణాన్ని కలిగి ఉంది. ఈ ప్రాజెక్ట్ వార్షిక టర్నోవర్ రూ.50 లక్షలు.



సంఘ స్వభావాన్ని కూడా

హైస్కూల్ తర్వాత NENలో చేరిన అత్షోల్ మహిళలు తమ కుటుంబాలను పోషించుకోవడానికి, పిల్లల చదువులకు క్రమమైన ఆదాయం పొందడానికి ఎదుర్కొంటున్న సవాళ్లే ఈ ప్రాజెక్ట్‌ను కొనసాగించడానికి ఆమెను ప్రేరేపించింది. చిజామి గ్రామంలోని చేనేత కార్మికురాలైన త్సెఖోలౌ మాట్లాడుతూ "నా భర్త మొదట్లో నా నేత పనిని అంగీకరించలేదు. కానీ నేను ఇంటికి తీసుకురావడం ప్రారంభించిన నగదుతో నాపై గౌరవం పెరిగింది. ఇప్పుడు అతను ఇంటి పనులన్నింటిలో నాకు సహాయం చేస్తాడు" అని చెప్పింది. కానీ చిజామి వీవ్స్ కేవలం జీవనోపాధి అవకాశం కంటే ఎక్కువ ఇది సంఘ స్వభావాన్ని కూడా అందిస్తుంది. "చాలా మంది స్త్రీలకు వ్యక్తిగత సమస్యలు, వారి కుటుంబాలతో సత్సంబంధాలు ఉన్నాయి. ఇంట్లో లేదా సమాజంలో వారు జీవితంలో సవాళ్లను ఎదుర్కొన్నప్పుడల్లా మేము వారిని ప్రోత్సహించగలం. వారిని ప్రేరేపించగలం" అని ఆమె జతచేస్తుంది.

ఆలోచనలను పంచుకోవడానికి

నిపుణులైన నేత కార్మికులు, కమ్యూనిటీ కార్యక్రమాలు, ప్రదర్శనల నుండి శిక్షణ, అభ్యాస అవకాశాల ద్వారా మహిళలు తమ విశ్వాసాన్ని పెంచుకోగలుగుతారు. "మహిళలు కూడా తమ ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటారు. వారు తమ ఆలోచనలను పంచుకోవడానికి, వారి హక్కులను తెలుసుకోవడానికి, వారి కుటుంబాలలో తమ కోసం తాము మాట్లాడుకోవడానికి నెమ్మదిగా అలవాటుపడుతున్నారు" అత్షోల్ అంటుంది. ఆధునిక విద్యతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను సంప్రదాయ నేతను నేర్చుకోమని ప్రోత్సహించరు. కానీ చిజామి వీవ్స్ ఆ నైపుణ్యాలను, జ్ఞానాన్ని సజీవంగా ఉంచుతోంది. ఇప్పుడు చాలా మంది అమ్మాయిలు, వివాహిత యువతులు కూడా నేత నేర్చుకోవడం ప్రారంభించారు. చిజామి వీవ్స్ ఇప్పుడు సరైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం, ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌ను నిర్మించడం, మార్కెట్ లైన్లను విస్తరించడం, సేంద్రీయ సాంప్రదాయ పత్తి ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి సారిస్తోంది.

కొలీజియంలో ప్రభుత్వాన్ని చేర్చాలి

న్యూఢిల్లీ : న్యాయవ్యవస్థ స్వతంత్రతను ప్రశ్నార్థకం చేసే విధంగా కేంద్రం అడుగులు వేస్తోంది. న్యాయమూర్తుల నియామకాల వ్యవహారంలో సుప్రీంకోర్టు, మోడీ సర్కార్‌కు మధ్య విభేదాలు మరింతగా ముదిరాయి. న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధులను చేర్చుకోవాలంటూ కేంద్ర న్యాయశాఖమంత్రి కిరణ్‌రిజిజు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాశారు. న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన రాజ్యాంగ ప్రక్రియలో ప్రభుత్వ ప్రతినిధులకు చోటు కల్పించాలని రిజిజు ఈ సందర్భంగా కొత్త వాదానికి తెరలేపారు. జడ్జీల నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం గురించి ప్రజలకు తెలియజేయడం అవసరమని ఆయన లేఖలో ప్రస్తావించినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

ప్రస్తుతం దేశంలో న్యాయమూర్తులను నియమిస్తున్న కొలీజియం వ్యవస్థ రాజ్యాంగానికి అతీతమన్నట్టు ఇటీవల కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలతో కేంద్రం, సుప్రీంకోర్టు మధ్య అభిప్రాయభేదాలు మొదలయ్యాయి. న్యాయస్థానాల్లో కొండల్లా పేరుకుపోయిన కేసులకు కొలీజియం వ్యవస్థే కారణమన్నట్టు కేంద్ర మంత్రి తరుచూ వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు..న్యాయమూర్తుల ఎంపికను కేంద్రం ఉద్దేశపూర్వకంగా పెండింగ్‌లో ఉంచుతోందని, సబార్డినేట్ కోర్టుల న్యాయమూర్తుల పోస్టులు లక్షల సంఖ్యలో ఖాళీలు ఏర్పడటం వెనుక కొలీజియం పాత్రమేముందని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నలు సంధిస్తోంది. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ కూడా ఇటీవల సుప్రీంకోర్టును లక్ష్యంగా చేసుకొని సంచలన వ్యాఖ్యలు చేశారు. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)ని కొట్టేయడం ద్వారా ప్రజలెన్నుకున్న పార్లమెంటు సార్వభౌమత్వాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చిందని ఉపరాష్ట్రపతి విమర్శించడం ఈ వివాదాన్ని మరింత తీవ్రం చేసింది. అయితే ఈ విమర్శలకు సుప్రీంకోర్టు కూడా దీటుగా బదులిచ్చింది. కొలీజియం నచ్చకపోతే ఇంకో వ్యవస్థను తీసుకురావాలని కేంద్రంపై అసహనం వ్యక్తం చేసింది. కొలీజియం పునరుద్ఘాటించిన పేర్లను కేంద్రం వెనక్కి పంపడంపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అభ్యంతరం వ్యక్తం చేయడానికి ఎలాంటి కారణాలు లేకున్నా సిఫార్సులను అడ్డుకోవటం సరికాదని పేర్కొంది.

ఒకే కుటుంబంలో నలుగురు అనుమానాస్పద మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నైకు చెందిన ప్రతాప్(34) సింధూర(32)లకు 8 ఏండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఆధ్య(4) అనే కూతురు ఉంది. ప్రతాప్ చెన్నైలో ఉంటూ బీఎండబ్ల్యూ కార్ షోరూమ్‌లో డిజైనర్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సింధూర తన కూతురు ఆద్య, ప్రతాప్ తల్లి రాజాతి(69) తార్నాకలోని రూపాలి అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో నివాసముంటున్నారు. ప్రతాప్ వీకెండ్స్‌లో హైదరాబాద్‌కు వచ్చి వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం బయటకు వెళ్లిన ప్రతాప్ దంపతులు ఆదివారం రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చినట్టు తెలిసింది. అయితే సోమవారం మధ్యాహ్నం వరకు సింధూర బ్యాంకుకు వెళ్లకపోవడంతో సిబ్బంది బ్యాంక్ నుంచి ఆమెకు కాల్ చేసినా స్పందించలేదు. దాంతో బ్యాంక్ నుంచి ఓ ఉద్యోగి సింధూర ఇంటికి వచ్చి తలుపు తట్టినా తెరవలేదు. అనుమానం వచ్చిన ఆ వ్యక్తి సమీపంలోని అపార్మెంట్‌లో ఉండే వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. సింధూర కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి చూడగా, ప్రతాప్ ముందు హాలులో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. ఒక బెడ్ రూమ్‌లో సింధూర, ఆమె కూతురు ఆద్య, మరో బెడ్ రూమ్‌లో ప్రతాప్ తల్లి పడిపోయి ఉన్నారు. ప్రతాప్, ఆద్య, ప్రతాప్ తల్లి రాజాతి అప్పటికే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న సింధూరను గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఓయూ ఇన్స్పెక్టర్ రమేష్ నాయక్ తెలిపారు. సింధూర ఏడేండ్లుగా బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగం చేస్తున్నది. నాలుగేండ్లు చెన్నైలో పనిచేసిన ఆమె అనంతరం హైదరాబాద్‌కు వచ్చి కొంత కాలం తార్నాకలో బ్యాంక్ ఆఫ్ బరోడాలో విధులు నిర్వహించి ఇటీవల హిమాయత్ నగర్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యింది. వారి మృతికి కారణాలు ఏంటనేది తెలియాల్సి ఉంది.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై రెండ్రోజుల్లో షెడ్యూల్

(మొదటిపేజీ తరువాయి)

వారీగా విడివిడి సమావేశాలను ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకేసారి బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు మంత్రులు అంగీకారం తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్ అన్ని కలిపి 11,000 ప్రమోషన్స్ వస్తాయి. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టుల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 960 పోస్టులకు పాత పద్దతిలో పదోన్నతులు ఇస్తారు. అప్‌గ్రేడ్ పోస్టులు 10, 479 పై కోర్టు కేసు పరిష్కారం అయిన వెంటనే కోర్టు ఆదేశాల ప్రకారం వాటికి ప్రమోషన్స్ ఇస్తారు.

జీఓ158 ప్రకారం ఎంఈఓ, డైట్ లెక్చరర్ ప్రమోషన్లను కూడా ఇవ్వాలని కోరగా, ప్రాతినిధ్యాన్ని పరిశీలించి న్యాయ సలహా తీసుకుని షెడ్యూల్‌లో చేర్చాలని విద్యాశాఖ అధికారులను మంత్రులు ఆదేశించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, కేజీబీవీ బదిలీలు కూడా చేస్తామనీ, పదిరోజుల్లో షెడ్యూల్ ఇస్తామని స్పష్టం చేశారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరుపుతామని సంఘాలు సహకరించాలని కోరారు. జీఓ 317 బాధితుల



గురించి ప్రస్తావించగా బదిలీలకు ముందుగానే సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. పండుగ రోజు శుభవార్త చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశామని మంత్రులు చెప్పారు. ఈ సమావేశంలో యుఎస్పీసీ తరఫున కె.జంగయ్య, చావ రవి, వై.అశోక్ కుమార్, ఎం.రవీందర్, ఎన్.యాదగిరి, ఎస్. హరికిషన్, బి.కొండయ్య, రామలింగం, టి.లక్ష్మారెడ్డి, పి.మాణిక్ రెడ్డి, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు. ఎస్‌టీయూటీఎస్‌తో జరిగిన సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సదానందంగౌడ్, యం.పర్వత్‌రెడ్డి పాల్గొన్నారు. వేర్వేరు సంఘాలతో జరిగిన సమావేశాల్లో తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునగాల మణిపాల్‌రెడ్డి, డాక్టర్ ఏడుకొండ నరసింహస్వామి, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూలరవీందర్, టీటీజేఏసీ ప్రతినిధులు రాజభాను, గంగారెడ్డి, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మహిపాల్‌రెడ్డి, ఎ.వెంకటేశం, వనం వెంకటేశ్వర్లు, ఆర్‌యూపీపీటీఎస్ ఎస్సీఎస్టీటీఎఫ్-టి ఫెడరేషన్ జె.రాజన్న, ఎం.చరణ్‌దాస్, తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని సంఘాలను ఆహ్వానించకపోవడం శోచనీయం : డీటీఎఫ్

ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై చర్చించేందుకు అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించకపోవడం సరిగాదని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని మొదట గుర్తించిన సంఘాన్ని పిలువకపోవడం అన్యాయమని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలనీ, అధికారిక సమావేశాలు జరిపేటప్పుడు పద్ధతి ప్రకారం ఆహ్వానించాలని కోరారు. అప్‌గ్రేడ్ భాషా పండితులు, పీఎస్‌హెచ్ఎం పోస్టులు మంజూరు చేయకుండా పదోన్నతులు ఇవ్వడం సరిగాదనీ, దాని వల్ల ఉపయోగం లేదని టీఎస్పీటీఏ పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం(టీఎస్పీటీఏ) రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్ అలీ ఒక ప్రకటన విడుదల చేశారు.


హైదరాబాద్‌లో సీఎఫ్ఐఆర్ ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

సంరక్షణలో గ్లోబల్ పవర్ హౌస్ గా ఇండియా మారుతుందన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం హెల్త్ కేర్ విభాగాధిపతి డాక్టర్ శ్యామ్ బిషెన్ తదితరులు పాల్గొన్నారు.

స్విట్జర్లాండ్‌లో మంత్రి కేటీఆర్ బృందానికి ఘనస్వాగతం

అంతకుముందు మంత్రి కే తారకరామారావు బృందం జ్యూరిక్ సిటీ చేరుకోగానే స్విట్జర్ల్యాండ్ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షులు శ్రీధర్ గండె, ఇతర తెలుగు సంఘాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో మంత్రి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మంత్రి కేటీఆర్ వివరించారు.



ఖమ్మం సభ చారిత్రాత్మకం

(మొదటిపేజీ తరువాయి)

మాజీ సీఎం అఖిలేష్, సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సీపీఐ(ఎం), సిపిఐ రాష్ట్రకార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు హాజరు కానున్నట్టు తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు అందరు వేదికపై ఉంటారని అన్నారు. ఈ సభకు ఖమ్మం జిల్లాతోపాటు, 100 కిలోమీటర పరిధిలో ఉన్న డోర్నకల్, మహబూబాబాద్, పాలకుర్తి, సూర్యాపేట, కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల నుంచి కూడా ప్రజలు తరలి రానున్నారని వివరించారు.

18న జరగనున్న భారీ బహిరంగసభను 100 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తున్నామని, 448 ఎకరాల్లో 20 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామన్నారు. వెయ్యి మంది వాలంటీర్లు సభలో అందుబాటులో ఉంటారని తెలిపారు. సభకు ఐదు లక్షల మంది పైగా ప్రజలు హాజరు కానున్నారని, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే 3 లక్షలకు పైగా వస్తారని అంచనా వేస్తున్నామని, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలు, పాలకుర్తి నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి రానున్నారని అన్నారు. సభకు వచ్చేందుకు ప్రజలనుంచి అపూర్వ స్పందన వస్తుందని, కానీ వాహనాలు దొరకటంలేదని అన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వాహనాలు తెప్పిస్తున్నామని తెలిపారు.

నేడే ముగ్గురు ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు రాక

ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు 17న రాత్రికే హైదరాబాద్ చేరుకుంటారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 18న ఉదయం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో ముగ్గురు ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు చర్చలు జరుపుతారని చెప్పారు. యాదాద్రి దర్శనం చేసుకొని, అనంతరం రెండు హెలికాప్టర్లలో ఖమ్మం చేరుకుంటారని తెలిపారు. ఖమ్మం నూతన కలెక్టరేట్ ప్రారంభం తర్వాత ఖమ్మం కలెక్టరేట్‌లో రెండవ విడత కంటి వెలుగు ప్రారంభిస్తారని, సభ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. కళాకారులకు ప్రత్యేక వేదిక ఉంటుందని, రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు, పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధు, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, రాములు నాయక్, జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజ్, డీసీసీబీ చైర్మెన్ కూరాకుల నాగభూషణం, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, చంద్రావతి, చింతనిప్పు కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం కుదిరింది

(మొదటిపేజీ తరువాయి)



వెలుపల ఐదు శాతం, బయట మరో ఐదు శాతం పనులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. సచివాలయానికి ఇప్పటికే రంగులు సైతం వేస్తున్నారు. లైటింగ్ అమర్చారు. గుమ్మటాలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. లైటింగ్‌తో రాత్రిపూట సచివాలయం ఆకర్షణీయంగా కనిపిస్తున్నది. లోపల ఆరో అంతస్తులో ఉన్న సీఎం ఛాంబర్‌తోపాటు కార్యాలయం, అలాగే చీఫ్ సెక్రెటరీతో పాటు మంత్రుల ఛాంబర్లు, సమావేశ మందిరం, మంత్రుల పేషీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ఇతర సెక్షన్ల కార్యాలయాల పనులు కొలిక్కి వస్తున్నట్టు అధికారిక సమాచారం. దాదాపు రూ. 750 కోట్లతో సచివాలయం పనులు చేపట్టారు. నిజానికి గత ఏడాది దసరా పండుగ నాటికే సచివాలయం ప్రారంభించాల్సి ఉంది. కరోనా, మ్యాన్ పవర్ లేమీ తదితర ఆటంకాలు ఎదురైనట్టు అర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు. కోవిడ్ అనంతరం మూడు షిఫ్టుల్లో పనులు శరవేగంగా చేయించిన సంగతి తెలిసిందే. నీటి సరఫరాకు సంబంధించి జర్మన్ టెక్నాలజీని సమకూర్చుకున్నారు. అలాగే అమెరికా నుంచి సచివాలయానికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఇతర వస్తువులను దిగుమతి చేసుకున్నారు. దీనికోసం అధికారులు అమెరికా పర్యటన వెళ్లిన విషయం విదితమే. తేదీ నిర్ణయించడంతో సంబంధిత శాఖ అధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. చివరల్లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తిచేసి మూడు, నాలుగు రోజుల ముందే సచివాలయాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసేందుకు అధికార యంత్రాంగం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ప్రారంభోత్సవంలోగా మరోసారి సీఎం కేసీఆర్ కొత్త సచివాలయాన్ని సందర్శించే అవకాశం ఉందని సమాచారం. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అత్యున్నత ప్రమాణాలతో నిర్మాణం చేపట్టినట్టు ఆర్ అండ్ బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఐ.గణపతిరెడ్డి చెప్పారు. అలాగే సీఎం కేసీఆర్ ప్రారంభించే ఈ సచివాలయానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పెట్టిన సంగతి అందరికి తెలిసిందే. మొదట సికింద్రాబాద్‌లోని ఆర్మీగ్రౌండ్స్‌లో సచివాలయాన్ని నిర్మించాలని సీఎం కేసీఆర్ భావించినా, కేంద్ర ప్రభుత్వం ఆ స్థలం ఇవ్వడానికి నిరాకరించిన సంగతి విదితమే. కాగా సోమవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఉన్నతాధికారులపై సచివాలయం పనులపై సమీక్ష చేశారు.

నేపాల్‌లో కూలిన విమానం

ఖాట్మండు: నేపాల్‌లో విమానప్రమాదం జరిగింది. నేపాల్ ప్యాసింజర్ విమానం ఆదివారం పొఖారా విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో 72 మంది మరణించగా, వారిలో ఐదుగురు భారతీయులు ఉన్నారు. ఇప్పటి వరకు 68 మంది మృతదేహాలు గుర్తించగా..మరో నలుగురి ఆచూకీ కనిపించలేదని అధికార వర్గాలు తెలిపాయి. కాగా విమానాలు, పరికరాలు, వాటి ధరలను సిరియమ్ ఫ్లీట్స్ డేటా సవరిస్తూ ఉంటుంది. 9ఎన్-ఎఎన్‌సీ ఎయిర్‌క్రాఫ్ట్ 2007లో కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ (ప్రస్తుతం పనిచేయని సంస్థ) వద్ద ఉన్నది. ఆరేండ్ల అనంతరం ఈ విమానాన్ని 2019లో థాయిలాండ్‌కి చెందిన నోక్ ఎయిర్ కొనుగోలు చేసింది. తర్వాత నేపాల్‌కు చెందిన యతి ఎయిర్‌లైన్స్‌కి విక్రయించింది. ఈ విమానం లీజర్ ఇన్వెస్ట్ బ్యాంక్ నిర్వహిస్తుండగా, కింగ్ ఫిషర్ టర్బో లీజింగ్ యాజమాన్యంలో ఉన్నది. ఏటీఆర్ -72 అనేది రెండు ఇంజిన్ల టర్బోప్రాప్. ఫ్రాన్స్, ఇటలీ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి.

ప్రమాద ప్రాంతం నుంచి ఈ విమానానికి చెందిన బ్లాక్ బాక్స్‌ను అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. విమాన ప్రమాదానికి కారణం.. వాతావరణం మేఘావృతం కావడంతో పాటు విజిబిలిటీ పడిపోవడం వల్లేనని ప్రాథమికంగా తేల్చారు.

సుందర ప్రకృతి దృశ్యాలకు నెలవైన నేపాల్‌లో విమాన యానం సవాళ్లతో కూడుకుంది. ఎవరెస్ట్ పర్వతం, సాగర్ మాతతో సహా ప్రపంచంలోనే 14 ఎత్తైన పర్వతాల్లో ఎనిమిది నేపాల్‌లోనే ఉన్నాయి. ఆకస్మిక వాతావరణ మార్పులతో పాటు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. 2000 సంవత్సరం నుంచి విమానాలు లేదా హెలికాప్టర్ ప్రమాదాల్లో సుమారు 350 మంది మరణించారు. 1992 తర్వాత ఆదివారం నాటి విమాన ప్రమాదం నేపాల్‌లో జరిగిన అత్యంత ఘోరమైన ప్రమాదాల్లో ఒకటని అధికారులు తెలిపారు.

ఆస్ట్రేలియా, అర్జెంటీనా మ్యాచ్ డ్రా

- నెదర్లాండ్స్ 4-0తో న్యూజిలాండ్‌పై గెలుపు
- హాకీ ప్రపంచకప్



భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 0-0తో డ్రా అయ్యింది. దీంతో గ్రూప్-డిలో ఇంగ్లండ్ అగ్రస్థానంలో ఉండగా.. భారత్ రెండో స్థానంలో కొనసాగుతోంది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్-వేల్స్‌తో, ఇంగ్లండ్-స్పెయిన్‌తో తలపడనున్నాయి.

భువనేశ్వర్: ఒరిస్సాలో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్ హాకీ పోటీల్లో నెదర్లాండ్స్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో గెలిచి నాకౌట్‌కు చేరువైంది. పూల్-సి సోమవారం జరిగిన పోటీలో నెదర్లాండ్స్ జట్టు 4-0తో న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది. దీంతో ఈ గ్రూప్‌లో నెదర్లాండ్స్ జట్టు వరుసగా 2 మ్యాచుల్లో గెలిచి 6పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో మలేషియా జట్టు 3-2 గోల్స్ తేడాతో చిలీని ఓడించింది. చిలీకి చివరి క్షణాల్లో ఒక పెనాల్టీ కార్నర్ లభించినా ఆ జట్టు గోల్ చేయడంలో విఫలమైంది. దీంతో మలేషియా 3పాయింట్లతో మూడోస్థానంలో కొనసాగుతోంది. గురువారం జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో మలేషియాతో న్యూజిలాండ్, నెదర్లాండ్స్‌తో చిలీ తలపడనున్నాయి. ఇక పూల్-ఏ తొలిమ్యాచ్‌లో ఫ్రాన్స్ జట్టు 2-1గోల్స్ తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ టెర్రీ బ్రీక్‌మన్(ఫ్రాన్స్)కు లభించింది. ఇదే గ్రూప్‌లో అర్జెంటీనా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్ 3-3గోల్స్‌తో డ్రా అయ్యింది. నాల్గో క్వార్టర్ 55వ నిమిషాల వరకు అర్జెంటీనా జట్టు 3-2గోల్స్ ఆధిక్యతలో నిలిచినా.. చివర్లో అర్జెంటీనా జట్టు ఒక గోల్ కొట్టడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. దీంతో ఆస్ట్రేలియా, అర్జెంటీనా 4పాయింట్లతో టాప్‌లో ఉండగా... ఫ్రాన్స్ జట్టు 3పాయింట్లతో మూడోస్థా నంలో ఉంది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రే లియా-దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్-అర్జెంటీనా జట్లు తలపడనున్నాయి.

నాదల్ శుభారంభం

- మెద్వదెవ్, సిట్సిపాస్ కూడా..
- ఆస్ట్రేలియన్ ఓపెన్
- మహిళల సింగిల్స్‌లో స్వైటెక్, సక్కారి గెలుపు



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్‌లో రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన రఫెల్ నాదల్ శుభారంభం చేశాడు. సోమవారం నుంచి ప్రారంభమైన ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్ పోటీలో నాదల్ 7-5, 2-6, 6-4, 6-1తో బ్రిటన్‌కు చెందిన జాక్ డ్రాపెర్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ మ్యాచ్‌లో డ్రాపెర్ గాయపడడంతో పూర్తిస్థాయి ఆటను ప్రదర్శించలేకపోయాడు. రెండోరౌండ్‌లో నాదల్ మెక్ డొనాల్డ్(అమెరికా)తో తలపడనున్నాడు. ఇతర పోటీల్లో 7వ సీడ్ డానియేల్ మెద్వదెవ్(రష్యా) 6-0, 6-1, 6-2తో గిరోన్(అమెరికా)పై, 3వ సీడ్, గ్రీక్‌కు చెందిన సిట్సిపాస్ 6-3, 6-4, 7-6(8-6)తో అన్‌సీడ్ ఫ్రాన్స్‌కు చెందిన హైస్‌పై గెలిచి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. మరో హోరాహోరీ పోటీలో మసెట్టి(ఇటలీ) 4-6, 1-6, 7-6(7-0), 6-2, 6-7(4-10)తో అన్‌సీడెడ్ హర్రిస్(దక్షిణాఫ్రికా) చేతిలో ఓటమిపాలయ్యాడు. ఇతర పోటీల్లో 6వ సీడ్ అగర్(కెనడా), 11వ సీడ్ నొర్రి(బ్రిటన్) తొలిరౌండ్ పోటీలో గెలుపొందగా.. 21వ సీడ్ కోరిక్(క్రొయేషియా) 3-6, 3-6, 3-6తో లెహెక్రా(చెక్) చేతిలో ఓటమిపాలయ్యాడు.

స్వైటెక్, కీస్ గెలుపు..

మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్ ఇగా స్వైటెక్(పోలండ్), 10వ సీడ్ కీస్(అమెరికా) రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. స్వైటెక్ 6-4, 7-5తో నేమియర్(జర్మనీ)పై సునాయాసంగా గెలుపొందగా.. కీస్ 6-4, 3-6, 6-2తో బ్లింకోవా(రష్యా)పై చెమటోడ్చి నెగ్గింది. ఇతర పోటీల్లో 32వ సీడ్ టిచ్మన్(స్విట్జర్లాండ్), 22వ రైబకినా(కజకిస్తాన్), 20వ సీడ్ క్రేజికోవా(చెక్), 17వ సీడ్ ఓస్టాపెంకో(లాత్వియా) ప్రత్యర్థులపై గెలిచారు.

ఒక్కో మ్యాచ్‌కు రూ.7.09కోట్లు

- రూ.951కోట్లకు వియకామ్ 18 సొంతం
- మహిళల ఐపిఎల్ ప్రసార హక్కులు



ముంబయి: మహిళల ఐపిఎల్ ప్రసార హక్కులకూ భారీ ధర లభించింది. బిసిసిఐ సెక్రటరీ జే షా సోమవారం ట్విటర్ వేదికగా మహిళల ఐపిఎల్ ఐదేళ్ల ప్రసార హక్కులను వియాకామ్-18 కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2023-27సర్కిల్ పరిధిలో భాగంగా వియకామ్ ఒక్కో ఐపిఎల్ మ్యాచ్‌కు రూ.7.09కోట్లు చొప్పున బిసిసిఐకి చెల్లించనుంది. ఈ ఐదేళ్ల కాలంలో వియకామ్-18 ప్రపంచవ్యాప్తంగా టెలివిజన్ ప్రసార, డిజిటల్ హక్కులు కలిగి ఉంటుంది. ప్రసార హక్కులు కొనుగోలుకు డిస్నీ స్టార్, సోనీ, జీ కూడా పోటీపడ్డాయి. ఈ ఏడాది నుంచి మహిళల ఐపిఎల్‌లో బిసిసిఐ కొత్త మార్పులకు తెరలేపనుంది. జట్ల సంఖ్యను ఐదుకు పెంచనుంది. మహిళల ఐపిఎల్‌లో ఆడే క్రీడాకారిణులు రూ.10 నుంచి రూ.50లక్షలకు రూపాయలు బేస్ ధరతో వేలం బరిలో నిలవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ క్రీడాకారిణులు మాత్రం రూ.30, 40, 50లక్షల బేస్ ధరను నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. మిగతా వారంతా మినిమమ్ రూ.10 నుంచి 20లక్షలు మాత్రమే కోట్ చేయాల్సి ఉంటుంది. ఇక మహిళల ఐపిఎల్ వేలం జనవరి 26న జరగనుంది.

షెఫాలీ మెరుపులు

- యుఏఇపై 122పరుగుల తేడాతో గెలుపు
- ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్



బెనోని(దక్షిణాఫ్రికా): అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో భారతజట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. సోమవారం యుఏఇ మహిళలతో జరిగిన పోటీలో భారత్ 122పరుగుల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన షెఫాలీ వర్మ నేతృత్వంలోని భారత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టపోయి 219పరుగులు చేసింది. ఓపెనర్లు శ్వేత(74నాటౌట్; 49బంతుల్లో 10ఫోర్లు), షెఫాలీ(78; 34బంతుల్లో 12ఫోర్లు, 4సిక్సర్లు) తొలి వికెట్‌కు 8.3ఓవర్లలో 111పరుగులు జతచేశారు. ఆ తర్వాత వికెట్ కీపర్ రీచా(49; 29బంతుల్లో 5ఫోర్లు, 2సిక్సర్లు) కూడా బ్యాటింగ్‌లో రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా మహిళలు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్లు నష్టపోయి 97పరుగులు చేయగల్గింది. మహిక(26), లావణ్య(24) బ్యాటింగ్‌లో రాణించగా.. షబ్నమ్, టిటాస్, కశ్యప్, చోప్రాకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షెఫాలీ వర్మకు లభించగా.. గ్రూప్-డిలో భారత్ ఆఖరి లీగ్ మ్యాచ్ 18న స్కాట్లాండ్‌తో తలపడనుంది.



టీమిండియా రికార్డు గెలుపు

- మూడో వన్డేలో శ్రీలంకపై 317పరుగుల తేడాతో విజయం
- సిరీస్ 3-0తో క్లీన్‌స్వీప్

తిరువనంతపురం: శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 3-0తో గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియా 317పరుగుల భారీ తేడాతో గెలిచి రికార్డు విజయాన్ని సొంతం చేసుకుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 390 పరుగులు చేయగా.. ఛేదనలో శ్రీలంక జట్టు 22 ఓవర్లలో 73పరుగులకే కుప్పకూలింది. తొలుత విరాట్ కోహ్లి (166నాటౌట్) వన్డేల్లో 46వ సెంచరీని, ఓవరాల్‌గా 74వ సెంచరీకి తోడు ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కూడా (116పరుగులు)సెంచరీ కదం తొక్కాడు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు 131పరుగులు జతచేశారు. తొలుత రోహిత్-గిల్ కలిసి 15.2ఓవర్లలో 95పరుగులు జతచేశారు. రజితకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత మహ్మద్ సిరాజ్(4/32) బౌలింగ్‌లో రాణించడంతో శ్రీలంక జట్టు 73పరుగులకే కుప్పకూలింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ విరాట్ కోహ్లికి లభించింది.

ఆంధ్ర-సౌరాష్ట్ర రంజీట్రోఫీ నేటినుంచి



రాజ్‌కోట్: ఆంధ్ర-సౌరాష్ట్ర జట్ల మధ్య సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో రంజీట్రోఫీ మ్యాచ్ జరగనుంది. ఎలైట్ గ్రూప్-బి లీగ్ దశలో భాగంగా ఇరుజట్లు తమ 6వ మ్యాచ్‌ను ఆడనున్నాయి. సౌరాష్ట్ర జట్టు ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 5మ్యాచుల్లో 3 మ్యాచుల్లో గెలిచి మరో 2మ్యాచ్‌లను డ్రా చేసుకుంది. దీంతో ఆ జట్టు 26పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఇక ఆంధ్రజట్టు 2మ్యాచులో గెలిచి మరో 2మ్యాచుల్లో ఓడింది. ఒక్క మ్యాచ్‌ను డ్రా చేసుకొని 13పాయింట్లతో 4వ స్థానంలో ఉంది. ఇ ఇరుజట్లకు ఈ మ్యాచ్‌లో గెలుపు తప్పనిసరి. ఇదే గ్రూప్‌లో ఉన్న హైదరాబాద్ జట్టు మహారాష్ట్రజట్టు ఎంసిఏ స్టేడియంలో మ్యాచ్ ఆడనుంది. మహారాష్ట్ర జట్టు 19పాయింట్లతో 3వ స్థానంలో ఉండగా.. హైదరాబాద్ జట్టు 4పరాజయాలతో ఆఖరి, 8వ స్థానంలో కొనసాగుతోంది.

హ్యాట్రిక్ హిట్ కోసం రామబాణం



శ్రీవాస్, టి.జి.విశ్వప్రసాద్, గోపీచంద్, డింపుల్ హయతి, వివేక్ కూచిభొట్ల

గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్‌ది టాలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ కాంబినేషన్. 'లక్ష్యం, లౌక్యం' వంటి సూపర్ హిట్లను అందించారు. ఇప్పుడు మూడోసారి హ్యాట్రిక్ హిట్ కొట్టేందుకు ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో టి.జి.విశ్వ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో గోపీచంద్ సరసన నాయికగా డింపుల్ హయతి నటిస్తుండగా, జగపతి బాబు అన్నయ్యగా, కుష్బూ వదినగా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. గోపీచంద్ కెరీర్‌లో 30వ సినిమాగా రాబోతున్న ఈ చిత్ర షూటింగ్ కార్యక్రమాలు ప్రస్తుతం ముగింపు దశలో ఉన్నాయి.

సంక్రాంతి శుభవేళ ఈ చిత్రం పేరును 'రామబాణం'గా ప్రకటిస్తూ చిత్ర బృందం విడుదల చేసిన ప్రచార చిత్రం అందర్నీ ఆకట్టుకుంటోంది. 'అన్ స్టాపబుల్' కార్యక్రమంలో ప్రభాస్, గోపీచంద్ పాల్గొన్న సందర్భంలో ఈ చిత్రం పేరును 'రామబాణం'గా బాలకృష్ణ ప్రకటించడం తమకెంతో ఆనందాన్ని కలిగించిందని చిత్ర దర్శకుడు శ్రీవాస్, నిర్మాతలు టి.జి. విశ్వ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల పేర్కొన్నారు.

ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు సామాజిక సందేశం కూడా మిళితమైన బలమైన కథాంశం ఉన్న చిత్రమిది. ఈ చిత్రంలో సరికొత్త గోపీచంద్‌ను చూడబోతున్నారు.'లక్ష్యం, లౌక్యం' ఈ రెండు సినిమాలను మించేలా ఉండాలని ఈ సినిమాని శ్రీవాస్ ఓ బాధ్యతతో తీర్చి దిద్దుతున్నాడు. వ్యయానికి వెనకాడకుండా చాలా గ్రాండ్‌గా, సమున్నత సాంకేతిక విలువలతో భారీ బడ్జెట్‌తో నిర్మాణం చేస్తూ ఈ చిత్రం విజయంపై నిర్మాతలు నమ్మకంతో ఉన్నారు. ఈ ఏడాది వేసవి కానుకగా చిత్రం విడుదల అయ్యే దిశగా చిత్ర నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. సచిన్ ఖేడ్ ఖర్, నాజర్, ఆలీ, రాజా రవీంద్ర, వెన్నెల కిషోర్, సప్తగిరి,కాశీ విశ్వనాథ్, సత్యగెటప్ శ్రీను, సమీర్, తరుణ్ అరోరా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : మిక్కీ జే మేయర్, డీఓపీ : వెట్రి పళని స్వామి, స్టోరీ : భూపతి రాజా, డైలాగ్స్ : మధుసూధన్ పడమటి, ఆర్ట్ డైరెక్టర్ : కిరణ్ కుమార్ మన్నె.



ఆకుల అఖిల్, దర్శక మీనన్

సరికొత్తగా బాలుగాడి లవ్‌స్టోరీ

ఆకుల భాస్కర్ సమర్పణలో భామ క్రియేషన్స్ పతాకంపై ఆకుల అఖిల్, దర్శక మీనన్, చిత్రం శ్రీను, జబర్దస్త్ గడ్డం నవీన్, జబర్దస్త్ చిట్టిబాబు, రేవతి నటీనటులుగా రూపొందుతున్న చిత్రం 'బాలుగాడి లవ్‌స్టోరీ'. యల్.శ్రీనివాస్ తేజ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ ఆకుల మంజుల నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఒక పాట మినహా షూటింగ్ మొత్తం పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది.ఈ కార్యక్రమంలో వీడియో బైట్ ద్వారా సినిమాటోగ్రఫీ మినిస్టర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విడుదల చేసిన చిత్ర టీజర్‌ను ప్రదర్శించారు. టీజర్ లాంచ్ అనంతరం ముఖ్య అతిథిగా వచ్చిన దర్శకులు సముద్ర చిత్ర మోషన్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హరి గౌడ్, శ్రీహరి గౌడ్, రెవలాన్స్ కాస్మటిక్స్ సౌత్ ఇండియా ఇన్చార్జి మహేష్, చిందం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంఆ నిర్మాత ఆకుల భాస్కర్ మాట్లాడుతూ, 'దర్శకుడు శ్రీనివాస్ తేజ్ చెప్పిన కథ నచ్చడంతో మా అబ్బాయిని హీరోగా పరిచయం చేస్తూ ఈ సినిమా తీశాం. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా చాలా బాగా వచ్చింది. మార్చిలో విడుదల అవుతున్న మా సినిమా ప్రేక్షకులందరికీ కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

'మంచి కథతో వస్తున్న ఈ చిత్రం లవ్, క్రైమ్, సస్పెన్స్‌తో చాలా బాగుంటుంది. ఈ సినిమాలో నటించిన హీరో, హీరోయిన్లు కొత్త వారైనా చాలా బాగా నటించారు. ఇందులో ఐదు పాటలు ఉండగా, ఒక్క ఐటమ్ సాంగ్ మినహా షూటింగ్‌తో పాటు టాకీ పార్ట్ మొత్తం పూర్తి చేశాం' అని దర్శకుడు యల్.శ్రీనివాస్ తేజ్ అన్నారు.

హీరో ఆకుల అఖిల్ మాట్లాడుతూ, సినిమా చాలా బాగా వచ్చింది. ఇందులో రొమాన్స్, యాక్షన్, సస్పెన్స్ ఇలా చాలా ఉన్నాయి. మంచి కథతో వస్తున్న ఈ సినిమా మంచి హిట్ అయితే మా పేరెంట్స్‌కు ఈ సినిమాను గిఫ్ట్‌గా ఇస్తాను' అని చెప్పారు. హీరోయిన్ దర్శక మీనన్ మాట్లాడుతూ, ' ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు' అని తెలిపారు.



ప్రతిష్టాత్మక క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుతో దర్శకుడు రాజమౌళి



హాలీవుడ్ దర్శక దిగ్గజం జేమ్స్ కామెరూన్ దంపతులతో రాజమౌళి

ఆర్ఆర్ఆర్‌కి మరో అరుదైన పురస్కారం

'నేను దర్శక దేవుడిగా భావించే ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ 'ఆర్ఆర్ఆర్' చిత్రాన్ని చూశారు. ఆయనకు ఈ సినిమా ఎంతో నచ్చింది. తన భార్యను కూడా ఈ చిత్రాన్ని చూడాలని ఆయన కోరారు. అంతేకాదు ఆమెతో కలిసి మరోమారు సినిమా చూశారు' అని దర్శకుడు రాజమౌళి సోషల్‌మీడియా ద్వారా తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జేమ్స్ కామెరూన్‌తో రాజమౌళి కలిసి దిగిన ఫొటోలు, 'ఆర్ఆర్ఆర్' సినిమా గురించి అలాగే రాజమౌళిని ప్రశంసించిన జేమ్స్ కామెరూన్ ఆడియో ప్రపంచ వ్యాప్తంగా వైరల్ అయ్యాయి.

ఆస్కార్ అవార్డుకి ఒక్క అడుగు దూరంలో ఉన్న 'ఆర్ఆర్ఆర్' సినిమా తాజాగా మరో అరుదైన పురస్కారాన్ని దక్కించుకుంది. ఉత్తమ విదేశీ భాషా చిత్రం, ఉత్తమ పాట విభాగాల్లో ప్రతిష్టాత్మక క్రిటిక్స్ ఛాయిస్ అవార్డులను సొంతం చేసుకుంది. 28వ క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల వేడుకలో ఈ అవార్డులను రాజమౌళి, కీరవాణి అందుకున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా డి.వి.వి.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డి.వి.వి.దానయ్య నిర్మించిన పాన్ ఇండియా చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ఈ సినిమా జాతీయంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రేక్షకుల విశేష ఆదరణ పొంది, భారీ కలెక్షన్లను రాబట్టింది. ఇటీవలే 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డుని సొంతం చేసుకుంది.

నవచిత్రం

కార్తీక్ రాజు కెరీర్‌లో గుర్తుండిపోయే అథర్వ



'పడేసావే, ఆపరేషన్ గోల్డ్ ఫిష్, కౌసల్య కృష్ణ మూర్తి' వంటి సినిమాలతో ప్రేక్షకుల మన్ననలు పొందిన యువకథానాయకుడు కార్తీక్ రాజు. ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం 'అథర్వ'. నేడు (మంగళవారం) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా 'అథర్వ' చిత్ర యూనిట్ హీరో కార్తీక్‌రాజుకి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపింది.

ఈ సినిమాలో సిమ్రన్ చౌదరి, ఐరాలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన అన్ని అప్ డేట్స్ సూపర్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు చివరి దశలో ఉన్నాయి. అతి త్వరలో ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు.

ఈ సినిమాను మహేష్ రెడ్డి తెరకెక్కిస్తుండగా, సుభాష్ నూతలపాటి నిర్మిస్తున్నారు. పెగ్గో ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద నిర్మిస్తున్న ఈ మూవీని నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సంయుక్తంగా సమర్పిస్తున్నారు. విజయ, ఝాన్సీ ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో అరవింద్ కృష్ణ ప్రముఖ పాత్రను పోషించారు.

ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి కార్తీక్ రాజు, సిమ్రన్ చౌదరి, ఐరా పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్‌లను విడుదల చేశారు. ఈ పోస్టర్లతో పాటు మోషన్ పోస్టర్, గ్లింప్స్ కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. దీంతో సినిమాకి మంచి బజ్ ఏర్పడింది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886